॥ ఓం శ్రీపరమాత్మనే నమః ॥

# అథ ద్వాదశోऽధ్యాయః - భక్తియోగః

# (పన్నెండవ అధ్యాయము - భక్తియోగము)

పన్నెండవ అధ్యాయం చాలా చిన్న అధ్యాయం. 20 శ్లోకాలు ఉన్నాయి ఇందులో. కాని చాలా ముఖ్యమైన అధ్యాయం. ఈ అధ్యాయం వేదాంతసారాన్నే కాదు, మొత్తం వేదసారాన్ని సంపూర్ణంగా వివరిస్తుంది.

పన్నెండవ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి –

1. భక్తియోగము – శ్లోకాలు 1-12
2. భక్తియోగఫలము – శ్లోకాలు 13-20

## భక్తి యోగము - ఒక విహంగ వీక్షణం

భక్తియోగము అనే ఈ అధ్యాయము భక్తి గురించి ఉన్న అనేక అపోహలను కూడా తొలగిస్తుంది.

**భక్తి నిర్వచనం** – భక్తి అంటే ఒక ప్రత్యేక సాధన కాదు, అనేక ఆధ్యాత్మిక సాధనలతో కూడినది. ఈ భక్తియోగం ఫలం మోక్షము. ఈ ఆధ్యాత్మిక సాధనలను వేదాలు మూడుగా వర్ణిస్తాయి. అవి కర్మయోగం, ఉపాసనయోగం, జ్ఞానయోగం. భగవద్గీత ఉపనిషత్తుల సారం కాబట్టి ఇందులో కూడా ఈ మూడు సాధనలనూ చూస్తాము. నిజానికి భక్తి అనే పదాన్ని విడిగా వేదాల్లో కాని, ఉపనిషత్తుల్లో కాని చూడము.

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తియోగం**

ఎందుకు ఈ మూడింటినీ శాస్త్రం భక్తియోగంగా పేర్కొంది? ఎందుకంటే, ఈశ్వరభక్తి ఉంటేనే ఈ మూడు యోగాలూ సాధ్యమని కృష్ణపరమాత్మ కూడా భావిస్తున్నాడు. ఈశ్వరభక్తి లేనిదే వీటిని ఆచరించలేము. అందువల్ల ఈ మూడింటినీ కలిపి భక్తియోగం అనవచ్చు. కాని వాటి మధ్య భేదాలను చూడాలనుకుంటే వాటికి స్థాయీ భేదాలను ఆపాదించవచ్చు.

భక్తియోగం స్థాయి 1 – కర్మయోగ లక్షణ భక్తియోగం

భక్తియోగం స్థాయి 2 – ఉపాసనయోగ లక్షణ భక్తియోగం

భక్తియోగం స్థాయి 3 – జ్ఞానయోగ లక్షణ భక్తియోగం

లక్షణం అంటే ఆ రూపంలో అని అర్థము.

ఈ మూడు దశలనే కృష్ణపరమాత్మ ఐదు దశలుగా విభజించాడు. కొన్నిచోట్ల మెట్లు చాలా ఎత్తుగా ఉంటే, వాటిని పడగొట్టి ఇంకా చిన్న మెట్లు చేస్తారు. ఆ విధంగా కృష్ణపరమాత్మ కూడా ఈ మూడు స్థాయిలను ఐదు స్థాయిలు చేశాడు.

| | | | |
|---|---|---|---|
| కర్మయోగం స్థాయి | 1 | – సకామకర్మ ప్రధాన కర్మయోగం | – 1 |
| కర్మయోగం స్థాయి | 2 | – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం | – 2 |
| ఉపాసనయోగం స్థాయి | 1 | – ఏకరూప ఈశ్వరధ్యానం | – 3 |
| ఉపాసనయోగం స్థాయి | 2 | – అనేకరూప ఈశ్వరధ్యానం | – 4 |
| జ్ఞానయోగం | | – అక్షర ఉపాసన | – 5 |

ఆ విధంగా కృష్ణపరమాత్మ కర్మయోగాన్ని రెండు దశలుగా, ఉపాసనయోగాన్ని రెండు దశలుగా విభజించాడు. జ్ఞానయోగాన్ని అలాగే ఉంచాడు. 2+2+1=5. వీటిని వివరంగా చూద్దాము.

1. **సకామకర్మ ప్రధాన కర్మయోగం** – రెండు దశల కర్మయోగాల్లో సూక్ష్మభేదం ఉంది. మోక్షంమీద కోరిక లేనివారు, మానవసేవమీద ఆపేక్ష లేనివారు, స్వార్థపూరితులుగా ఉండేవారు ఈ రకం కేవలకర్మరుల క్రిందకు వస్తారు. వారు ప్రాపంచిక సుఖాలు, లౌకిక లక్ష్యాలు కోరతారు. అలా కోరితే తప్పేంలేదు అంటాడు కృష్ణపరమాత్మ. ఎందుకంటే కోరికలను అణగద్రొక్కటం కూడా ప్రమాదమే. కోరికలను బుద్ధి అణగద్రొక్కితే, మనస్సు ఆ కోరికలు తీరాలనే తపనలో ఉంటుంది. అణగద్రొక్కబడిన ఆ కోరికలు ఎప్పుడో అగ్నిపర్వతంలా ప్రేలవచ్చు. అది వారికి చాలా ముప్పు తెస్తుంది.

భగవంతునిమీద భక్తి లేకపోయినా, మోక్షం కోరకపోయినా, అర్థకామాల వెంటే పరుగులు తీసినా ఫర్వాలేదు, అలా కొనసాగండి. కాని రెండు నిబంధనలు పాటించండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఎ) **ధర్మబద్ధం** – ఏ కోరికలు కోరినా, ఏ లక్ష్యాలు పొందినా వాటిని ధర్మపరంగానే పొందాలి. అక్రమ పద్ధతిలో సాధించకూడదు.

బి) **ఈశ్వరప్రసాదం** – ఇది ఇంకా ముఖ్యమైన నిబంధన. లౌకిక సుఖాల వెంట పరుగులు తీసి, వాటిని సాధించినా, ఆ ఫలాలను, ఆ సుఖాలను అనుభవించే ముందు వాటిని మీ గొప్పదనంగా భావించకూడదు; వాటిని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. ఒక మామూలు చొక్కానుంచి, ఒక ఇల్లుదాకా ఏం కొన్నా, వాటిని మనసారా అనుభవించవచ్చు, తప్పులేదు. కాని దాన్ని భగవంతుని ప్రసాదంగా భావించాలి. మీరు ఎన్నో కలలు కని, ఎన్నో ప్రణాళికలు వేసుకుని కొని ఉండవచ్చు ఆ ఇంటిని. కాని కృష్ణపరమాత్మ ఒక చిన్న కోరిక కోరుతున్నాడు. ఆ ఇంటిని భగవంతుని ఆలయంగా భావించమంటున్నాడు. భగవంతుడు ప్రసాదంగా పంపిన ఆలయంలో మీరు నివసిస్తున్నారు. ఆ భావనతోనే కొంతమంది తమ పిల్లలకు రామ్‌ప్రసాద్ అని పేరు పెడతారు.

ఇటువంటి భక్తిని సకామకర్మ ప్రధాన కర్మయోగం అంటారు. కామ్యకర్మలు చెయ్యండి, తప్పులేదు, కాని ప్రసాదబుద్ధితో చెయ్యండి; నిష్కామకర్మలు చెయ్యకపోయినా ఫర్వాలేదు. కాని నిషిద్ధకర్మలు చెయ్యకండి; పరోపకారకర్మలు చెయ్యకపోయినా సరే, ప్రసాదబుద్ధితో స్వీకరించండి. సకామకర్మ అనుష్ఠానం అంటారు దీనిని. సకామకర్మ అంటే మీ స్వంతప్రయోజనంకోసం చేసే కర్మలు.

**మొదటిస్థాయి కర్మయోగం – ఈశ్వరప్రసాదబుద్ధ్యా సకామకర్మ అనుష్ఠానం.**

2. **నిష్కామకర్మప్రధాన కర్మయోగం** – సకామకర్మ చేసినా కూడా, వచ్చిన ఫలాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరిస్తే, దృక్పథంలోని ఈ మార్పువల్ల, మనస్సు అంతకంతకూ శుద్ధి పొందుతూ వస్తుంది. మనస్సు శుద్ధి పొందిన కొద్దీ ఆత్మవిమర్శ మొదలవుతుంది. ఎంతసేపూ నా స్వార్థాన్నే చూసుకుంటున్నాను, దేశానికి నేనేమైనా చెయ్యవద్దా అనే ఆలోచన మొదలవుతుంది. ఈ ప్రశ్న వస్తేనే చిత్తశుద్ధి పొందినట్టు అర్థం. దేశం నాకేమిచ్చింది స్థాయినుంచి దేశానికి నేనేమిచ్చాను స్థాయికి ఎదుగుతారు. సకామకర్మనుంచి నిష్కామకర్మకు ఎదుగుతారు; స్వార్థకర్మనుంచి పరోపకారకర్మ చేసే స్థాయికి ఎదుగుతారు.

విజయం పొందటం అంటే తీసుకోవటం కాదు, ఇవ్వటం అనే ఎరుక వస్తుంది.

**న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః – కైవల్యం**

ఇది లౌకిక జీవనవిధానానికీ, ఆధ్యాత్మిక జీవన విధానానికీ మధ్య ఉన్న భేదం. లౌకిక జీవనవిధానంలో ఎంత పొందితే అంత విజయం; ఆధ్యాత్మిక జీవనవిధానంలో ఎంత త్యాగం చేస్తే అంత విజయం.

అందువల్ల కర్మయోగంయొక్క రెండవస్థాయిలో సకామకర్మలు తగ్గుతాయి; స్వార్థం తగ్గుతుంది, పరులమీద శ్రద్ధ ఏర్పడుతుంది. అందువల్ల ఈ స్థాయిని నిష్కామకర్మప్రధాన కర్మయోగం అని అంటారు. ఈ కర్మలు పరోపకారకర్మలు, నిష్కామకర్మలు పంచమహాయజ్ఞాలలో వస్తాయి. పరోపకారకర్మలు చెయ్యటానికి అంతకుముందు సమయం ఉన్నట్టే అనిపించేది కాదు. ఎంతసేపూ అర్థకామాల వెంట పరుగులు తీయటమే సరిపోయింది. ఇప్పుడలా కాదు, ఇప్పుడు ఇతరులకు సేవ చేసే తీరిక దొరికింది. ఉపకారం కేవలం ధనసహాయం రూపంలోనే ఉండనవసరం లేదు. వారితో కొంత సమయాన్ని వెచ్చించవచ్చు; నాలుగు మంచిమాటలు చెప్పవచ్చు; మనకున్న జ్ఞానాన్ని వారితో పంచుకోవచ్చు. ఇవన్నీ అహంభావంతో చెయ్యకూడదు. నేను కాబట్టి చేస్తున్నాను అనుకోకూడదు. ఈశ్వర అర్పణ భావనతో చెయ్యాలి.

**రెండవస్థాయి కర్మయోగం – ఈశ్వరార్పణ భావనయా నిష్కామకర్మ అనుష్ఠానం, పర ఉపకార అనుష్ఠానం**

ఈ రెండు స్థాయిల్లో ఉన్న భేదాలు –

| **సకామకర్మ** | **నిష్కామకర్మ** |
| --- | --- |
| ఎ) స్వార్థపూరితకర్మ చేస్తారు | నిస్వార్థకర్మ చేస్తారు |
| బి) సంకుచితంగా ఆలోచిస్తారు | ఇతరుల అవసరాలను గమనిస్తారు |
| సి) చిత్తశుద్ధి నెమ్మదిగా ఇస్తుంది | చిత్తశుద్ధి త్వరగా ఇస్తుంది |
| డి) ఈశ్వరప్రసాద భావనతో సకామకర్మ అనుష్ఠానం | ఈశ్వరార్పణ భావనతో నిష్కామకర్మ అనుష్ఠానం |

**కర్మయోగం = ఈశ్వరార్పణ బుద్ధి + ఈశ్వరప్రసాద బుద్ధి**

ఎప్పుడైతే మీరు ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలు చేసి, ఈశ్వరప్రసాద బుద్ధితో ఫలాన్ని స్వీకరించటం నేర్చుకుంటారో,

అప్పుడే మీరు మూడవస్థాయి భక్తికి అర్హులు అవుతారు. మూడవస్థాయి ఉపాసనయోగం. ఆ స్థాయిలో ఈశ్వరధ్యానం చేస్తారు.

ఉపాసనయోగానికి ఎందుకు వెళ్ళాలి? కర్మ చాలదా? నిస్సందేహంగా కర్మయోగం గొప్పతనం కర్మయోగానికి ఉంది. అది చిత్తశుద్ధిని కలుగజేస్తుంది. ఆధ్యాత్మికంగా ఎదగాలంటే, కర్మయోగం పాటించి తీరాలి. అందువల్ల కర్మయోగం ముఖ్యమే, కాని దానికుండే పరిమితులు దానికి ఉన్నాయి.

కర్మయోగి ఎంతసేపూ కర్మల్లో కూరుకుపోతాడు. అతను మొదటిస్థాయిలో ఉంటే సకామకర్మల్లోనూ, రెండవస్థాయిలో ఉంటే నిష్కామకర్మల్లోనూ కూరుకుపోతాడు. అంటే తన గురించి వెంపర్లాడతాడు; లేదా ఇతరుల గురించి ప్రాకులాడతాడు. ఎలా చూసినా ఎంతసేపూ బహిర్ముఖంగా ఉంటాడు. నిష్కామకర్మ చేసినా, సకామకర్మ చేసినా కూడా బహిర్ముఖంగానే ఉంటాడు. ఈ బహిర్ముఖత్వం జ్ఞానయోగానికి రావటానికి ఆటంకం కలుగజేస్తుంది. జ్ఞానయోగం అంటే ఆత్మవిచారణ –

**యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్**

జ్ఞానయోగంలో పంచకోశవివేకం చెయ్యాలి అంటే అంతర్ముఖులు అవ్వాలి. ఇంద్రియాలు బాహ్యంగా అమర్చి ఉన్నాయి, అందువల్ల అంతర్గతంగా చూడలేవు అంటుంది కఠోపనిషత్తు.

**పరాంచి ఖాని వ్యతృణత్ స్వయంభూః తస్మాత్ పరాజ్ పశ్యతి నాన్తరాత్మాన్ ।**

బాహ్యంగా చూసేవారు ఆత్మజ్ఞానం పొందలేరు. అందువల్ల వారు ఉపాసనకు రావాలి. ఉపాసనలో అంతర్ముఖులు అవుతారు. ఈశ్వరుణ్ణి హృదయంలోకి ఆవాహన చేసి, ధ్యానం చేస్తారు. అంటే మనస్సుకు అంతర్ముఖంగా చూసే సాధనను ఇస్తుంది.

ఉపాసనయోగాన్ని కూడా కృష్ణపరమాత్మ రెండు స్థాయిలుగా విభజించాడని చూశాము. అవి ఏకరూప ఈశ్వరధ్యానం, అనేకరూప ఈశ్వరధ్యానం.

3. **ఏకరూప ఈశ్వరధ్యానం** – ఈ ఏకరూప ఈశ్వరధ్యానాన్ని ఇష్టదేవతా ఉపాసన అని కూడా అంటారు. ఈ ధ్యానాన్ని కృష్ణపరమాత్మ అభ్యాసయోగం అంటున్నాడు. భగవంతుణ్ణి ఒక రూపంలో కొలుస్తారు ఇందులో. రాముడు, కృష్ణుడు, దేవి, లక్ష్మి, సరస్వతి – ఈ రూపాల్లో ఏదో ఒక రూపంలో కొలుస్తారు. ఇది మూడవ స్థాయిభక్తి. **మొదటి స్థాయి ఉపాసన యోగం – ఏకరూప ఈశ్వరధ్యానం**

4. **అనేకరూప ఈశ్వరధ్యానం** – ఏకరూప ఈశ్వరధ్యానం బాగా సాధన చేశాక దాన్ని అనేకరూప ఈశ్వరధ్యానంగా మార్చుకోమంటున్నాడు కృష్ణపరమాత్మ. దీన్నే విశ్వరూప ఈశ్వరధ్యానం అని కూడా అంటారు. ఈ విశ్వరూపదర్శనాన్ని వివరంగా పదకొండవ అధ్యాయంలో చూశాము. కృష్ణుడు ఒక చోటుకే పరిమితమైన వ్యక్తికాదు, ఆయన సర్వవ్యాపకమైన భగవంతుడు. కృష్ణుణ్ణి ఇష్టదేవతగా ప్రార్థిస్తే ఆయనకు కూడా దేశకాల పరిమితులు వస్తాయి.

**రెండవ స్థాయి ఉపాసన యోగం – అనేకరూప ఈశ్వరధ్యానం**

రెండు ఉపాసనలకూ మధ్య సూక్ష్మమైన భేదాలు ఉన్నాయి.

| **ఏకరూప ధ్యానం** | **అనేకరూప ధ్యానం** |
|---|---|
| ఎ) చిత్త ఏకాగ్రత పెంపొందిస్తుంది | చిత్త వైశాల్యత పెంపొందిస్తుంది |
| బి) ఏకరూప ఈశ్వరధ్యానం చేస్తారు | అనేకరూప ఈశ్వరధ్యానం చేస్తారు |

రెండు ఉపాసనలూ కూడా సగుణ ఈశ్వరధ్యానంలోకే వస్తాయి. సగుణ అంటే గుణాలు ఉన్న ఈశ్వరుడని అర్థం. విశ్వరూప ఈశ్వరునికి కూడా అనేక గుణాలు ఉంటాయి. ఇవి ఉపాసనలో ఉన్న రెండు స్థాయిలు.

కర్మయోగం 1, 2 = ఈశ్వరార్పణబుద్ధి + ఈశ్వరప్రసాదబుద్ధి
ఉపాసనయోగం 1, 2 = చిత్త ఏకాగ్రత + చిత్తవైశాల్యత
కర్మయోగం + ఉపాసనయోగం = జ్ఞానయోగ్యతా ప్రాప్తి.

ఆ విధంగా కర్మ, ఉపాసనలయొక్క నాలుగు స్థాయిలూ పాటిస్తే వాటితో జ్ఞానయోగ్యతా ప్రాప్తి కలుగుతుంది. అప్పుడు ఐదవస్థాయి అయిన జ్ఞానయోగంలోకి రావచ్చు.

5. **జ్ఞానయోగం** – జ్ఞానయోగం అంటే నిర్గుణ ఈశ్వరుడు. నిర్గుణ ఈశ్వరుణ్ణి బ్రహ్మ అని కూడా అంటారు. భగవంతుణ్ణి వ్యావహారిక స్థాయిలో సగుణ ఈశ్వరుడు అంటే, పారమార్థిక స్థాయిలో నిర్గుణ ఈశ్వరుడు అంటారు. ఏడవ అధ్యాయంలో అపరాప్రకృతి, పరాప్రకృతి పేర్లు చూశాము. సగుణ ఈశ్వరుణ్ణి అపరాప్రకృతి అనీ, నిర్గుణ ఈశ్వరుణ్ణి పరాప్రకృతి అనీ అంటారు. ఇంతవరకూ చూసింది అపరాప్రకృతిరూప ఈశ్వరధ్యానం.

ఇప్పుడు జ్ఞానయోగంలో నేర్చుకునేది పరాప్రకృతిరూప ఈశ్వరవిచారణ. ఈశ్వరవిచారణలో మళ్ళీ మూడు దశలు ఉన్నాయి. అవి శ్రవణం, మననం, నిదిధ్యాసనం.

ఎ) **శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాలపాటు, ఒక శ్రోత్రియ బ్రహ్మనిష్ఠ అయిన గురువు దగ్గర వేదాంత అధ్యయనం చెయ్యాలి. ఈ బోధలో నిర్గుణ ఈశ్వరుని గురించి నేర్చుకుంటారు. కేవలం నిర్గుణబ్రహ్మ గురించి నేర్చుకోవటమే కాదు, ఆ నిర్గుణబ్రహ్మ మీ ఉన్నతస్థితి అని తెలుసుకుంటారు. అహం బ్రహ్మ అస్మి అనే జ్ఞానం పొందుతారు. మీరు చైతన్యపరంగా బ్రహ్మ.

సగుణ బ్రహ్మజ్ఞానానికీ, నిర్గుణ బ్రహ్మజ్ఞానానికీ మధ్య సూక్ష్మభేదం ఉంది.

| **సగుణబ్రహ్మ** | **నిర్గుణబ్రహ్మ** |
|---|---|
| i) ద్వైతభావన ఉంటుంది | అద్వైతభావన ఏర్పడుతుంది |
| ii) ఈశ్వరుడు వేరు, నేను వేరు అనుకుంటారు | ఈశ్వరుడూ, నేనూ ఒక్కటే అని అర్థం చేసుకుంటారు |

బి) **మననం** – మననం అంటే నిశ్చయజ్ఞానం పొందటం. బుద్ధిలో కలిగే సందేహాలను పారద్రోలుతుంది మననం.

సి) **నిదిధ్యాసనం** – నిదిధ్యాసనం అంటే జ్ఞాననిష్ఠలో నిలబడటం. అది మనస్సులో ఉండే రాగద్వేషాలను

పారద్రోలుతుంది. మనలో సంవత్సరాల తరబడీ ఉన్న పాతవాసనలు త్వరగా పోవు. వాటిని విపరీత భావనలు అంటారు. ఆ విపరీత భావనలను తొలగించటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది.

**జ్ఞానయోగం = శ్రవణం + మననం + నిదిధ్యాసనం**

**జ్ఞానయోగం - అక్షర ఉపాసన**

జ్ఞానం పొందేది నిర్గుణబ్రహ్మ గురించి అని మర్చిపోకూడదు. నిర్గుణబ్రహ్మ అంటే నిరాకార బ్రహ్మ; స్త్రీ, పురుష భేదం ఉండదు.

**నాసన్న సన్న సదసన్న మహాన్న చాణు**
**నస్త్రీ పుమాన్న చ నపుంసకమేకబీజమ్।** – ధన్యాష్టకమ్

**అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్**
**తథారసం నిత్యమగంధవచ్చయత్** – కఠ

రంగు, రుచి, రూపం, స్పర్శ, వాసనలేవీ ఉండవు. ఈ ఐదు సాధనలనూ కలిపి భక్తియోగం అంటారు.

**భక్తియోగం = కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం.**

ఎవరినీ నువ్వు భక్తియోగం పాటిస్తావా, జ్ఞానయోగం పాటిస్తావా అని అడగకండి. ఎందుకు? కర్మయోగం ఒక విధమైన భక్తి, ఉపాసనయోగం ఇంకొక విధమైన భక్తి, జ్ఞానయోగం కూడా మరొక విధమైన భక్తి. మూడూ మూడు స్థాయీభేదాలున్న భక్తులు. ఎవరైనా సరే, ఈ ఐదు స్థాయిలూ దాటుకుంటూ రావాలి. ఎవరూ పుడుతూనే భగవంతునిమీద భక్తితో పుట్టరు. అనేక లౌకిక సుఖాలతో మొదలుపెడతారు ఎవరైనా కూడా. అందువల్ల ముందు సకామభక్తితో మొదలుపెట్టాలి. వేదమే అనేక సకామకర్మలను నిర్దేశించింది. ఓం ప్రథమంగా మోక్షం కోరండి అని ఆదేశించదు వేదం.

వేదం పుత్రులు పుట్టటానికి, ధనం సంపాదించటానికి, ఆరోగ్యం పొందటానికి, లౌకికసుఖాలను పొందటానికి అనేక యాగాలను చెప్పింది. ఉదాహరణకు పుత్రులు పుట్టటానికి పుత్రకామేష్ఠియాగం చెప్పింది, అలా సకామభక్తితో మొదలుపెట్టి, చివరకి జ్ఞానయోగానికి రమ్మంది. ఇదీ మొదటి పన్నెండు శ్లోకాల సారాంశం.

### 2. భక్తియోగఫలం: శ్లోకాలు 13-20

ఈ ఐదు దశల భక్తిని విజయవంతంగా దాటి, ఆత్మజ్ఞానం పొందిన జ్ఞానిస్వభావాన్ని వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ ఈ శ్లోకాల్లో. జ్ఞానం పొందిన భక్తుణ్ణి జ్ఞాని అనీ, పరాభక్తుడనీ అంటారు. అతను అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందివుంటాడు. అటువంటి భక్తుడు అంటే నాకు ప్రియతమం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

తక్కిన భక్తులు ప్రియం లేదా ప్రియతరం కాని, జ్ఞానీభక్తుడు ప్రియతమం. అందరికన్నా ఆత్మీయుడు. ఎందుకు? నిర్గుణభక్తిలో భగవంతునికీ, భక్తునికీ మధ్య దూరం కాని, భేదం కాని లేదు. భగవంతునితో భక్తుడు ఐక్యం చెందుతాడు. **జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్** (7.18)

అతను నన్నే పొందుతాడు అన్నాడు ఏడవ అధ్యాయంలో. అందువల్ల పరాభక్తుని లక్షణాలను ఈ అధ్యాయంయొక్క రెండవ భాగంలో చూస్తాము. ఈ నేపథ్యంతో ఈ అధ్యాయంలోకి అడుగు పెడదాము.

**అర్జున ఉవాచ**

శ్లో. 1 **ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**
**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥**
ఏవమ్, సతతయుక్తాః, యే, భక్తాః, త్వామ్, పర్యుపాసతే,
యే, చ, అపి, అక్షరమ్, అవ్యక్తమ్, తేషామ్, కే, యోగవిత్తమాః ॥

| | | | |
|---|---|---|---|
| ఏవమ్ | = పూర్వోక్తరీతిగా | అక్షరమ్ | = నాశరహితుడవైన |
| త్వామ్ | = సగుణరూప పరమేశ్వరుడవైన నిన్ను | అవ్యక్తమ్, అపి | = నిరాకార సచ్చిదానంద పరబ్రహ్మవగు నిన్ను |
| సతతయుక్తాః | = నిరంతరము భజన ధ్యానాదులతో ఉపాసించునట్టి | పర్యుపాసతే | = మిక్కిలి ఏకాగ్రచిత్తులై భజింతురో |
| | | తేషామ్ | = ఆ రెండు విధములైన ఉపాసకులలో |
| యే, భక్తాః | = ఏ అనన్యభక్తులు గలరో | యోగవిత్తమాః | = అత్యుత్తమ యోగవిదులు |
| చ | = ఇంకా | కే | = ఎవరు? |
| యే | = ఎవరయితే | | |

**(హే భగవన్) ఏవమ్ సతత-యుక్తాః యే భక్తాః త్వామ్ పర్యుపాసతే,**
**యే చ అపి అవ్యక్తమ్ అక్షరమ్ (పర్యుపాసతే) తేషామ్ (మధ్యే) కే యోగ-విత్తమాః (సన్తి) ।**

తా: పూర్వోక్తరీతిగా సగుణరూప పరమేశ్వరుడవైన నిన్ను నిరంతరము భజన ధ్యానాదులతో ఉపాసించునట్టి ఏ అనన్యభక్తులు గలరో ఇంకా ఎవరయితే నాశరహితుడవైన నిరాకార సచ్చిదానంద పరబ్రహ్మవగు నిన్ను మిక్కిలి ఏకాగ్రచిత్తులై భజింతురో, ఆ రెండు విధములైన ఉపాసకులలో అత్యుత్తమ యోగవిదులు ఎవరు?

**ఉపోద్ఘాతము: శ్లోకాలు 1, 2**

ఈ అధ్యాయం అర్జునుడు వేసిన ప్రశ్నతో మొదలవుతుంది. ఆ ప్రశ్న అంతకుముందు అధ్యాయంలో కృష్ణపరమాత్మ చేసిన బోధ ఆధారంగా వస్తుంది. దాన్ని అనుప్రశ్న అంటారు. ప్రశ్న అంటే స్వతంత్రంగా వేసే ప్రశ్న. అనుప్రశ్న అంటే అంతకుముందు నేర్చుకున్న బోధనుంచి ఉదయించిన ప్రశ్న.

అర్జునుడు అడిగిన ప్రశ్న – సగుణభక్తుడు గొప్పవాడా, నిర్గుణభక్తుడు గొప్పవాడా? అంటే సగుణ ఈశ్వరుణ్ణి ధ్యానించే భక్తుడు ఎక్కువా, నిర్గుణ ఈశ్వరుణ్ణి అర్థం చేసుకునే భక్తుడు ఎక్కువా?

చాలా ముఖ్యమైన ప్రశ్న ఇది. మొదటి పాదంలో సగుణ ఈశ్వరభక్తుణ్ణి వర్ణిస్తున్నాడు.

**భక్తాః త్వాం పర్యుపాసతే** – కొంతమంది భక్తులు ఉన్నారు; వారు సగుణ ఈశ్వరుణ్ణి ధ్యానం చేస్తారు. ఎలా?

**సతతయుక్తాః** – ఒక తపనతో నిరంతరమూ చేస్తారు. సగుణ ఈశ్వరుణ్ణి రెండు స్థాయిల్లో కొలుస్తారు. ఏకరూప సగుణ ఈశ్వరునిగా, అనేకరూప సగుణ ఈశ్వరునిగా. ఈ రెండింటిలో అర్జునుడు ఏ స్థాయి గురించి అడుగుతున్నాడు?

**ఏవమ్** – ఏకాదశ అధ్యాయయుక్త ప్రకారేణ – అంటే పదకొండవ అధ్యాయంలో వివరించబడ్డ ఈశ్వరుణ్ణి. పదకొండవ అధ్యాయంలో వర్ణించబడినది అనేకరూప ఈశ్వరుడు. అంటే ఈశ్వరునియొక్క విశ్వరూపదర్శనం అయింది అందులో. పురుషసూక్తం, రుద్రంలో ఈ విశ్వరూపదర్శనం కలుగుతుంది. అందువల్ల ఏవమ్ అంటే విశ్వరూప సగుణ ఈశ్వరుడు.

తర్వాత పాదంలో నిర్గుణభక్తులను పరిచయం చేస్తున్నాడు అర్జునుడు.

**యే చ అపి** – మరికొందరు ఉన్నారు; ఏం చేస్తారు వారు?

**అవ్యక్తమ్ అక్షరం (పర్యుపాసతే)** – పర్యుపాసతే ఈ పాదంలో లేదు. పై పాదంనుంచి తెచ్చుకోవాలి.

**అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే** – 8.3

పరమం బ్రహ్మను అక్షర ఈశ్వరుడు అన్నాడు కృష్ణపరమాత్మ ఎనిమిదవ అధ్యాయంలో. ఈ పరబ్రహ్మ గుణాతీతుడు. అందువల్ల అక్షరం బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ, అవ్యక్తం బ్రహ్మ. అవ్యక్తం అంటే సర్వ ఇంద్రియ అగోచరం. ఈ నిర్గుణబ్రహ్మ అవ్యక్తం అయితే ఎలా ఆ అవ్యక్తబ్రహ్మమీద కొందరు ధ్యానం చేస్తారు?

నిర్గుణబ్రహ్మ ఆబ్జెక్టుగా దొరకకపోతే, ఎలా ఆయనమీద ధ్యానం చేస్తారు? ఒకటే పద్ధతి ఉంది. బ్రహ్మను ఆబ్జెక్టుగా కాదు, సబ్జెక్టుగా భావించాలి. దాన్ని ఆత్మధ్యానం అంటారు. అలా కొంతమంది నిర్గుణబ్రహ్మధ్యానం చేస్తారు. ఇప్పుడు అర్జునుని ప్రశ్న వీరిలో ఎవరు గొప్పవారు?

**తేషామ్** – తయోర్మధ్యే – వీరిద్దరిలో;

**కే యోగవిత్తమాః** – సగుణ ఉపాసకుడు గొప్పవాడా, నిర్గుణ ఉపాసకుడు గొప్పవాడా? ఈ అనుప్రశ్నకు కృష్ణపరమాత్మ జవాబు చెప్పబోతున్నాడు.

**శ్రీభగవాన్ ఉవాచ**

శ్లో. 2 **మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే ।**
**శ్రద్ధయా పరయోపేతాః తే మే యుక్తతమా మతాః ॥**
మయి, ఆవేశ్య, మనః, యే, మామ్, నిత్యయుక్తాః, ఉపాసతే,
శ్రద్ధయా, పరయా, ఉపేతాః, తే, మే, యుక్తతమాః మతాః ॥

| | | | |
|---|---|---|---|
| మయి | = నా యందు | మామ్ | = సగుణరూప పరమేశ్వరుడనైన నన్ను |
| మనః, ఆవేశ్య | = మనస్సు ఏకాగ్రమొనర్చి | ఉపాసతే | = ఉపాసింతురో |
| నిత్యయుక్తాః | = నిరంతరము నా భజన ధ్యానాదులందు నిమగ్నమై | తే | = వారు |
| యే | = ఏ భక్తులు | మే | = నాకు |
| పరయా, శ్రద్ధయా | = అత్యంత భక్తిశ్రద్ధలతో | యుక్తతమాః | = యోగులలో అత్యుత్తములని |
| ఉపేతాః | = కూడినవారై | మతాః | = భావింపబడుదురు |

**(హే అర్జున!) మయి మనః ఆవేశ్య నిత్య-యుక్తాః (సన్తః) యే పరయా**
**శ్రద్ధయా ఉపేతాః మామ్ ఉపాసతే, తే యుక్తతమాః మే మతాః ।**

తా: నా యందు మనస్సు ఏకాగ్రమొనర్చి, నిరంతరము నా భజనధ్యానాదులందు నిమగ్నమై ఏ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కూడినవారై, సగుణరూప పరమేశ్వరుడనైన నన్ను ఉపాసింతురో వారు నాకు యోగులలో అత్యుత్తములని భావింపబడుదురు.

ప్రశ్న ఏమిటి? సగుణభక్తి గొప్పదా, నిర్గుణభక్తి గొప్పదా? ఎవరినైనా ఈ ప్రశ్న అడిగితే, సాధారణంగా సగుణభక్తి గొప్పది అంటారు. ఎందుకంటే సగుణభక్తిలోనే నానాత్వం ఉంది, అందం ఉంది.

**అధరం మధురం వదనం మధురం నయనం మధురమ్**

నిర్గుణ ఈశ్వరునికి ఆకారమే లేనప్పుడు రంగు, రూపు, శబ్ద, స్పర్శ, గంధాలకు అందనప్పుడు, ఎవరికి నచ్చుతాడు? అసలు చాలా దర్శనాలు నిర్గుణబ్రహ్మను ఒప్పుకోవు.

ఈ ప్రశ్నకు అందరూ ఇచ్చే జవాబు పక్కన పెడితే, అసలు జవాబు ఏమిటి? అసలు జవాబు – **ఈ ప్రశ్నే తప్పు. తప్పు ప్రశ్నకు సరియైన జవాబులేదు**. ఒక క్లిప్పు చూపించి దీని బరువు ఎన్ని కిలోమీటర్లు లేదా ఎన్ని సెంటీమీటర్లు అంటే ఎలా ఉంటుంది? దానికి జవాబు చెప్పకుండా ప్రశ్న అడిగిన వారిని తేరపారచూస్తారు. ఎందుకు? ఒక వస్తువు బరువును కిలోమీటర్లలోనో, సెంటీమీటర్లలోనే కొలవలేరు కాబట్టి. వాటిని దూరాన్ని కొలవటానికి వాడతారు.

రెండు విషయాలు ఎన్నుకుని, ఈ రెండింటిలో ఏది గొప్పది అని ప్రశ్న అడగాలంటే, ఆ రెండు విషయాలు ఒకటే మాదిరి విషయాలై ఉండాలి. రెండు భిన్న విషయాలను పోల్చలేము. ఎవరైనా మీ ఇంటికి వస్తే, ఏం తాగుతారు అంటారు. అంటే కాఫీ, టీ, పాలు, చల్లని పానీయం – వీటిలో ఏదైనా ఒకటి కోరుకుంటారు వారు. అలాగే ఎవరైనా పెద్దవారు ఇంటికి వస్తే గ్లాసులో తాగుతారా, కప్పులో తాగుతారా అని అడుగుతారు. అంటే ఏ పాత్రలో కావాలి అనేది రెండవ ప్రశ్న. అలాకాకుండా మీరు మీ ఇంటికి వచ్చినవారిని గ్లాసు కావాలా, కాఫీ కావాలా అని అడుగుతారా? గ్లాసుకి, గ్లాసులో ఉండే వస్తువుకీ మధ్య పోలిక కుదరదు.

అదే విధంగా రెండు మార్గాలు ఉంటే ఏ మార్గంలో వెళ్ళాలనే సందేహం కలగవచ్చు. అలాగే రెండు గమ్యాలు ఉంటే ఏ గమ్యం అనుకోవచ్చు. మార్గమా, గమ్యమా అనుకోలేరు. ఇంకో ఉదాహరణ చూద్దాము. రెండు ప్యాంటులు చూపించి, ఇందులో ఏది వేసుకోను అని మీరు ఎవరినైనా అడగవచ్చు. అలాగే రెండు షర్టులు చూపించి, ఏది వేసుకోను అని అడగవచ్చు. అంతేకాని ప్యాంటు వేసుకోనా, షర్టు వేసుకోనా అని అడగగలరా?

అందువల్ల, పోలిక ఎప్పుడూ రెండు సమాన వస్తువుల మధ్య వస్తుంది. ఆ సూత్రం ప్రకారం సగుణభక్తి, నిర్గుణభక్తులను ఎన్నడూ పోల్చలేము. ఎందుకంటే ఒకటి సాధన, ఇంకొకటి సాధ్యం. సగుణభక్తి సాధనం. సాధనం అంటే మార్గం; మొదటి మెట్టు. సగుణభక్తి అనే మెట్టు ఎక్కి, నిర్గుణభక్తి అనే సాధ్యాన్ని చేరాలి. సగుణభక్తి ద్వైతం; నిర్గుణభక్తి అద్వైతం; సగుణభక్తి భేదాన్ని చూపిస్తే, నిర్గుణభక్తి అభేదాన్ని చూపిస్తుంది; సగుణభక్తి మార్గం అయితే, నిర్గుణభక్తి గమ్యం అవుతుంది. ఆ విధంగా, ఎలా చూసినా ఈ రెండింటి మధ్య సారూప్యం లేదు.

**సగుణభక్తి లేనిదే నిర్గుణభక్తి అసంభవం**
**నిర్గుణభక్తికి రానిదే సగుణభక్తి అసంపూర్ణం**

అందువల్ల ప్రతి ఒక్కరు సగుణభక్తిలో ఉండి, దానిద్వారా నిర్గుణభక్తికి రావాలి. నిర్గుణభక్తిని అభేద అద్వైతజ్ఞానం అంటారు. ప్రతిఒక్కరి ప్రయాణం – సగుణభక్తిద్వారా నిర్గుణభక్తికి చేరుకోవటం.

రెండూ ముఖ్యమే. రెండూ సాధకునికి మేలుచేస్తాయి. ఒక రకం ఆహారం ప్రొటీనులను ఇస్తే, ఇంకొక రకం ఆహారం కార్బోహైడ్రేట్సును ఇచ్చినట్టుగా, ఒక ధ్యానం ఇచ్చే ఫలితాన్ని ఇంకొక ధ్యానం ఇవ్వలేదు. అందువల్ల రెండూ చేసితీరాలి.

రెండు రకాల ధ్యానాలూ చేసితీరాలంటే, ఎలా చెయ్యాలి? దానికి జవాబు కృష్ణపరమాత్మే తర్వాత చెబుతాడు. రెండింటినీ ఒకేసారి సాధన చెయ్యలేము, ఒకదాని తరువాత ఒకటి చెయ్యాలి. పట్టభద్రులు అవ్వాలంటే స్కూలుకు వెళ్ళాలా, కాలేజీకి కూడా వెళ్ళాలా అంటే ఏం చెబుతారు? రెండూ కావాలి అంటారు. రెండూ కావాలంటే అయితే రెండింటికీ ఒకేసారి వెళ్ళవచ్చా? పొద్దున్న స్కూలుకు, సాయంకాలం కాలేజీకి వెళ్ళవచ్చా? ముందు స్కూలుకి వెళ్ళి, అర్హత పొంది, తరువాత కాలేజీకి వెళ్ళి జ్ఞానం పొంది పట్టభద్రులు అవాలి అని చెబుతాము.

సంస్కృతం మూడు స్థాయిలలో బోధిస్తున్నారనుకోండి – ప్రాథమిక స్థాయి, మాధ్యమిక స్థాయి, ఉన్నతస్థాయి. ప్రాథమిక స్థాయిలో అక్షరాలు నేర్పిస్తారు; మాధ్యమిక స్థాయిలో కొన్ని అంశాలు నేర్పిస్తారు; ఉన్నతస్థాయిలో పాణినీ సూత్రాలు నేర్పిస్తారు. మూడు క్లాసుల్లోనూ ఒక్కసారే కూర్చోలేరు. ఒకటి నేర్చుకుని, రెండవదానికి వెళ్ళాలి. అంటే ఒకదాని తర్వాత ఒకటి చెయ్యాలి. అక్కడ కూడా మళ్ళీ సందేహం. ఏది ముందు నేర్చుకోవాలి? ముందు కాలేజీకి వెళ్ళి, తర్వాత స్కూలుకు వెళ్ళవచ్చా? ముందు పాణినీ సూత్రాలు నేర్చుకుని, తర్వాత అక్షరాలు నేర్చుకోవచ్చా? అలా కుదరదు. దానికీ ఒక పద్ధతి ఉంటుంది – ప్రాథమిక స్థాయినుంచి క్రమేపీ ఉన్నతస్థాయికి ఎదగాలి. స్కూలునుంచి కాలేజీకి రావాలి.

ఇప్పుడు ఈ రెండు ధ్యానాలు తీసుకుంటే, సగుణధ్యానంనుంచి నిర్గుణధ్యానానికి రావాలి. సగుణధ్యానం చిత్తశుద్ధి, చిత్త ఏకాగ్రతలను కలుగజేస్తుంది. అందువల్ల సగుణధ్యానం చేసి, చిత్తశుద్ధి చిత్త ఏకాగ్రతలను పొంది, నిర్గుణధ్యానానికి రావాలి. అందువల్ల ఈ రెండింటిలో ఏది గొప్పది అనే ఈ ప్రశ్నే తప్పు. కాని కృష్ణపరమాత్మ, 'అర్జునా నీ ప్రశ్నే తప్పు,' అని అతన్ని కించపరచడు.

కొంతమంది ఏదైనా ప్రశ్న అడిగేముందు, 'నా ప్రశ్న మీకు అర్థం లేనిదిగా కనిపించవచ్చు,' అని వారే ముందే చెప్పేస్తారు. అసలు ఏదైనా ప్రశ్నకు జవాబు తెలిశాక, ఆ ప్రశ్న అర్థం లేనిదిగానే అనిపిస్తుంది. కాని జవాబు తెలిసేంతవరకూ, అది చాలా ముఖ్యమైన ప్రశ్నగానే అనిపిస్తుంది. ఆ విషయం గురువుకు తెలుసు.

కృష్ణపరమాత్మ కూడా అర్జునుని ప్రశ్నను విమర్శించకుండా, అతన్ని చిన్నచూపు చూడకుండా, దానికి జవాబు నర్మగర్భంగా, తెలివిగా చెబుతాడు. సగుణభక్తులు గొప్పవారు; నిర్గుణభక్తులు నన్ను పొందుతారు అన్నాడు. ఈ నేపథ్యంతో రెండవ శ్లోకం అర్థాన్ని చూద్దాము.

**శ్రీభగవాన్ ఉవాచ** – భగవంతుడు జవాబు చెబుతున్నాడు.

**మయి ఆవేశ్య మనః యే మామ్ ఉపాసతే** – కొంతమంది భక్తులు నన్ను ధ్యానం చేస్తారు. మామ్ అంటే నన్ను. ఎటువంటి నన్ను? సగుణ మామ్ అని కలుపుకోవాలి. సగుణ ఈశ్వరుడు అంటే ఈ రెండు స్థాయిల్లో ఏదైనా అవవచ్చు – ఏకరూప ఈశ్వరుడు, అనేకరూప ఈశ్వరుడు. అనేకరూప ఈశ్వరునికి ఇంకొక పేరు విశ్వరూప ఈశ్వరుడు. విశ్వరూప ఈశ్వరుడు కూడా సగుణరూపంలోకే వస్తాడు.

ఎలా చేస్తారు ధ్యానం? మయి ఆవేశ్య – వారి మనస్సును నామీదే నిలిపి. అంటే ఏకాగ్రచిత్తంతో ధ్యానం చేస్తారు. అంటే ఒకరోజు చేసి, నాలుగు రోజులు మానేయరు.

**నిత్యయుక్తాః** – నిరంతరం చేస్తారు. ఒక అంకితభావంతో, క్రమం తప్పకుండా, ఒక తపనతో సగుణ ఈశ్వరధ్యానం చేస్తారు.

**పరయా శ్రద్ధయా ఉపేతాః** – వారికి నామీద అత్యంత భక్తిశ్రద్ధలు ఏర్పడతాయి అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉపాసన చేస్తే లౌకిక ఫలితాలకన్నా ఆధ్యాత్మిక ఎదుగుదల ఉంటుంది. ఉపాసకునికి చిత్తశుద్ధి, చిత్తఏకాగ్రత, చిత్తవైశాల్యత ఏర్పడుతుంది – ఈ మార్పు బాహ్యంగా కనపడకపోవచ్చు. కాని ఈ ఉపాసకులు భగవంతుని మీద అపారమైన భక్తిశ్రద్ధలతో సగుణ ఈశ్వరధ్యానం చేస్తారు.

**తే మే యుక్తతమా మతాః** – అటువంటి సగుణధ్యానం చేసేవారు నిజంగా అత్యుత్తములు.

ఇక్కడ సగుణ ఉపాసకులను కీర్తించి, తర్వాత వచ్చే శ్లోకాలలో నిర్గుణ ఉపాసకులు నన్ను పొందుతారు అంటాడు. అంటే ఈ రెండింటి మధ్య పోలిక లేదని చెప్పకనే చెబుతున్నాడు.

శ్లో. 3 **యే త్వక్షరమనిర్దేశ్యమ్ అవ్యక్తం పర్యుపాసతే ।**
**సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥**

శ్లో. 4 **సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।**
**తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥**

యే, తు, అక్షరమ్, అనిర్దేశ్యమ్, అవ్యక్తమ్, పర్యుపాసతే,
సర్వత్రగమ్, అచింత్యమ్, చ, కూటస్థమ్, అచలమ్, ధ్రువమ్ ॥
సంనియమ్య, ఇంద్రియగ్రామమ్, సర్వత్ర, సమబుద్ధయః, తే,
ప్రాప్నువంతి, మామ్, ఏవ, సర్వభూతహితే, రతాః ॥

| | |
|---|---|
| తు | = కాని |
| యే | = ఏ పురుషులు |
| ఇంద్రియగ్రామమ్ | = ఇంద్రియసముదాయమును |
| సంనియమ్య | = పూర్తిగా వశపరచుకొని |
| అచింత్యమ్ | = మనస్సుకు బుద్ధికి గోచరము గానివాడును |
| సర్వత్రగమ్ | = సర్వవ్యాపియైన వాడును |
| అనిర్దేశ్యమ్ | = అనిర్వచనీయమైన స్వరూపము గలవాడును |
| చ | = ఇంకా |
| కూటస్థమ్ | = సర్వదా ఒకేస్థితిలో ఉండువాడును |
| ధ్రువమ్ | = నిత్యుడును |
| అచలమ్ | = నిశ్చలుడును |
| అవ్యక్తమ్ | = నిరాకారుడును, అయిన |
| అక్షరమ్ | = శాశ్వతుడైన సచ్చిదానంద పరబ్రహ్మను |
| పర్యుపాసతే | = ఏకీభావముతో ఉపాసింతురో |
| సర్వభూత | = సకల ప్రాణులకు |
| హితేరతాః | = హితము చేయుగోరువారు |
| సర్వత్ర | = అన్నింటియందును |
| సమబుద్ధయః | = సమభావము గలవారు, |
| తే | = వారు (యోగులు) |
| మామ్, ఏవ | = నన్నే |
| ప్రాప్నువంతి | = పొందుదురు |

**యే తు సర్వ-భూత-హితే రతాః సర్వత్ర సమ-బుద్ధయః (సన్తః)**
**ఇన్ద్రియ-గ్రామమ్ సంనియమ్య, అవ్యక్తమ్, అచిన్త్యమ్, అనిర్దేశ్యమ్ ।**

**సర్వత్రగమ్, కూటస్థమ్, అచలమ్, ధ్రువమ్ అక్షరమ్ చ**
**పర్యుపాసతే తే మామ్ ఏవ ప్రాప్ను వన్తి**

తా: కాని ఏ పురుషులకు ఇంద్రియనిగ్రహము, సమత్వము, సర్వభూతదయతో వారు ఇంద్రియ అగోచరము, మనో అగోచరము అనిర్వచనీయము, సర్వవ్యాపకము అచలము, నిర్వికారము, నిత్యుడును, శాశ్వతము అయిన నిర్గుణ ఈశ్వరధ్యానం చేస్తారో; అటువంటి యోగులు నన్నే పొందుదురు.

ఈ శ్లోకాల్లో నిర్గుణ ఈశ్వరధ్యానం చేసేవారిని వివరిస్తున్నాడు. నిర్గుణ ఈశ్వరుడు అంటే నిర్గుణబ్రహ్మ. ఈ నిర్గుణబ్రహ్మధ్యానం జ్ఞానయోగసాధనలో ఒక భాగం. ఈ అధ్యాయం మొదట్లో ఐదురకాల భక్తి గురించి చూసినప్పుడు జ్ఞానయోగాన్ని ఐదవదశగా చూశాము. జ్ఞానయోగాన్ని శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందాలని చూశాము. నిదిధ్యాసననే నిర్గుణ ఈశ్వరధ్యానం అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే కృష్ణపరమాత్మయొక్క పారమార్థికస్థాయిమీద ధ్యానం చేసేవారిని వివరిస్తున్నాడు ఇప్పుడు.

**యే తు అక్షరమ్ పర్యుపాసతే** – కొంతమంది అక్షరం బ్రహ్మమీద ధ్యానం చేస్తారు. అక్షరమ్ బ్రహ్మ పరమమ్ అని ఎనిమిదవ అధ్యాయంలో పేర్కొన్నాడని చూశాము. అక్షరం బ్రహ్మ అంటే నిర్గుణబ్రహ్మ.

ఇ) **జ్ఞానయోగము – అక్షర ఉపాసన: శ్లోకాలు 3-5**

ఈ శ్లోకాల్లో నిర్గుణబ్రహ్మను వివరిస్తున్నాడు కృష్ణపరమాత్మ. ఆ లక్షణాల వరుస క్రమానికి అనుగుణంగా శ్లోకాల్లోని పదాలను చూద్దాము.

1) **ఇంద్రియ అగోచరమ్ – అవ్యక్తమ్** – నిర్గుణబ్రహ్మ ప్రత్యక్ష ప్రమాణానికి అందదు, మనకున్న ఐదు ఇంద్రియాలకు ఐదుగుణాలు ఉన్నాయి. కన్ను రూపాన్ని చూడగలదు; చెవి శబ్దాన్ని వినగలదు; చర్మం స్పర్శను తెలుసుకోగలదు; ముక్కు గంధాన్ని పసిగట్టగలదు; నోరు రుచిని తెలపగలదు. ఆ విధంగా మన పంచ ఇంద్రియాలు శబ్దస్పర్శరూపరస గంధాలను తెలియజేస్తాయి. నిజానికి జగత్తును ప్రపంచం అనేది అందువల్లనే. ప్రపంచంలో ఐదు అంశాలు ఉన్నాయి. అవి శబ్దస్పర్శరూపరసగంధాలు. మన ఇంద్రియాలను మూసుకుంటే ఈ ఐదు అంశాలతో కూడిన ప్రపంచం మాయమైపోతుంది.

నిర్గుణబ్రహ్మకు ఈ ఐదు అంశాలూ ఉండవు. అంటే ఐదు ఇంద్రియాలకు అందదు. కృష్ణపరమాత్మే తన సగుణరూపం అపరాప్రకృతి అనీ, అది మాయామానుష వేషం అనీ చెబుతున్నాడు. కొంతమంది ఈ మాయామానుష వేషానికి అతీతంగా ఎదిగి అవ్యక్తబ్రహ్మను ఉపాసన చేస్తారు.

2) **మనో అగోచరమ్ – అచింత్యమ్** – కొన్ని విషయాలు కంటికి కనబడకపోయినా, మనస్సుకు తెలుస్తాయి. రాగద్వేషాలు, కామక్రోధాలు మనస్సుకు తెలుస్తాయి. అలాగే కొన్ని మాథమాటిక్స్ కాన్సెప్టులు మనస్సుకు అర్థమవుతాయి. కాని నిర్గుణబ్రహ్మ అచింత్యమ్ అని ఇంకో పిడుగులాంటి వార్త వేశాడు కృష్ణపరమాత్మ. నిర్గుణబ్రహ్మ మాథమాటిక్స్ కాన్సెప్టులలాంటిది కూడా కాదు.

3) **అనిర్వచనీయమ్ – అనిర్దేశ్యమ్** – నిర్గుణబ్రహ్మ ఇంద్రియాలకూ అందక, మనస్సుకూ అందకపోతే ఆ నిర్గుణబ్రహ్మను మాటలతో ఎలా వర్ణిస్తాము? ఒక ఆబ్జెక్టుగా కంటికి కనబడే వస్తువుకు లేదా మనస్సుకు తెలిసే వస్తువుకు పేరు పెట్టగలము. ఉదాహరణకు కంటికి ఎదురుగుండా కనిపించే వస్తువును 'పుస్తకం' అని అనగలము. కాని నిర్గుణబ్రహ్మ కంటికి కనబడదు, మనస్సుకు అందదు కాబట్టి వర్ణింపనలవి కాదు.

అసలు అటువంటి వస్తువేదైనా ఉందా అనే అనుమానం కలుగుతుంది. దేవతావస్త్రాలలాగా నిర్గుణబ్రహ్మ లేనేలేదని అంటారు కొందరు. ఎందుకు? ఇంద్రియాలకు అందని, మనస్సుకు అందని, మాటలకందని బ్రహ్మ ఎలా ఉంటాడు అంటారు.

**అప్రమేయమ్** – నిజానికి ఈ మూడు వర్ణనలనూ కలిపి బ్రహ్మను అప్రమేయం అని చెప్పవచ్చు. అంటే ఆబ్జెక్టు కాదు అని అర్థం. ఇవన్నీ వస్తువును వర్ణించే ప్రమాణాలు. ఇంద్రియవిషయాలను ప్రత్యక్షప్రమాణం అంటారు; మనస్సుద్వారా తెలుసుకునేవి అనుమానం, అనుపలబ్ధిలాంటి ప్రమాణాలు. బ్రహ్మ ఈ మూడుప్రమాణాలకు అందదు అంటే సర్వప్రమాణ అగోచరం. దానికి సాంకేతిక పదం అప్రమేయం.

**అప్రమేయో హృషీకేశో పద్మనాభో అమరప్రభుః** – విష్ణుసహస్రనామం

పద్మనాభో అమరప్రభుః అనాలా, పద్మనాభో మరప్రభుః అనాలా అని ఎవరో అడిగితే ఇంకెవరో ఏదైనా అనవచ్చు అన్నారుట. ఎందుకంటే విశ్వరూపదర్శనంలో అంతా భగవంతుడే అంటారు కదా. అలాంటప్పుడు భగవంతుణ్ణి అమరప్రభుః అనీ అనవచ్చు; మరప్రభుః అనీ అనవచ్చు. అమరప్రభుః అంటే శాశ్వతం; మరప్రభుః మరం అంటే తమిళంలో చెట్టు. అది పక్కన పెడితే బ్రహ్మ అప్రమేయం.

4) **సర్వవ్యాప్తమ్ – సర్వత్రగమ్** – నిర్గుణబ్రహ్మ సర్వవ్యాపకం. బ్రహ్మను స్థూలవస్తువుగా తెలుసుకోలేము అంటే, అటువంటి బ్రహ్మ అసలు ఉందా అనే అనుమానం కలిగే అవకాశం ఉంది. అందువల్ల వెంటనే కృష్ణపరమాత్మ సర్వత్రగమ్ అంటున్నాడు. నిర్గుణబ్రహ్మ ఉండటమే కాదు, సర్వవ్యాపకం. ఎవరో భగవంతుడు ఎక్కడా లేడు అని రాస్తే, దాన్ని చిన్న మార్పులు చేసి రాశారు మరెవరో – భగవంతుడు ఎక్కడ లేడు? వేదాంతం ఆ సర్వవ్యాపకమైన బ్రహ్మవు నువ్వే అంటుంది. తత్త్వమసి అంటుంది. ఆ విషయం తర్వాత చూద్దాము. సర్వత్రగమ్ అంటే సర్వవ్యాపకం.

5) **అచలమ్ – అచలమ్** అంటే కదలిక లేదు. సగుణ కృష్ణపరమాత్మ మధురనుంచి ద్వారకకు వెళతాడు; ద్వారకనుంచి కురుక్షేత్రానికి వెళతాడు కాని నిర్గుణబ్రహ్మకు రూపం లేదు కాబట్టి, అది సర్వవ్యాపకం. రూపం లేనిది సర్వవ్యాపకం; రూపం ఉన్నదానికి పరిమితి ఉంటుంది. ఉదాహరణకు ఈ గది నలుచదరంగా ఉందో, త్రిభుజంగా ఉందో తెలుసుకోవాలంటే, ఈ గదియొక్క సరిహద్దులను చూడాలి. సరిహద్దుల గురించి మాట్లాడకుండా, రూపం గురించి మాట్లాడలేము. అంటే ఎక్కడ రూపం ఉంటే, అక్కడ సరిహద్దు ఉంటుంది. బ్రహ్మకు రూపమనే గుణం లేకపోతే, బ్రహ్మకు సరిహద్దులు లేవు. నిర్గుణబ్రహ్మ ఆకాశంలాగా సర్వగతం. ఆకాశం ఎలాగైతే ఒకచోటినుంచి ఇంకొకచోటికి కదలదో, అలా నిర్గుణబ్రహ్మ కూడా ఒకచోటినుంచి ఇంకొకచోటికి కదలదు.

మరి మనం చేసే షోడశోపచారాల పూజ మాటేమిటి? భగవంతుణ్ణి ఆహ్వానిస్తాము; ఉపచారాలు చేస్తాము, మళ్ళీ ఉద్యాపన చేస్తాము. మనం చేసే ఈ ఉపచారాలు సగుణ ఈశ్వరునికి. సగుణ ఈశ్వరునికి రాకపోకలు ఉంటాయి. సగుణ ఈశ్వరుణ్ణి వ్యావహారిక స్థాయిలో కొలుస్తాము. కాని పారమార్థికస్థాయిలో నిర్గుణ ఈశ్వరునికి రాకపోకలు లేవు. అందువల్ల అచలం.

**అనంతమ్ –** ఆ విధంగా సర్వత్రగమ్, అచలమ్ దేశపరిచ్ఛేదరహితాన్ని సూచిస్తాయి. దీనికి ఇంకొక పదం అనంతం.

**6) నిర్వికారం – కూటస్థమ్** – కూటస్థమ్ అంటే నిర్వికారం; మార్పులు లేనిది. శరీరానికి షడ్వికారాలు ఉంటాయని చూశాము. అవి అస్తి, జాయతే, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, వినశ్యతి. అస్తి అంటే అవ్యక్తంలో ఉండటం; జాయతే అంటే పుట్టటం; వర్ధతే అంటే వృద్ధి పొందటం; విపరిణమతే అంటే పరిణామం చెందటం; అపక్షీయతే అంటే క్షీణించటం; వినశ్యతి అంటే నశించటం అంటే మరణించటం.

అందువల్ల కాలంలో ఉన్న దేనికైనా దానిమీద కాలప్రభావం పడుతుంది. అది కాలంయొక్క కోరలకు చిక్కుకుని ఈ మార్పులకు లోనై, చివరికి నశిస్తుంది. కాని పారమార్థికస్థాయికి చెందిన నిర్గుణబ్రహ్మకు ఈ షడ్వికారాలు అంటవు. అంటే నిర్గుణబ్రహ్మ కాలపరిచ్ఛేద రహితం.

కూటస్థమ్ పదానికి అనేక అర్థాలు ఉన్నాయి. ఒక అర్థం కంసాలి వాడే దిమ్మ. అది కదలకుండా, స్థిరంగా ఉంటుంది. దానిమీద కంసాలి కాల్చిన బంగారాన్ని పెట్టి, దానికి రూపురేఖలు తెస్తాడు. బంగారం ఎన్ని మార్పులు చెందినా, దానికింద ఉన్న దిమ్మ చెక్కు చెదరదు, బంగారం వికారాలు చెందటానికి తోడ్పడుతుంది కాని తను మాత్రం మారదు. ఆ దిమ్మ కుదురుగా లేకపోతే, కంసాలి తన పనిని తేలికగా చేయలేడు.

ఒక్కోసారి పూజ చెయ్యటానికి మనం కూర్చున్న పీట కుదురుగా ఉండదు. మనం వంగినప్పుడల్లా అది కదులుతుంది. అప్పుడు మనం సరిగ్గా పూజ చెయ్యలేము. అంటే ఏ పని చెయ్యాలన్నా దానికి ఆధారంగా ఉన్న పీట, దిబ్బ, వస్తువు కుదురుగా ఉండాలి. అంటే ఒక వస్తువు మారాలంటే, దానికి అధిష్ఠానంగా మారని ఆధారం ఉండాలి.

మన కుటుంబపరిస్థితులు నిరంతరం మారుతూ ఉంటాయి; మన శరీరం నిరంతరం మారుతూ ఉంటుంది; చిన్న వయస్సులో నిలువుగా ఎదుగుతాము, ఒక వయస్సు వచ్చాక అడ్డంగా ఎదుగుతాము; మన మనస్సు అనేక రాగద్వేషాలకు లోనవుతూ ఉంటుంది. ఇన్ని మార్పులు అవుతున్నాయీ అంటే, మారకుండా వాటికి ఆధారంగా ఉండే ఒక అధిష్ఠానం ఉండాలి. ఈ అధిష్ఠానం ఈ మార్పులు జరగటానికి సహకరించటమే కాదు; వాటిని సాక్షీభూతంగా చూస్తుంది కూడా. **మారుతున్న వస్తువులను చూస్తున్నది మారకూడదు.**

స్వామీజీ పొద్దున్న ఒక సత్సంగంలోనూ, సాయంకాలం ఇంకొక సత్సంగంలోనూ బోధ చేస్తుంటారు. పొద్దున్న సత్సంగం సాయంకాలపు సత్సంగంకన్నా భిన్నంగా ఉందని చెప్పాలంటే ఆయనలో ఏ మార్పు ఉండకూడదు. పైగా ఆయనే రెండుచోట్లా బోధ చేస్తూ ఉండి ఉండాలి. పొద్దున్న ఒకరు, సాయంకాలం ఇంకొకరూ బోధ చేసేటట్టయితే, ఈ సత్సంగాల మధ్య ఉన్న భేదం తెలియదు. అదికాక, ఆయన మార్పు చెందకుండా ఉంటేనే, మార్పు ఉన్న ఈ రెండు సత్సంగాలనూ గమనించగలరు. అంటే మార్పును గమనించే వ్యక్తి, మార్పుకు లోను కాకూడదు.

అందువల్ల చైతన్యాన్ని కూటస్థంతో పోల్చాడు కృష్ణపరమాత్మ. కంసాలి, ఈ దిమ్మమీద బంగారాన్ని ఎన్ని సుత్తిదెబ్బలు కొట్టినా అది చెక్కు చెదరదు. అలాగే నిశ్చలంగా ఉంటుంది. అలాగే శరీరమనే బంగారానికి; మనస్సనే బంగారానికి ఎన్ని సుత్తిదెబ్బలు కలిగినా, వాటికి లోను కాకుండా సాక్షీభూతంగా చూసే అధిష్ఠానం

ఒకటుంది. శరీరానికి కలిగే సుత్తిదెబ్బలు – దానికి కలిగే అనేక మార్పులు; అనేక అనుభవాలు; మనస్సుకు కలిగే సుత్తిదెబ్బలు – మనస్సును కలవరపరచే అనుభవాలు, కాని వీటన్నిటికీ అతీతంగా ఉండేది నిర్గుణబ్రహ్మ.

**కూటవత్ తిష్ఠతి ఇతి కూటస్థః**

ఒక దిమ్మలాగా కదలకుండా ఉండేది. నిర్గుణబ్రహ్మ నిర్వికారం.

7) **శాశ్వతం – ధ్రువమ్** – ధ్రువమ్ అంటే శాశ్వతం. కాలాతీతం. సర్వత్రగమ్, అచలం పదాలు నిర్గుణబ్రహ్మ దేశ అతీతం అని సూచిస్తే; కూటస్థమ్ ధ్రువమ్ పదాలు నిర్గుణబ్రహ్మ కాలాతీతం అని సూచిస్తాయి. ఈ నాలుగు పదాలను కలిపితే, కృష్ణపరమాత్మ దేశకాల అవధిభ్యాం నిర్ముక్తం నిత్యముక్తం. దీనితోనే మొదలవుతుంది నారాయణీయం.

**సాన్ద్రానన్దావబోధాత్మకమనుపమితం కాలదేశావధిభ్యాం**
**నిర్ముక్తం నిత్యముక్తం నిగమశతసహస్రేణ నిర్భాస్యమానమ్** – నారాయణీయం

సర్వవ్యాపకుడైన భగవంతుడు గురువాయూర్‌లో ఉన్నాడని ఎలా చెబుతాము? రెండూ పరస్పర విరుద్ధంగా లేవా? సర్వవ్యాపకుడైన భగవంతుడు గురువాయూర్‌లో కూడా ఉన్నాడంటే సరిపోతుంది. ఇలా కూటస్థం, అచలం, ధ్రువం అయిన నిర్గుణబ్రహ్మను కొంతమంది జ్ఞానయోగంలో భాగంగా ధ్యానం చేస్తారు. శ్రవణ, మనన, నిదిధ్యాసనలో భాగంగా ధ్యానం చేస్తారు.

గుణాలు లేని బ్రహ్మమీద ఎలా ధ్యానం చేస్తాము? ఈ నిర్గుణబ్రహ్మ స్థాయికి ఎదగాలంటే, దానికి జ్ఞానయోగ్యత ఉండాలి. జ్ఞానయోగ్యత పొందటానికి కావాల్సిన అర్హతలు ఏమిటి? వాటిని రాబోయే శ్లోకంలో చెప్పబోతున్నాడు కృష్ణపరమాత్మ.

నిర్గుణ ఈశ్వరధ్యానం చెయ్యటానికి కావాల్సిన అర్హతలను ఉపనిషత్తులలో చూస్తాము. ఆ అర్హతను సాధనచతుష్టయ సంపత్తిగా అభివర్ణిస్తాయి. అవి వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి. వాటిని నాల్గవ శ్లోకంలో కృష్ణపరమాత్మ టూకీగా చెబుతున్నాడు.

**ఇంద్రియగ్రామం సంనియమ్య** – ఇంద్రియనిగ్రహం ఉండాలి. ఇంద్రియాలు బాహ్యాముఖంగా ఉంటాయి. అవి ఎంతసేపూ బాహ్యప్రపంచంలో పరుగులు తీస్తూంటాయి. అవి సంచరిస్తే ఫర్వాలేదు, వాటివెంట మనస్సును కూడా లాక్కుపోతాయి. శ్రద్ధగా గీతాబోధ వింటుండగా, హఠాత్తుగా ఊడిపడ్డ బల్లిమీద కన్నుయొక్క చూపు పడుతుంది. అది వెంటనే మనస్సును బోధనుంచి అటువైపు లాగుతుంది.

బాహ్యాముఖంగా పరుగులు తీస్తున్న ఇంద్రియాలను ఎందుకు అదుపులో పెట్టాలి? అంతకుముందు కృష్ణపరమాత్మ ఏమన్నాడు? నిర్గుణబ్రహ్మ ఇంద్రియ అగోచరం అన్నాడు. ఇంద్రియాలకు అందదు అంటే నిర్గుణబ్రహ్మ ఒక స్థూలవస్తువు కాదు. స్థూలవస్తువుగా అనుభవంలోకి రాదు.

నిర్గుణబ్రహ్మ ఆబ్జెక్టు కాదు కాని అటువంటి నిర్గుణబ్రహ్మ ఉంది అంటే ఎలా ఉంటుంది? ఈ సృష్టిలో స్థూలవస్తువుగా చూడలేని వస్తువు ఒక్కటే ఒక్కటి ఉంది. అది స్థూలవస్తువును చూసే నేను. అంటే సబ్జెక్టు అయిన నేను. ప్రపంచాన్నంతటినీ విస్తారంగా చూసే నా విశాల నేత్రాలను నేను చూసుకోలేను. అందరినీ తేరిపారచూసే నేను నన్ను నేను చూసుకోలేను. అనుభవించలేనిది ఏదైనా ఉంటే, అది అన్నింటినీ అనుభవించే నేనే.

**ఎవ్వర్ ది ఎక్స్పీరియన్సర్ నెవ్వర్ ది ఎక్స్పీరియన్స్డ్**
**అనుభవించే నేనే అది ఎప్పటికీ, అనుభవించబడే వస్తువు కాదు ఎన్నటికీ**

అందువల్ల నిర్గుణబ్రహ్మ నాకు భిన్నంగా లేదు. అంటే నిర్గుణధ్యానం అంటే ఆత్మధ్యానం. నిర్గుణబ్రహ్మమీద ధ్యానం చెయ్యాలంటే, నామీదే నేను ధ్యానం చెయ్యాలి. నామీద అంటే నా శరీరంమీద కాదు. శరీరం నాకు ఆబ్జెక్టుగా తెలుస్తున్నది. నిర్గుణధ్యానాన్ని పూజ్యస్వామీజీ ధ్యానం చేసే సాధకునిమీద ధ్యానం అంటారు. అంటే సాధక–ధ్యానం. వీటి వివరాలు మళ్ళీ సందర్భం వచ్చినప్పుడు చూద్దాము.

నేను చేసే ధ్యానం నామీదే కాబట్టి, నా ఇంద్రియాలు బాహ్యాముఖంగా పరుగులు తీయటానికి కుదరదు. బాహ్యంగా పరుగులు తీసే ఇంద్రియాలు బాహ్యవస్తువులనే చూస్తాయి, కాని నేను నామీదనే ధ్యానం చెయ్యాలి.

**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్** – 6.13

ఆరవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ కంటిచూపును ఎటూ పోనియ్యక, తన నాసికాగ్రంమీదే చూపు నిలపాలి అన్నాడు. అంటే అక్కడ అర్థం చూశాము. ముక్కుమీద ధ్యానం చెయ్యమని కాదు, కన్నును ఎటూ వెళ్ళనివ్వకూడదని అర్థం. అంటే బాహ్యవస్తువులను చూడకూడదు.

ఇంద్రియగ్రామం– గ్రామం అంటే పల్లెటూరని కాదు; సమూహం అని అర్థము. పల్లెటూరును గ్రామం అని ఎందుకంటారంటే, అందులో కొన్ని ఇళ్ళ సమూహం ఉంటుంది కాబట్టి. ఇంద్రియగ్రామం అంటే ఐదు ఇంద్రియాల సమూహం. సాధకునికి ఉండాల్సిన మొదటి అర్హత – **ఇంద్రియనిగ్రహం.**

**సర్వత్ర సమబుద్ధయః** – సమబుద్ధి అంటే సమత్వం పాటించటం. అంటే ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా కూడా చలించకపోవటం. అంటే రాగద్వేషాలకు అతీతంగా ఉండటం. ఒక వస్తువుమీద తీవ్రమైన రాగం ఉంటే మనస్సు ఆ వస్తువు వెంట పరుగులు తీస్తుంది. ఇంకొక వస్తువుమీద తీవ్రమైన ద్వేషం ఉంటే, దానిమీద ద్వేషంతో దాని గురించే ఆలోచిస్తుంది. అందువల్ల తీవ్రమైన రాగద్వేషాలు ఉంటే మనస్సు నిశ్చలంగా ఉండదు. అలా నిశ్చలంగా లేని మనస్సు ధ్యానంమీద శ్రద్ధ చూపలేదు. అందువల్ల రాగద్వేషాలను తగ్గించుకోవాలి. సాధకునికి ఉండాల్సిన రెండవ అర్హత – **మనస్సును స్థిరపరుచుకోవటం.**

**సర్వభూతహితే రతాః** – సర్వభూతహితే రతాః అంటే సకల ప్రాణుల మంచి కోరేవాడు; సర్వమానవ సౌభ్రాతృత్వం ఉండేవాడు. అంటే స్వార్థపూరిత మనస్సు లేకుండా, విశాల దృక్పథం ఉన్న వ్యక్తి. అటువంటి భావనను పెంపొందించటానికి మన ప్రార్థనలు అద్భుతంగా తోడ్పడతాయి –

**సర్వే భవంతు సుఖినః**

సర్వే తరువాత ఎవరో చెప్పలేదు. అది మనుష్యులు అవవచ్చు, సర్వహిందువులు అవవచ్చు, సర్వప్రాణకోటి అవవచ్చు.

**ఓం తచ్ఛం యోరావృణీమహే। గాతుం యజ్ఞాయ। గాతుం యజ్ఞపతయే**

**దైవీ స్వస్తిరస్తు నః। స్వస్తిర్మానుషేభ్యః ఊర్ధ్వం జిగాతు భేషజమ్**

**శం నో అస్తు ద్విపదే। శం చతుష్పదే**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః** – పురుష సూక్తము

రెండు కాళ్ళ జంతువులు, నాలుగు కాళ్ళ జంతువులు, ఆరు కాళ్ళ క్రిములు, ఎనిమిది కాళ్ళ కీటకాలు అన్నీ బాగుండాలి. ఇతరుల కష్టాలను నా కష్టంగా భావించాలి అంటే నా మనస్సు చాలా సున్నితంగా ఉండాలి. తోటివారి మీద సానుభూతి ఉండాలి.

ఇటువంటి విశాలదృక్పథాన్ని పెంచుకోవటం ఎలా? నా కుటుంబాన్నే నేను సరిగ్గా చూసుకోలేకపోతున్నాను. ఎంత చేసినా, నా భార్య, పిల్లలను తృప్తి పరచలేకపోతున్నాను, నామీద వారికి ఎన్నో ఫిర్యాదులు ఉన్నాయి అనుకుంటాను. దానికి జవాబు చాలా తేలిక. రోజూ ఒక ప్రార్థన చేస్తే, చేసిన ఆ ప్రార్థనవల్ల కొంత పుణ్యం వస్తుంది. ఆ పుణ్యాన్ని జగత్తుకు ధారపోయాలి. అంటే ఎవరు ఎక్కడ బాధపడుతుంటే, వారికి ఈ ప్రార్థన చెందుగాక అనుకోవాలి. ఇటువంటి నిస్వార్థప్రార్థన మీలో దయాగుణాన్ని, జాలిని పెంపొందిస్తుంది. అటువంటి సున్నితమైన మనస్సు లేకుండా, బ్రహ్మధ్యానం చెయ్యలేరు. అంటే దీనికి చాలా సంస్కరించబడిన మనస్సు కావాలి. సంకుచితమనస్సు సరిపోదు. సాధకునికి ఉండాల్సిన మూడవ అర్హత – **అందరి మేలు కోరాలి**.

ఈ అర్హతలన్నీ దేనికి? జ్ఞానయోగానికి లేదా నిర్గుణ ఈశ్వరధ్యానం చెయ్యటానికి. ఇది భక్తిలో అత్యున్నతమైన స్థాయి. దీనికి రావటానికి అర్హత ఉండాలి. ఆ అర్హతను జ్ఞానయోగ్యత అంటారు. ఈ జ్ఞానయోగ్యత ఉన్న వ్యక్తి నిర్గుణ ఈశ్వరధ్యానం చెయ్యగలుగుతాడు. అటువంటి ధ్యానం చెయ్యటంవల్ల కలిగే ఫలమేమిటి?

**తే మామ్ ఏవ ప్రాప్నువంతి** – అటువంటివారు నన్నే పొందుతారు. అటువంటివారు అంటే ఎటువంటివారు? నిర్గుణ ఈశ్వరధ్యానం చేసేవారు. నన్నే పొందుతారు అంటే మోక్షం పొందుతారు. **ఏవ** పదాన్ని మూడుసార్లు వాడాలి.

**తే ఏవ మామ్ ప్రాప్నువంతి** – వారు మాత్రమే మోక్షాన్ని పొందుతారు. వేరే ఎవరూ పొందరు.

**తే మామ్ ఏవ ప్రాప్నువంతి** – వారు మోక్షాన్నే పొందుతారు, చిన్న ఫలితాలను పొందరు.

**తే మామ్ ప్రాప్నువంతి ఏవ** – వారు మోక్షాన్ని నిస్సందేహంగా పొంది తీరుతారు.

మొదటి జవాబును, రెండవ జవాబును పోల్చి చూస్తే – మొదటి జవాబులో సగుణ ఈశ్వరధ్యానం చేసేవారు గొప్పవారు అన్నాడు; ఇప్పుడేమో నిర్గుణ ఈశ్వరధ్యానం చేసేవారు నన్నే పొందుతారు అంటున్నాడు. అంటే దీన్నిబట్టి అర్థం చేసుకోవాల్సింది అందరికీ రెండూ కావాలి.

శ్లో. 5 **క్లేశోఽధికతరస్తేషామ్ అవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥**
క్లేశః, అధికతరః, తేషామ్, అవ్యక్తాసక్తచేతసామ్,
అవ్యక్తా, హి, గతిః, దుఃఖమ్, దేహవద్భిః, అవాప్యతే ॥

| | | | |
|---|---|---|---|
| తేషామ్ | = ఆ | హి | = ఎందుకంటే |
| అవ్యక్తాసక్తచేతసామ్ | = సచ్చిదానంద నిర్గుణబ్రహ్మయందు ఆసక్తచిత్తులైన వారికి | దేహవద్భిః | = దేహాభిమానము గలవారిచేత |
| | | అవ్యక్తా, గతిః | = అవ్యక్త పరబ్రహ్మప్రాప్తి |
| క్లేశః | = సాధన యందలి శ్రమ | దుఃఖమ్, అవాప్యతే | = కష్టసాధ్యమే |
| అధికతరః | = మిక్కిలి అధికము | | |

**అవ్యక్త–ఆసక్త–చేతసామ్ తేషామ్ అధికతరః క్లేశః (అస్తి తైః)**
**దేహవద్భిః అవ్యక్తా గతిః దుఃఖమ్ అవాప్యతే హి ।**

తా: ఆ సచ్చిదానంద నిర్గుణబ్రహ్మయందు ఆసక్తచిత్తులైన వారికి సాధన యందలి శ్రమ మిక్కిలి అధికము. ఎందుకంటే దేహాభిమానము గలవారిచేత అవ్యక్త పరబ్రహ్మప్రాప్తి కష్టసాధ్యమే.

ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నిర్గుణధ్యానం చాలా కష్టం అని ప్రత్యక్షంగా చెబుతున్నాడు. అంటే పరోక్షంగా జ్ఞానయోగం చాలా కష్టమని చెప్పినట్టే అర్థం. ఎందుకంటే నిర్గుణధ్యానం జ్ఞానయోగంలో ఒక భాగం. జ్ఞానం పొందటానికి మూడు అంశాలు ఉన్నాయనీ; అవి శ్రవణ, మనన, నిదిధ్యాసనలనీ చూశాము. నిదిధ్యాసనను నిర్గుణధ్యానం అంటారు.

ఈ నిర్గుణధ్యానం భక్తియోగంలోని అత్యున్నతమైన ఐదవదశ అని చూశాము. జ్ఞానయోగంలో నిర్గుణ ఈశ్వరధ్యానం చాలా ప్రత్యేకమైన ధ్యానం. ఈ నిర్గుణ ఈశ్వరునికి షోడశోపచారాలు చెయ్యలేమని చూశాము. అర్ఘ్యం సమర్పయామి, పాద్యం సమర్పయామి అనలేము. ఎందుకంటే నిర్గుణబ్రహ్మకు కాళ్ళు, చేతులు ఉండవు.

మరి ధ్యానం అంటే ఏమిటి? నిర్గుణబ్రహ్మ విచారణ చెయ్యటం. దానికి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. శ్రవణం అంటే క్రమపద్ధతిలో జ్ఞానం పొందటం; మననం అంటే నిశ్చయజ్ఞానం పొందటం; నిదిధ్యాసనం అంటే పొందిన ఆ జ్ఞాననిష్ఠలో నెలకొని ఉండటం. ఇదే పూజ. మన అజ్ఞానాన్ని జ్ఞానమనే అగ్నిలో సమర్పించాలి. అందువల్ల జ్ఞానయోగం అంటే ఒక విధమైన పూజ. ఇది భక్తియోగంలో ఐదవదశ అని చూశాము. అది 3, 4, 5 శ్లోకాల్లో చూస్తున్నాము. జ్ఞానయోగానికి కృష్ణపరమాత్మ వాడిన సాంకేతిక పదం – అక్షర ఉపాసన. అక్షరం

అంటే నిర్గుణబ్రహ్మ. అక్షరబ్రహ్మ అనే వర్ణన ముండకోపనిషత్తులో చూస్తాము. ఉపాసనం అంటే మూడూ వస్తాయి. అంటే శ్రవణ, మనన, నిదిధ్యాసనలు. అక్షరోపాసనం అంటే –

**నిర్గుణబ్రహ్మ విషయ శ్రవణ మనన నిదిధ్యాసనాని**

ఇటువంటి ఉపాసన చేసేవారిని అక్షర ఉపాసకులు అంటారు. అక్షర ఉపాసన గురించి చెప్పాక, నిర్గుణబ్రహ్మ విచారణ చెయ్యటం చాలా కష్టమని చెబుతున్నాడు కృష్ణపరమాత్మ. నిదిధ్యాసనాన్ని నిర్గుణధ్యానం అంటారు.

**క్లేశః అధికతరః** – ఆటంకాలు అనేకం ఉంటాయి. ఎవరికి?

**అవ్యక్తాసక్తచేతసామ్** – అవ్యక్తం అంటే ఇంద్రియ అగోచరం అని అంతకుముందు శ్లోకంలో చూశాము. ఆసక్త అంటే ఆసక్తి ఉన్నవారికి; చేతసా అంటే మనసు. అంటే అవ్యక్తబ్రహ్మ ఉపాసన చెయ్యాలనే ఆసక్తి ఉన్నవారికి ఆటంకాలు అనేకం ఉంటాయి. అంటే నిర్గుణ ఈశ్వరధ్యానం కష్టం.

**క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పటస్తత్కవయో వదంతి** – కఠ

ఉపనిషత్తే చెబుతుంది. ఏమని? జ్ఞానయోగం అంటే క్షురకుని కత్తియొక్క అంచుమీద నడవటం లాంటిది అని. ఎందుకంత కష్టం?

**అవ్యక్తా హి గతిర్దుఃఖం** – గతిః అంటే గమ్యం. అవ్యక్తం అంటే ఇంద్రియ అగోచరం అని చూశాము. ఇంద్రియ అగోచరమైన అవ్యక్తాన్ని అర్థం చేసుకోవటం చాలా కష్టం. దుఃఖం అంటే చాలా కష్టం. ఎవరికి?

**దేహవద్భిః** – దేహాభిమానం గలవారికి. ఈ నిర్గుణబ్రహ్మజ్ఞానం చాలామందికి కష్టం. ఎందుకంటే చాలా మందికి ఈ దేహాభిమానం ఉంటుంది. స్థూలశరీరంతో అనుబంధం పెంచుకోవటంవల్ల వారి బుద్ధి కూడా స్థూలంగా ఉంటుంది. శరీరంమీద మమకారం, మనస్సును పదును పెట్టుకునే అవకాశాన్ని ఇవ్వదు.

ఎంతసేపూ శరీరానికి సేవ చెయ్యటమే సరిపోతుంది. అంటే శరీరానికి కావాల్సిన కూడు, గుడ్డ, నీడలను సమకూర్చుకోవటానికే కాలం అంతా అయిపోతుంది. రిటైర్ అయ్యాక అయినా ఏదైనా జ్ఞానం పొందుతారా అంటే ధరలు పెరుగుతాయి, అనారోగ్యం చుట్టుముడుతుంది, పిల్లలు ఆదుకుంటారో లేదో అనే బెంగలు తినేస్తాయి. అందువల్ల ఎంతసేపూ శారీరక భద్రత కోరే మనస్సుకు తీరిక ఉండదు. శరీరంమీద అనుబంధం తోటివారితో అనుబంధాన్ని పెంచుతుంది; వస్తువులమీద మమకారాన్ని పెంచుతుంది. వారిని పరిమిత జీవులను చేస్తుంది. పరిమిత జీవిగా ఆలోచించే వ్యక్తి అపరిమిత బ్రహ్మను అర్థం చేసుకునే అవకాశానికి చోటు లేదు.

ఎందుకు అర్థం చేసుకోలేరు? వారి మనస్సు స్థూలంగా ఉంటుందని చూశాము. అంటే సూక్ష్మబుద్ధి ఉండదు. వారికి తెలిసింది కంటికి కనబడే లేదా మనస్సుకు అందే వస్తువు గురించి నేర్చుకోవటం; లేదా ధ్యానం చెయ్యటం. కాని బ్రహ్మను ఇంద్రియ అగోచరం, మనస్సుకు కూడా అగోచరం అంటున్నాము.

ఇంద్రియాలకు, మనస్సుకు అందని బ్రహ్మ ఉందా, లేదా? లేదనుకోకూడదు. ఆ నిర్గుణబ్రహ్మను నేనే అని

తెలుసుకోవాలి. సోఽహం అంటే సః అహం. ఆ బ్రహ్మను నేనే. అహం సః ని కుదిస్తే హంస అవుతుంది. అందువల్ల హంసగాయత్రీ జపం చేస్తారు కొంతమంది. దాని విషయం పక్కన పెడితే నిర్గుణబ్రహ్మను అర్థం చేసుకోవటం కష్టం.

ఎందుకు కష్టం? సాధనచతుష్టయసంపత్తి లేదు కాబట్టి. సాధనచతుష్టయసంపత్తి అంటే వివేకం, వైరాగ్యం, ముముక్షుత్వం, శమాది షట్కసంపత్తి అని చూశాము.

జ్ఞానయోగం అంత కష్టమయితే, ఏం చెయ్యాలి? మోక్షం పొందాలనే తపన ఉంది కాని, జ్ఞానయోగం పాటించలేము. ఏం చెయ్యాలి? ఇక్కడే తప్పటడుగులు వెయ్యకుండా జాగ్రత్త పడాలి. చాలామంది చాలా మార్గాలు సూచిస్తారు. జ్ఞానయోగాన్ని వదిలి వేరే మార్గానికి రమ్మంటారు. కర్మయోగం, భక్తియోగం, రాజయోగం, నాదయోగం, కుండలినీ యోగం అంటూ రకరకాల మార్గాలను సూచిస్తారు. ఏ మార్గం సూచించినా వారందరి వాదనా ఒక్కటే. జ్ఞానయోగం కష్టం కాబట్టి, దాన్ని వదిలేసి వేరే తేలికైన మార్గానికి రండి. ఎక్కువమంది చెప్పేది భక్తియోగం. ఎందుకంటే భక్తిలో ఆర్తి ఉంటుంది.

కాని ఇలాంటి మార్గాలు ఎవరైనా సూచిస్తున్నారూ అంటే వారు సాంప్రదాయాన్ని పాటించటం లేదు. ఎందుకంటే సాంప్రదాయం ఎన్నడూ అలాంటి జవాబు చెప్పదు. ఎందుకు అలాంటి జవాబు చెప్పదు? ఎందుకంటే శాస్త్రంద్వారా మనకి ఒక విషయం ఇప్పటికే సుస్పష్టమైంది. మోక్షం పొందాలంటే అనేక మార్గాలు లేవు. ఒక్కటే మార్గముంది –

**తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే**

జ్ఞానం ఒక్కటే మోక్షాన్ని ఇస్తుంది; జ్ఞానం కాకుండా వేరే ప్రత్యామ్నాయ మార్గాలు లేవు. ఎందుకు? అజ్ఞానం సమస్య అయితే, జ్ఞానం పొందటం ఒక్కటే ఆ సమస్యకు పరిష్కారమార్గం. ఒక గదిలో చీకటి ఉంటే, అక్కడ దీపం వెలిగించటం ఒక్కటే చీకటిని పారద్రోలే మార్గం. ఆ గదిని శుభ్రంగా ఊడిస్తే చీకటి పోతుందా? ఆ గదిలో శీర్షాసనం వేస్తే చీకటి పోతుందా? ఆ గదిలో విష్ణుసహస్రనామ పారాయణం చేస్తే చీకటి పోతుందా? ఒక విషయం జాగ్రత్తగా గమనించండి. వీటినేవీ మనం కించపరచటం లేదు. గదిని శుభ్రం చెయ్యటం మంచికర్మే కాని అది చీకటిని తొలగించలేదు; శీర్షాసనం యోగాసనాల్లో మంచి ఆసనమే కాని అది చీకటిని తొలగించలేదు; విష్ణుసహస్రనామ పారాయణం మంచి పారాయణమే కాని అది చీకటిని తొలగించలేదు.

**అవిరోధితయా కర్మ నావిద్యాం వినివర్తయేత్**
**విద్యాఽవిద్యాం నిహంత్యేవ తేజస్తిమిరసంఘవత్** – ఆత్మబోధ 3

శంకరాచార్యులవారు ఈ విషయాన్ని తన ఆత్మబోధలో సుస్పష్టం చేశారు. చీకటిని వెలుగువల్లనే పారద్రోలగలము. అలాగే అజ్ఞానాన్ని జ్ఞానంద్వారానే పారద్రోలగలము. సంసారం అజ్ఞానంవల్ల ఏర్పడింది, అందువల్ల జ్ఞానంద్వారానే మోక్షాన్ని పొందగలము. జ్ఞానంవల్ల **మాత్రమే** మోక్షాన్ని పొందగలము అంటే దాన్ని

జ్ఞానంమీద ఉన్న వెర్రి అభిమానంగా భావించకూడదు. సత్యాన్ని నెలకొల్పాలంటే గట్టిగా నొక్కి వక్కాణించాలి. అనేక మార్గాలుంటే, ఒక్క మార్గాన్నే పట్టుకు ప్రాకులాడితే, దాన్ని వెర్రి అభిమానం అనవచ్చు కాని, ఇక్కడ ఉన్నది ఒక్కటే మార్గం. చీకటిని పారద్రోలటానికి దీపం వెలిగించటం ఒక్కటే మార్గం ఎలాగో, అలాగే అజ్ఞానమనే చీకటిని పారద్రోలటానికి జ్ఞానదీపం వెలిగించటం ఒక్కటే మార్గం.

ఒకవేళ దాన్ని వెర్రి అభిమానం అన్నా ఫర్వాలేదు కాని అది వెర్రితనం మాత్రం కాదు. మీరు ఏ పేరుతో పిలిచినా అది సత్యం, సత్యం, పునః సత్యం.

**జ్ఞానాదేవ తు కైవల్యమ్**

జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది. ఈ మాటకు మీరు ఏ పేరు పెట్టుకున్నా ఫర్వాలేదు. కాని జ్ఞానమార్గం కష్టం కాబట్టి, వేరే మార్గం చూద్దాము అంటే, ఆధ్యాత్మమార్గాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదని అర్థం. అందువల్ల అజ్ఞానం జ్ఞానంవల్లనే పోతుంది.

ఇప్పుడు రెండవ అంశం. జ్ఞానం ఎలా కలుగుతుంది? ఏ జ్ఞానమైనా సరే, దానికి సంబంధించిన విద్య గురించిన జ్ఞానం పొందాలి. ఫిజిక్స్ జ్ఞానం పొందాలంటే, ఫిజిక్స్ నేర్చుకోవాలి తప్ప దానికి వేరే ఏ మార్గం లేదు. లేదా $(a+b)^2$ ఎంతో తెలుసుకోవాలంటే దానిమీద ధ్యానం చేస్తే తెలుస్తుందా? మ్యాథ్స్ బోధించే గురువుకు పాదపూజ చేస్తే తెలుస్తుందా? ఏదైనా ఆలయానికి వెళ్ళి కొన్ని పూజలు చేస్తే తెలుస్తుందా?

జ్ఞానం పొందాలంటే దానికి సంబంధించిన విద్యను అభ్యసించాలి. లౌకిక విద్య విషయంలో కూడా ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు సమర్థవంతమైన గురువు దగ్గర ఆ విద్యను అధ్యయనం చెయ్యాలి. అంతేకాని, నాకు ఫిజిక్స్ జ్ఞానం కావాలి, దానికోసం స్టార్‌డస్ట్‌ను చదువుతాను అంటే కుదరదు. అంటే అధ్యయనం చెయ్యాలంటే ఏదో ఒకటి అధ్యయనం చెయ్యకూడదు. దానికి సంబంధించిన శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. అంటే ఫిజిక్స్ నేర్చుకోవటానికి ఫిజిక్స్ శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి.

ఈ సూత్రం లౌకికవిద్యకే కాదు, ఆధ్యాత్మిక విద్యకు కూడా చెందుతుంది. బ్రహ్మవిద్య పొందాలంటే బ్రహ్మ గురించి బోధించే శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి. ఇందాక చూసిన నిర్వచనమే ఇక్కడా వర్తిస్తుంది. నిజానికి ఇది శ్రవణం గురించి నిర్వచనం. ఏమిటది? ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు సమర్థవంతమైన గురువువద్ద వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చెయ్యాలి.

**అథాఽ తో బ్రహ్మజిజ్ఞాసా** – బ్రహ్మసూత్రాలు 1

బ్రహ్మసూత్రాలను ఈ సూత్రంతో మొదలుపెట్టారు వ్యాసాచార్యులవారు. దాని పూర్తి అర్థం ఇలా వస్తుంది.

సాధన చతుష్టయసంపత్తి పొందిన అనంతరం, కర్మవల్ల మోక్షం రాదు కాబట్టి, జ్ఞానంవల్లనే మోక్షం వస్తుంది కాబట్టి, బ్రహ్మజ్ఞానం పొందటానికి వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చెయ్యాలి. అలా ఒక క్రమపద్ధతిలో జ్ఞానాన్ని పొందటాన్ని జ్ఞానయోగం అంటారు.

జ్ఞానయోగం మాత్రమే జ్ఞానాన్ని ఇస్తుంది; జ్ఞానం మాత్రమే అజ్ఞానాన్ని పారద్రోలుతుంది; అజ్ఞానం తొలిగితేనే మోక్షం కలుగుతుంది. ఈ ప్రాథమిక జ్ఞానం జాగ్రత్తగా పెంపొందించుకోవాలి. సాంప్రదాయబోధ అంటే ఇది. ఏ ఉపనిషత్తు, ఏ ప్రకరణ గ్రంథంమీద శంకరులవారి భాష్యం నేర్చుకున్నా, శంకరాచార్యులవారు ఈ ప్రాథమిక అంశాలను సుస్పష్టం చేస్తారు. ఇది తెలియకపోతేనే, అనేక మార్గాల వెంట పరుగులు తీస్తాము.

ఒక్కసారి ఆగి ఆలోచించండి. జ్ఞానం పొందటానికి వేరే మార్గం ఏదైనా ఉండి ఉంటే అంటే స్పర్శదీక్షవల్లనో, దృష్టిదీక్షవల్లనో జ్ఞానం వచ్చేటట్టయితే, కృష్ణపరమాత్మ యుద్ధభూమిలో అంతసేపు జ్ఞానబోధ చెయ్యకుండా, ఆ తేలిక మార్గాన్ని ఉపయోగించి ఉండేవాడు కాదా? కురుక్షేత్ర రణగొణ ధ్వనుల్లో జ్ఞానం బోధించటానికి అనువుగా ఉంటుందా? అయినా ఎందుకు బోధించాడు? అంటే వేరే దగ్గర దారులు లేవు కాబట్టి. కృష్ణపరమాత్మ జ్ఞానబోధ తప్ప వేరే ఏ మార్గమూ ఉపయోగించలేదనే నగ్నసత్యమే జ్ఞానం పొందటానికి వేరే మార్గాలు ఏవీ లేవనే విషయాన్ని తేటతెల్లం చేస్తోంది.

అందువల్ల సలక్షణంగా ఒక గురువు వద్ద ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా వేదాంతశాస్త్రాన్ని అధ్యయనం చేసి, జ్ఞానం పొంది, మోక్షం పొందాలి. దీన్ని జ్ఞానయోగం అంటారు. అందువల్ల జ్ఞానయోగం చాలా కష్టం, నేను వేరే మార్గాలు పాటిస్తాను అనకూడదు. మరైతే ఏం చెయ్యాలి? కృష్ణపరమాత్మే స్వయంగా జ్ఞానయోగం కష్టమన్నాడు; మీరేమో అది తప్ప వేరే మార్గం లేదు అంటున్నారు. నేను ఏం చెయ్యాలి అని మీరు అంటే దానికి జవాబు చాలా తేలిక.

**జ్ఞానయోగం కష్టమయితే, జ్ఞానయోగాన్ని తేలికపరచుకోండి**

ఎంతో తేలిగ్గా చెప్పేశారు కాని కష్టమైన జ్ఞానయోగాన్ని తేలికపరుచుకోవటం ఎలా? ఇది రెండవ ప్రశ్న. ఇది కూడా చాలా తేలిక. మిమ్మల్ని మీరు జ్ఞానయోగానికి సంసిద్ధులు చేసుకోండి; జ్ఞానయోగ్యతాప్రాప్తిని పొందండి; జ్ఞానయోగ్యతాప్రాప్తి పొందితే, జ్ఞానయోగం చాలా తేలిక అని కృష్ణపరమాత్మే చెప్పాడు.

**రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥** – 9.2

జ్ఞానయోగం చాలా తేలిక; ఎప్పుడు? మనస్సును సంసిద్ధం చేసుకుంటే. ఈ సూత్రం ఒక్క జ్ఞానయోగానికే వర్తించదు, ఏ విద్యను తీసుకున్నా వర్తిస్తుంది. మనస్సును సంసిద్ధం చేసుకుంటే ఏ విద్య అయినా కూడా తేలికే; మనస్సును సంసిద్ధం చేసుకోకపోతే ఏ విద్య అయినా కూడా కష్టం. మనస్సును సంసిద్ధం చేసుకుని, దాన్ని సాధన చేస్తే ఎంతో తేలిక.

ఎప్పుడైనా కేరళలో టీ అమ్మే చిన్న బడ్డీకొట్టుకు వెళ్ళారా? అక్కడ టీ అమ్మే వ్యక్తి టీని కలిపాక, డమరానుంచి గ్లాసులోకి, గ్లాసులోంచి డమరాలోకి పోస్తూ ఉంటాడు. అది కూడా నిలువుగా కాకుండా, దాదాపుగా అడ్డంగా. అలా నాలుగైదుసార్లు తిప్పాక బోలెడు నురుగుతో మనకు టీని అందిస్తాడు. మనం అతనిలా చెయ్యటానికి

ప్రయత్నిస్తే దమరాలో ఒక్క చుక్క టీ కూడా మిగలదు. పైగా అతను టీ వైపు కూడా చూడడు. టీని ఇటూ, అటూ త్రిప్పుతూ ఎదురుగా ఉన్న వ్యక్తితో రాజకీయాలను చర్చిస్తాడు. అతను అంత తేలిగ్గా చేసిన పని మనకు చాలా కష్టం.

జ్ఞానయోగం తేలికా, కష్టమా? ఈ ప్రశ్నకు మనం వెంటనే జవాబు చెప్పకూడదు. ఎవరికి తేలిక, ఎవరికి కష్టం అని మనం తిరిగి ప్రశ్నించాలి. సంసిద్ధమనస్సు ఉన్నవారికి అది తేలిక; సంసిద్ధమనస్సు లేనివారికి చాలా కష్టం. అందువల్ల సంసిద్ధతను పెంచుకోండి; జ్ఞానయోగానికి రండి. జ్ఞానాన్ని పొందండి; మోక్షం పొందండి. ఇదీ సాంప్రదాయం చెప్పే జవాబు.

సరే, ఆ సంసిద్ధతను ఎలా పొందాలి? జ్ఞానయోగం పొందటానికి మిమ్మల్ని మీరు ఎలా సిద్ధం చేసుకోవాలి? మనం ఈ అధ్యాయం మొదట్లో భక్తియోగానికి ఐదుమెట్లు ఉన్నాయని చూశాము. వాటిని ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి.

భక్తియోగం అంటే ఒక ప్రత్యేకసాధన కాదని; అనేక సాధనలు కలిసి భక్తియోగం అంటారనీ చూశాము. ఈ దశలన్నీ ప్రతిఒక్కరూ దాటుకుంటూ రావాలి. వీటిని ఐదుదశలుగా కృష్ణపరమాత్మ వివరించుకు వస్తున్నాడు. మీరు భక్తియోగంలోని ఈ ఐదుదశలనూ పాటిస్తే, మీకు మోక్షం వస్తుంది. ఈ అధ్యాయంలో ఆ దశలన్నీ చూస్తాము. అందువల్ల ఈ అధ్యాయం, ముఖ్యంగా ఈ భాగం (శ్లోకాలు 1–12) చాలా ముఖ్యం.

భక్తియోగంలోని ఈ దశల గురించి చెప్పేటప్పుడు కృష్ణపరమాత్మ ఆఖరిదశనుంచి మొదటిదశకు వస్తున్నాడు. మామూలుగా మొదటిమెట్టుతో మొదలుపెట్టి రెండు, మూడు, నాలుగు మెట్లు ఎక్కి, ఐదవమెట్టుమీద కాలు పెడతాము. కాని కృష్ణపరమాత్మ ఐదవమెట్టుమీద కాలు పెట్టించి, దానిమీద నిలబడలేకపోతే ఒక మెట్టు కిందికి రండి, దానిమీదా నిలబడలేకపోతే మూడవమెట్టుకు వెళ్ళండి; దానిమీదా నిలబడలేకపోతే రెండవ మెట్టుకు వెళ్ళండి; రెండవమెట్టుమీదా నిలబడలేకపోతే మొదటిమెట్టుకు వెళ్ళండి అంటున్నాడు. అదీ కుదరకపోతే వచ్చే జన్మలో చూసుకోవాలి.

ఈ ఐదుదశల్లో ఐదవదశను జ్ఞానయోగం అంటారు. జ్ఞానయోగసాధనను నిర్గుణబ్రహ్మ గురించిన శ్రవణ మనన నిదిధ్యాసనలద్వారా చేస్తారు. ఈ అధ్యాయంలో దీనికి అక్షర ఉపాసన అనే సాంకేతిక పదాన్ని వాడాడు కృష్ణపరమాత్మ. నిర్గుణబ్రహ్మజ్ఞానం భక్తియోగంలో అత్యున్నతస్థాయి.

**మోక్షకారణ సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ**
**స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే** – వివేక చూడామణి 31

**ఇ) జ్ఞానయోగం – అక్షర ఉపాసన**

ఐదవదశలో భక్తిని ఆత్మవిచారణ లేదా బ్రహ్మవిచారణ లేదా నిర్గుణ ఈశ్వరవిచారణ అంటారు. కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు, ఈ స్థాయి కష్టమైతే నాలుగవ స్థాయికి దిగిరండి అన్నాడు. నాలుగవ స్థాయికి వెళ్ళే ముందు ఈ ఐదుదశల భక్తిని మళ్ళీ చూద్దాము. ఇప్పుడు పైనుంచి కింది స్థాయికి వెళుతున్నాము.

| | | |
|---|---|---|
| ఇ) జ్ఞానయోగం | - అక్షర ఉపాసన | - శ్లోకాలు 3-5 |
| డి) ఉపాసనయోగం స్థాయి 2 | - అనేకరూప ఈశ్వరధ్యానం | - శ్లోకాలు 6-8 |
| సి) ఉపాసనయోగం స్థాయి 1 | - ఏకరూప ఈశ్వరధ్యానం | - శ్లోకం 9 |
| బి) కర్మయోగం స్థాయి 2 | - నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం | - శ్లోకం 10 |
| ఎ) కర్మయోగం స్థాయి 1 | - సకామకర్మ ప్రధాన కర్మయోగం | - శ్లోకం 11 |

శ్లో. 6 **యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥**
యే, తు, సర్వాణి, కర్మాణి, మయి, సన్న్యస్య, మత్పరాః,
అనన్యేన, ఏవ, యోగేన, మామ్, ధ్యాయంత, ఉపాసతే ॥

| | | | |
|---|---|---|---|
| యే, తు | = ఎవరయితే | అనన్యేన | = అనన్యభక్తి |
| మత్పరాః | = మత్పరాయణులై | యోగేన | = యోగముద్వారా |
| సర్వాణి కర్మాణి | = సమస్త కర్మలను | ధ్యాయంతః | = నిరంతరము చింతన చేయుచు |
| మయి, సన్న్యస్య | = నాకు సమర్పించి | | |
| మామ్, ఏవ | = సగుణరూప పరమేశ్వరుడనైన నన్నే | ఉపాసతే | = ఉపాసిస్తారో |

**యే తు మత్-పరాః (సన్తః), సర్వాణి కర్మాణి మయి సంన్యస్య,**
**మామ్ ధ్యాయన్తః అనన్యేన యోగేన ఏవ ఉపాసతే ।**

తా: ఎవరయితే మత్పరాయణులై సమస్త కర్మలను నాకు సమర్పించి సగుణరూప పరమేశ్వరుడనైన నన్నే అనన్యభక్తి యోగముద్వారా నిరంతరము చింతన చేయుచు ఉపాసిస్తారో.

ఇంతవరకూ జ్ఞానయోగం చూశాము. అది కష్టమైతే ఒక అడుగు దిగిరండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**డి) ఉపాసనయోగం స్థాయి 2 - అనేకరూప ఈశ్వరధ్యానం - శ్లోకాలు 6-8**

నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందటం కష్టమైతే, సగుణ ఈశ్వర ఉపాసనకు దిగండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే గుణాలు ఉన్న ఈశ్వరునిమీద ధ్యానం చెయ్యటం. ఇది సగుణ ఈశ్వరధ్యానంలో రెండవదశ (కింద నుంచి చూస్తే). దీన్ని విశ్వరూపదర్శనం అని కూడా అంటారు. ఈ విశ్వరూపదర్శనాన్ని పదకొండవ అధ్యాయంలో చేసుకున్నాము. విష్ణుసహస్రనామంలో ధ్యానశ్లోకంలో చూస్తాము. ఈ విశ్వరూపధ్యానం చెయ్యటమే కాదు, లౌకిక వ్యవహారాలు నడుపుతున్నప్పుడు కూడా మీ కార్యకలాపాలన్నింటినీ భగవదర్పణం చెయ్యండి.

**యే తు** - మరికొంతమంది అంటే నాలుగవ దశలో ఉన్న సాధకులు. ఏం చేస్తారు వారు?

**సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య** - వారి కర్మలన్నీ నా పాదాలచెంత అర్పిస్తారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. భగవంతుని పాదాలు ఎక్కడ ఉన్నాయి? అంతటా ఉన్నాయి.

**సర్వతః పాణిపాదం తత్ సర్వతోఽక్షి శిరో ముఖమ్**

మనం ఏ పనిచేసినా అది ప్రపంచంలోకి వెళుతుంది. వాటి ఫలం కర్మసూత్రాలననుసరించి వస్తుంది. ప్రతి ఒక్క సూత్రం కూడా భగవంతుని చేతులు అంటే భగవంతుడే తన చేతులతో మనకు కర్మఫలాలను, కర్మసూత్రాలననుసరించి ఇస్తున్నాడు.

సన్న్యస్య అంటే సన్యసించటం కాదు. మామూలుగా సన్న్యాసం అంటే త్యజించటం. కాని ఈ సందర్భంలో సన్న్యస్య అంటే అర్పించటం, సమర్పించటం. భగవంతునికి మీరు చేసే కర్మలను ఎలా సమర్పించాలి? సమర్పణం అంటే ఏమిటి? సమర్పణం అంటే ఒక ప్రత్యేకమైన దృక్పథం. మీరు ఒక ఉత్తరం రాస్తున్నా, ఒక గది శుభ్రం చేస్తున్నా, కంప్యూటర్‌లో ప్రాజెక్ట్ చేస్తున్నా కూడా, ఆ కర్మ చేసేంతవరకే మీకు అధికారం ఉంది. **కర్మణ్యేవాధికారస్తే.**

కర్మ చేసేశాక, అది జగత్తుకు చెందుతుంది. జగత్తు అంటే ఏదో కాదు, భగవంతుడే. భగవంతుడు విశ్వరూప ఈశ్వరుడని చూశాము. దీనికి కర్మఫలాన్ని భగవంతుడు ఇవ్వబోతున్నాడు. అది కూడా తనకు తోచినట్టు ఇవ్వడు. కర్మసూత్రాల ననుసరించి మీకు న్యాయంగా రావాల్సిన ఫలం ఏదో అది ఇస్తాడు. అందువల్ల మీ మనస్సును సిద్ధం చేసుకోవాలి. ఏమని? 'నేను ఏం చేసినా అది భగవంతునికి వెళుతుంది; ఆయన దానికి ఫలితాన్ని కర్మసూత్రాలననుసరించి ఇస్తాడు. అందువల్ల నాకు వచ్చే ఫలం ఏదైనా కానీ, దాన్ని నేను సణక్కుండా, గొణక్కుండా, తిట్టకుండా, బాధపడకుండా స్వీకరిస్తాను.' ఇలాంటి సంసిద్ధమైన మనస్సును ఈశ్వరార్పణ భావన అంటారు. అంటే మనం ఏ పనిచేసినా, దానికి వచ్చే ఫలాన్ని చిరునవ్వుతో స్వీకరించగలిగే సంసిద్ధత. దీన్ని మయి సన్న్యస్య అన్నాడు కృష్ణపరమాత్మ.

**మత్పరాః** – ఈ ఈశ్వరార్పణ భావన పెంపొందించుకునేటప్పుడు, ఒక విషయం మర్చిపోకూడదు. ఇదంతా నేను భక్తియోగంలోని ఐదవమెట్టు ఎక్కటానికి కావాల్సిన అర్హతను సంపాదించుకోవటానికి చేస్తున్నాను. నేనిప్పుడు నాలుగవదశలో ఉన్నాను. ఐదవదశకు చేరుకోవాలి అనుకోవాలి. మత్పరాః అంటే నిర్గుణ ఈశ్వరజ్ఞానం పొందాలనే లక్ష్యంమీదే ఎప్పుడూ దృష్టి నిలపాలి.

**అనన్యేన ఏవ యోగేన** – ఆధ్యాత్మికమార్గంలోకి వచ్చాక, లక్ష్యంనుంచి ఎన్నడూ దృష్టి మళ్ళించకూడదు. మొదట్లో మీ లక్ష్యం గురించి బాగానే శ్రద్ధ ఉంటుంది కాని, వ్యావహారిక విషయాల్లో తలదూర్చినకొద్దీ బాధ్యతలు పెరుగుతాయి, కుటుంబసభ్యులు పెరుగుతారు, ఇంకా అనుబంధాలు పెరుగుతాయి, కార్యకలాపాలు పెరుగుతాయి. దానితో మీ ప్రాథమిక లక్ష్యం ఎప్పుడో మీకు తెలియకుండానే పక్కకి వెళ్ళిపోతుంది.

ఇలా లక్ష్యంమీద ఏకాగ్రత చెదిరిపోకుండా, ఎప్పుడూ దాని ధ్యాసలోనే ఉండాలని చెపుతున్నాడు కృష్ణపరమాత్మ. విశ్వరూప ఉపాసకుడు తన అంతిమ లక్ష్యమైన జ్ఞానయోగానికి తనను సంసిద్ధుణ్ణి చేసుకోవాలి. దీనిని అనన్య యోగః అంటారు.

ఇంతకుముందు కూడా ఈ ఉదాహరణ చూశాము. మీరు ఢిల్లీకి రైలులో వెళుతుంటే, దారిలో ఎన్నో స్టేషన్లు వస్తాయి. మీరు ఆయా స్టేషన్లలో దిగి పుస్తకాలు, అల్పాహారం, పండ్లు, మంచినీళ్ళు – ఏదో ఒకటి కొంటారు. అతనికి డబ్బులు ఇచ్చి చిల్లర తీసుకుంటారు. కాని ఎన్ని వ్యవహారాలు నడుపుతున్నా రైలు గురించి మర్చిపోరు.

ఏదో స్టేషనులో కొన్న వడ ఎంతో రుచికరంగా ఉండవచ్చు; దాన్ని మీరు ఆస్వాదిస్తూ ఉండి ఉండవచ్చు; కాని మీ మనస్సులో రైలు ధ్యానం అవుతూనే ఉంటుంది. మీరు చివరికి వెళ్ళాల్సింది ఢిల్లీకి. ఆ రైలును మిస్సవకూడదు అని జాగ్రత్తగా చూసుకుంటూనే ఉంటారు. దీనినే అనన్యయోగః అంటారు.

**ధ్యాయంత ఉపాసతే** – ఈ విశ్వరూప ఉపాసనద్వారా నన్ను సేవిస్తారు. **విశ్వరూప ధ్యానేన తే మాం పూజ్యంతి.**

**యద్యత్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనం ॥**

**కాయేన వాచా మనసేంద్రియైర్వా బుద్ధ్యాత్మనా వా ప్రకృతేః స్వభావాత్**
**కరోమి యద్యత్సకలం పరస్మై నారాయణాయేతి సమర్పయామి**

ఇవన్నీ మన సాంప్రదాయంలో మనకు ఉగ్గుపాలతో నూరిపోయటానికి ప్రయత్నించారు. కాని మనం వాటి సారాన్ని పట్టించుకోకుండా, గడగడా చదివేసి, ఆఫీసుకు పారిపోతాము లేదా టీవీ ముందు చతికిలబడతాము.

ఇంతకీ ఇటువంటి అంకితభావంతో చేసిన సాధకులు పొందే ఫలమేమిటి? దాన్ని వచ్చే శ్లోకంలో చెప్పబోతున్నాడు.

శ్లో. 7 **తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
**భవామి నచిరాత్ పార్థ మయ్యావేశితచేతసామ్ ॥**
తేషామ్, అహమ్, సముద్ధర్తా, మృత్యుసంసారసాగరాత్,
భవామి, నచిరాత్, పార్థ, మయి, ఆవేశితచేతసామ్ ॥

| | | | |
|---|---|---|---|
| పార్థ! | = ఓ అర్జునా! | నచిరాత్ | = శీఘ్రముగా |
| తేషామ్ | = అట్టి | మృత్యుసంసార సాగరాత్ | = మృత్యురూప సంసారసాగరమునుండి |
| మయి, ఆవేశిత | = నాయందే లగ్నమైన | | |
| చేతసామ్ | = చిత్తము గలవారికి | సముద్ధర్తా | = ఉద్ధరించువాడను |
| అహమ్ | = నేను | భవామి | = అగుదును |

**హే పార్థ! మయి ఆవేశిత–చేతసామ్ తేషామ్ మృత్యు–సంసార–సాగరాత్**
**న చిరాత్ అహమ్ సముద్ధర్తా భవామి ।**

తా: ఓ అర్జునా! అట్టి నాయందే లగ్నమైన చిత్తము గలవారికి నేను శీఘ్రముగా మృత్యురూప సంసార సాగరమునుండి ఉద్ధరించువాడను అగుదును.

ఓ అర్జునా, ఈ విశ్వరూప ఉపాసకులు నాకు ప్రియమైనవారు అంటున్నాడు కృష్ణపరమాత్మ. వారి ముఖ్య ఉద్దేశం భగవంతునియొక్క స్వరూపాన్ని తెలుసుకోవటం. వారి లక్ష్యంమీదే వారికి శ్రద్ధ ఉంది కాబట్టి, వారిని ప్రత్యేకంగా చూస్తాను అంటున్నాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

**మయి ఆవేశితచేతసామ్** – వీరు నన్ను లౌకిక ఫలాలకోసం ప్రార్థించరు, నన్నే లక్ష్యంగా పొందాలనుకుంటున్నారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఈశ్వరే న తు సాధన బుద్ధి పరంతు ఈశ్వరే సాధ్యాబుద్ధిః**

భక్తిలో రెండు రకాల ఉన్నాయి. మొదటిది సకామభక్తితో లౌకికసుఖాలు పొందాలి. అంటే సుఖాలు సాధ్యం, భగవంతుడు సాధన. నిష్కామభక్తిలో భగవంతుడే సాధన, సాధ్యం కూడా. ఇటువంటి భక్తులను ఏడవ అధ్యాయంలో జిజ్ఞాసు భక్తులుగా వర్ణించాడు కృష్ణపరమాత్మ. వీరిది అనన్యభక్తి. వారికి ఏం చేస్తాడు?

**తేషామ్ అహం సముద్ధర్తా** – వారిని నేను రక్షిస్తాను. వారికి నేను రక్షకుడిగా ఉంటాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. దేన్నుంచి రక్షిస్తాడు?

**మృత్యుసంసారసాగరాత్** – సంసార సాగరంనుంచి రక్షిస్తాను అంటున్నాడు. సంసారంలో అన్నింటికన్నా దారుణమైన సమస్య మృత్యువు. దగ్గరివారిని పోగొట్టుకుంటామేమోననే భయం. మృత్యుసంసార అంటే మృత్యువనే సమస్య ఉన్న సంసారం. దాన్నించి రక్షిస్తాను అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఎన్నాళ్ళలో రక్షిస్తాడు?

**నచిరాత్** – త్వరగా అంటున్నాడు కృష్ణపరమాత్మ. ఇంత సమయంలో అని చెప్పటం లేదు. ఎందుకంటే అది భక్తుల భక్తిస్థాయినిబట్టి ఉంటుంది. అందువల్ల త్వరలోనే రక్షిస్తాను అంటున్నాడు. ఈ భక్తులు ఎవరో మర్చిపోకూడదు. వారు భక్తియోగం అనే నిచ్చెనలో నాలుగవ మెట్టుమీద ఉన్న విశ్వరూప ఉపాసకులు.

ఈ నాలుగవ మెట్టుమీద ఉన్న ఉపాసకులకు వెంటనే మోక్షాన్ని ఇస్తాడా? ఇవ్వడు. ఎందుకంటే మోక్షం పొందాలంటే జ్ఞానం పొందితీరాలనీ, జ్ఞానం తప్ప వేరే మార్గం లేదనీ కూడా చూశాము. మోక్షం పొందాలంటే జ్ఞానం పొందాలి; జ్ఞానం పొందాలంటే జ్ఞానయోగ్యత ఉండాలి. అందువల్ల కృష్ణపరమాత్మ వారిని రక్షిస్తాను అంటే వారికి జ్ఞానయోగ్యతను కలుగజేస్తాను అని అర్థం. వారు ఐదవమెట్టు ఎక్కడానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తాడు. వారికి అర్హత పెంచాలంటే, అర్హతను కలుగజేస్తాడు; గురువు కావాలంటే గురువును ఏర్పాటు చేస్తాడు.

**నచిరాత్ పార్థ అహం సముద్ధర్తా భవామి**

అందువల్ల జ్ఞానం కష్టం అనుకుంటే దాన్ని కొన్నాళ్ళు పక్కనపెట్టి, నాలుగవ మెట్టుకి దిగివచ్చి, విశ్వరూప ఉపాసన చెయ్యండి. ఆ ఉపాసనను తర్వాత రాబోయే శ్లోకంలో ఇంకా వివరిస్తున్నాడు.

శ్లో. 8 **మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥**

మయి, ఏవ, మనః, ఆధత్స్వ, మయి, బుద్ధిమ్, నివేశయ,
నివసిష్యసి, మయి, ఏవ, అతః, ఊర్ధ్వమ్, న, సంశయః ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| మయి | = | (కనుక) నాయందే | అతః, ఊర్ధ్వమ్ | = | ఆ పిమ్మట |
| మనః, ఆధత్స్వ | = | మనస్సును లగ్నము చేయుము | మయి, ఏవ | = | నాయందే |
| మయి, ఏవ | = | నా యందే | నివసిష్యసి | = | నివసించెదవు |
| బుద్ధిమ్ | = | బుద్ధిని | సంశయః, న | = | ఇందేమాత్రము |
| నివేశయ | = | నిమగ్నమొనర్పుము | | | సంశయము లేదు |

**మయి ఏవ మనః ఆధత్స్వ, మయి బుద్ధిమ్ నివేశయ, అతః ఊర్ధ్వమ్**
**మయి ఏవ నివసిష్యసి, (అత్ర) సంశయః న ।**

తా: కనుక నాయందే మనస్సును లగ్నము చేయుము. నా యందే బుద్ధిని నిమగ్నమొనర్పుము. ఆ పిమ్మట నాయందే నివసించెదవు. ఇందేమాత్రము సంశయము లేదు

ఈ శ్లోకంతో నాలుగవ దశను ముగిస్తున్నాడు.

**మయి** – విశ్వరూప ఈశ్వరుడు అయిన నామీదే. నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందలేకపోతే సగుణ ఈశ్వరధ్యానం కొన్నాళ్ళు చెయ్యాలి.

**ఆధత్స్వ మనః** – నీ మనస్సును నాయందే నిలబెట్టు.

భగవంతుడు అఖండనిధి. మనం మనుష్యులనుంచి ప్రేమను ఆశిస్తే వారు ఎప్పటికీ ఆ ప్రేమను పంచుతారన్న నమ్మకం లేదు. ఎంతో గాఢంగా ప్రేమించినవారు కూడా కొన్నాళ్ళయ్యాక మననుంచి విడిపోతారు; మనను ద్వేషించవచ్చు కూడా. అలాగే మనం కష్టపడి కూడబెట్టిన ధనం ఎన్నాళ్ళు మన దగ్గరే ఉంటుందో తెలియదు; మనం ఆశతో కొనుక్కున్న వస్తువులు పాడయిపోవచ్చు. ఎన్నడూ జలుబు కూడా చేసి ఎరగని మనకు ఏదైనా అనారోగ్యం కలుగవచ్చు. అలా జగత్తులోని మనుష్యులు, వస్తువులు, ధనం ఏవీ మనకు శాశ్వతానందాన్ని ఇవ్వలేవు. కృష్ణపరమాత్మ వారికి కావాల్సినవి మీరు వారికి ఇవ్వండి; కాని మీకు ఏం కావాలన్నా నా దగ్గర్నుంచి తీసుకోండి అంటున్నాడు. నా దగ్గర్నుంచి అంటే భగవంతునినుంచి తీసుకోవాలి.

తోటి మనుష్యులనుంచి కొంచెం ప్రేమకోసం అర్రులు చాస్తే వారు మనం కోరుకున్న ప్రేమను తిరిగి ఇవ్వలేక పోవచ్చు. వారు పరాయిదేశం వెళ్ళకుండా మన దగ్గరే ఉండాలనే ఆశ మనను పట్టి పీడిస్తుంది. ఏ అమెరికాకో ఎగిరి వెళ్ళిపోతే, మనం చూడాలనుకున్నప్పుడల్లా వారు పరుగెత్తుకు రాలేరు. ఒక వయస్సు వచ్చి, మనం మంచాన పడితే, మన ప్రేమ ఇంకా సంకుచితమైపోతుంది. పిల్లలు వారి ఉద్యోగధర్మాన్ని కూడా పక్కన పెట్టి మన మంచం పక్కనే కూర్చోవాలనే పాశం లాగుతుంటుంది.

మనం విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యగలగితే, ఈ బాధ ఉండదు. ఎటు చూసినా, అంతటా భగవంతుడే ఉంటాడు. అందువల్ల మీ భావోద్రేకాలకు నామీద ఆధారపడండి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**మయి బుద్ధిం నివేశయ** – అంతేకాదు, నీ బుద్ధి కూడా నాయొక్క (భగవంతునియొక్క) విశ్వరూపదర్శనం గురించి నమ్మాలి అంటున్నాడు.

ఊరికే విశ్వరూప ఈశ్వరుడు అని జపించుకుంటూ వెళితే లాభం లేదు. మనిషిగా మనం బుద్ధిజీవులం. బుద్ధి పనే తార్కికంగా ఆలోచించటం. అది మనను నిలదీస్తుంది – జగత్తును విశ్వరూప ఈశ్వరునిగా ఎందుకు భావించాలి అంటుంది. దానికి మనం నచ్చచెప్పగలగాలి. అలా చెప్పగలగాలంటే శాస్త్ర అధ్యయనం చెయ్యాలి.

శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యకుండా కేవలం భక్తి మాత్రం పెంపొందించుకుంటే, అది చిన్నగాలికే రెపరెప లాడిపోతుంది. పెనుతుఫాను వస్తే, పూర్తిగా మాయమయిపోతుంది. కాని శాస్త్రాన్ని అధ్యయనం చేసి, దైవం గురించి నేర్చుకుని, అప్పుడు భక్తి పెంపొందించుకుంటే ఆ భక్తి చెక్కుచెదరకుండా ఉంటుంది. అటువంటి నిశ్చలభక్తి పెంపొందించుకోవటం ఎలా? కృష్ణపరమాత్మ 7, 9, 10, 11 అధ్యాయాల్లో చేసిన బోధను మళ్ళీ ఒకసారి అధ్యయనం చెయ్యాలి.

ఆ బోధ సారాంశం చూద్దాము ఇప్పుడు – భగవంతుడు జగత్కారణం. కారణం అంటే సృష్టికర్త. భగవంతుడే నిమిత్తకారణమూ, ఉపాదాన కారణమూ కూడా. భగవంతుడు కారణం; జగత్తు కార్యం.

కార్యం కారణానికి భిన్నంగా ఉండదు. ఇది ఒక ప్రకృతి నియమం; అంటే కారణరూప ఈశ్వరుడు, కార్యజగత్తుకు భిన్నంగా లేదు. ఉదాహరణకు మనం చేతిలో ఒక నగను పట్టుకుంటే, మనం బంగారాన్ని పట్టుకున్నట్టే అర్థం. అలాగే కుండను పట్టుకుంటే మట్టిని పట్టుకున్నట్టే అర్థం. జగత్తును చూస్తుంటే ఈశ్వరుణ్ణి చూస్తున్నట్టే అర్థం. ఆకాశం ఈశ్వరుడు; వాయువు ఈశ్వరుడు; అగ్ని ఈశ్వరుడు.

**సర్వం ఈశ్వరమయమ్ జగత్**

ఈ దృఢజ్ఞానం కలుగుతుంది శాస్త్రాన్ని అధ్యయనం చేస్తే. అందువల్ల బుద్ధిని కూడా నామీదే నిలుపు అంటున్నాడు కృష్ణపరమాత్మ. నమ్మకం కుదరకపోతే ఇంకా అధ్యయనం చెయ్యండి. ఇంకా నమ్మకం కుదరకపోతే మళ్ళీ అధ్యయనం చెయ్యండి; ఇంకా నమ్మకం కుదరకపోతే, అధ్యయనం చేస్తూనే ఉండండి. అలా ఎన్నాళ్ళు? విశ్వరూపదర్శనంమీద శ్రద్ధ కలిగేంతవరకు.

ఈ జన్మలో శ్రద్ధ ఏర్పడకపోతే వచ్చే జన్మలో కూడా అధ్యయనం చెయ్యాలి. మా గురువే మళ్ళీ ఆ జన్మలో కూడా వస్తాడా? ఇంకా మంచి గురువు వస్తాడు. ఎందుకు? ఈ గురువుమీద మీకు శ్రద్ధ ఉండి ఉంటే, ఆయన చేసిన బోధ అర్థమై ఉండేది. విశ్వరూప ఈశ్వరధ్యానం చేసివుండేవారు. ఇది పక్కన పెడితే, మయి బుద్ధిం నివేశయ అంటే నామీదే బుద్ధి పెట్టు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అలా శ్రద్ధ పెడితే ఏమవుతుంది?

**నివసిష్యసి మయ్యేవ** – నాలోనే ఉంటావు అంటున్నాడు కృష్ణపరమాత్మ. విశ్వరూపభక్తియొక్క గొప్పతనం ఏమిటి? ఆ భక్తిలో భగవంతునినుంచి దూరంగా ఎన్నడూ ఉండరు. భగవంతుడు ఇంకో భక్తుణ్ణి అనుగ్రహించటానికి వెళ్ళిపోతాడు, నా దగ్గర ఉండడు అనే భయం ఉండదు. ఎందుకంటే విశ్వరూప ఈశ్వరుడు అంతటా ఉంటాడు. మన దగ్గరా ఉంటాడు, ఇంకొకరి దగ్గరా కూడా ఉంటాడు. అప్పుడు నన్ను వదిలి వెళతావా, ఇది నీకు తగునా,

ఇది ధర్మమా అని బాధపడము. అల ఎలా సముద్రంలోనే ఉంటుందో, అలా భక్తుడు ఎప్పుడూ విశ్వరూప ఈశ్వరునిలోనే ఉంటాడు.

**అతః ఊర్ధ్వమ్** – ఆ తర్వాత. దేని తర్వాత?

విశ్వరూప ఉపాసన చేశాక, భగవంతుడు నీకు దూరంగా ఉన్నాడని బాధపడవు.

**న సంశయః** – ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

అందువల్ల జ్ఞానయోగం కష్టం అనుకుంటే, భక్తియోగంలోని నాలుగవ మెట్టుకి దిగి, విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యాలి. దాని తర్వాత జ్ఞానయోగ్యత పొంది, ఐదవమెట్టుకు రావాలి.

కాని నాలుగవ మెట్టు కూడా కష్టమే అనిపిస్తే ఏం చెయ్యాలి? ఎందుకంటే విశ్వరూపదర్శనం చెయ్యటానికి విశాల దృక్పథం ఉండాలి. జగత్తంతా ఈశ్వరమయంగా భావిస్తే రాగద్వేషాలకు తావులేదు. సృష్టిలో ప్రతిదాన్నీ ఈశ్వరసృష్టిగా భావించాలి. దేని గురించీ ఫిర్యాదు చెయ్యకూడదు. కొందరిని నేను భగవంతునిగా చూడలేను అంటారు కొందరు. **వారు తప్పు** అనే పట్టిక చాలా మందికి ఉంటుంది. కాని భగవంతుడు వారిలో కూడా ఉన్నాడు.

భగవంతుడు అంతటా ఉన్నాడు. అష్టమూర్తి ఈశ్వరస్తుతిలో ఈశ్వరుణ్ణి ఎనిమిది అంశాలు ఉన్నట్టుగా కొలుస్తారు. అవి – పంచభూతాలు, సూర్యుడు, చంద్రుడు, పుమాన్. పుమాన్ అంటే సర్వజీవరాశి. ఆ విధంగా భగవంతుడు అంతటా ఉన్నాడు. ఆయననే అష్టమూర్తి ఈశ్వరుడు అనీ, విరాట్ ఈశ్వరుడు అనీ, విశ్వరూప ఈశ్వరుడు అనీ అంటారు.

కాని విశ్వరూపదర్శనం కూడా నాకు కష్టమంటే ఏం ఫర్వాలేదు; ఇంకొక మెట్టు కిందకు దిగిరండి అంటున్నాడు కృష్ణపరమాత్మ. మూడవమెట్టును తర్వాత రాబోయే శ్లోకంలో చూస్తాము.

శ్లో. 9 **అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥**
అథ, చిత్తమ్, సమాధాతుమ్, న, శక్నోషి, మయి, స్థిరమ్,
అభ్యాసయోగేన, తతః, మామ్, ఇచ్ఛ, ఆప్తుమ్, ధనంజయ ॥

| | | | |
|---|---|---|---|
| అథ | = ఒకవేళ | తతః | = అట్టి స్థితిలో |
| చిత్తమ్ | = చిత్తమును | ధనంజయ! | = ఓ అర్జునా! |
| మయి | = నాయందు | అభ్యాసయోగేన | = ఇష్టదేవతా ఉపాసనద్వారా |
| స్థిరమ్ | = స్థిరముగా | మామ్, ఆప్తుమ్ | = నన్ను పొందుటకు |
| సమాధాతుమ్ | = నిల్పుటకు | ఇచ్ఛ | = కోరుము (యత్నింపుము) |
| న, శక్నోషి | = సమర్థుడవు కానిచో | | |

**హే ధనఞ్జయ! అథ మయి స్థిరమ్ చిత్తమ్ సమాధాతుమ్ న శక్నోషి,**
**తతః అభ్యాస-యోగేన మామ్ ఆప్తుమ్ ఇచ్ఛ ।**

తా: ఒకవేళ చిత్తమును నాయందు స్థిరముగా నిల్పుటకు సమర్థుడవు కానిచో అట్టి స్థితిలో ఓ అర్జునా! ఇష్టదేవతా ఉపాసనద్వారా అంటే ఏకరూప ఈశ్వర ఉపానద్వారా నన్ను పొందుటకు కోరుము.

సి) **ఉపాసనయోగం స్థాయి 1: ఏకరూప ఈశ్వరధ్యానం - శ్లోకం 9**

విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యలేకపోతే, ఏకరూప ఈశ్వరధ్యానం చెయ్యవచ్చు. మనకు ముక్కోటి దేవతలు ఉన్నారు. ఇష్టదేవతా పూజ చెయ్యవచ్చు. దేవతలనే కాదు; జంతువులను, వృక్షాలను కొలుస్తాము మన సంస్కృతిలో.

**అథ** - ఒకవేళ. అంటే నాలుగవ స్థాయి భక్తిని నేను పాటించలేను అని ఒకవేళ నువ్వు అనుకుంటే.

**చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్** - నా విశ్వరూపదర్శనంమీద నువ్వు మనస్సు పెట్టి ఉపాసన చెయ్యలేకపోతే, వేరే మార్గం ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. మయి అంటే నా విశ్వరూప ఈశ్వరునిమీద; చిత్తం సమాధాతుం అంటే ఉపాసన; స్థిరమ్ - స్థిరంగా; న శక్నోషి - చెయ్యలేకపోతే. ఇంకొక మార్గముంది. ఏమిటది?

ఏకరూప ఈశ్వరధ్యానం. దీన్నే ఇష్టదేవతా ఉపాసన అని కూడా అంటారు. మనకు అనేక దేవతలు ఉన్నారు. రాముడు, కృష్ణుడు, దేవి, అయ్యప్ప, వేంకటేశ్వరుడు, వినాయకుడు. వీరే కాక ఇంకా ఎందరో దేవుళ్ళు ఉన్నారు. కృష్ణుణ్ణి తీసుకుంటేనే అనేక రూపాల్లో కొలుస్తాము - చిన్నికృష్ణుడు, గోపీకృష్ణుడు, రాధాకృష్ణుడులాంటి రూపాలు ఉన్నాయి.

మళ్ళీ ఈ భక్తిలో అనేక రకాలు ఉన్నాయి. వాత్సల్యభక్తి చూపిస్తారు కొందరు. యశోదాదేవిలాగా భగవంతుణ్ణి చిన్న బాలునిగా కొలుస్తారు. మరికొందరు స్నేహితునిగా భావిస్తారు. అర్జునుడు, ఉద్ధవుడు అలా భావించారు కృష్ణుణ్ణి. ఈ ఇష్టదేవతాభక్తిని పెంపొందించుకోవటానికి పురాణాలు శ్రవణం చెయ్యాలి. పురాణాల్లో ఈ దేవుళ్ళ లీలలు చూస్తాము. శివభక్తి కావాలంటే శివపురాణం; దేవిని కొలవాలంటే దేవీభాగవతం అధ్యయనం చెయ్యాలి. ఈ దేవతలను 18 పురాణాలు, 18 ఉపపురాణాలు వర్ణిస్తాయి.

**అభ్యాసయోగేన** - అభ్యాసయోగేన అంటే ఇష్టదేవతా ఉపాసన. ఐదవదశ అరూపఈశ్వరజ్ఞానం అయితే, నాలుగవ దశ అనేకరూప ఈశ్వరధ్యానం; ఇది మూడవ దశ. ఇది ఏకరూప ఈశ్వరధ్యానం.

రాగద్వేషాలు తీవ్రంగా ఉన్న వ్యక్తికి విశ్వరూప ఈశ్వరధ్యానం చెయ్యటం కుదరదు. రాగద్వేషాలు ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా మనస్సు సంకుచితమైపోతుంది. అలాంటి వ్యక్తి సముద్రాన్ని, ఆకాశాన్ని, నక్షత్రాలను, చెట్లను, కొండలను చూసి ఆస్వాదించలేడు.

అటువంటి వ్యక్తికి ఇష్టదేవతా ఉపాసన ఉంది అంటున్నాడు కృష్ణపరమాత్మ. దానికి ప్రతిమా ఉపాసన ఉంది లేదా ప్రతీక ఉపాసన ఉంది. ప్రతిమా ఉపాసన అంటే భగవంతుణ్ణి ఒక రూపంతో కొలవటం; ప్రతీక ఉపాసన

అంటే సాలిగ్రామంమీద, లేదా శివలింగంమీద ఉపాసన చెయ్యటం. భగవంతుణ్ణి ఒక ఆకారంలో కొలిస్తే, ఆయనకు కూడా మన రాగద్వేషాలను ఆపాదిస్తాము. నిన్న నేను దీపారాధన చెయ్యలేదు, అందువల్ల భగవంతునికి కోపం వచ్చింది అంటాము. ఆయనకు కూడా ఆకలి వేస్తోంది అనుకుంటాము. అది కూడా మంచిదే. అటువంటి భక్తిని అభ్యాసయోగం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**(అభ్యాసయోగేన) మామ్ ఆప్తుమ్ ఇచ్ఛ** – ఇష్టదేవత ఉపాసనద్వారా నన్ను పొందటానికి ప్రయత్నించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. నన్ను పొందటం అంటే మోక్షం పొందటం.

ఇష్టదేవతా ఉపాసనద్వారా మోక్షం పొందగలమా? దీనికి జవాబు అవును, కాదు. కాదు, ఎందుకంటే ఇష్టదేవతా ఉపాసనవల్ల సాక్షాత్తూ మోక్షం రాదు. కాని అవును, ఎందుకంటే అది మోక్షం పొందటానికి సహకారీ సాధన అవుతుంది. ఇష్టదేవతా ఉపాసన సాధకుణ్ణి నెమ్మదిగా ఒక మెట్టు పైకెత్తిస్తుంది. త్యాగరాజు ముందు రాముణ్ణి పూజించేవాడు. ఒకసారి రాముని విగ్రహం కనపడకపోతే చాలా విచారిస్తాడు. తర్వాత దొరికాక, చాలా ఆనందిస్తాడు. అదే త్యాగరాజు తర్వాత భక్తి పరాకాష్ఠకు చేరుకున్నాక ఈ కీర్తన పాడాడు

**అండాండములు పిండాండములు బ్రహ్మాండములు సర్వమ్ అంతా రామమయమ్**

అంటే ఏకరూపభక్తితో మొదలుపెట్టినా, అది నెమ్మదిగా విశ్వరూపభక్తికి తీసుకువెళుతుంది. విశ్వరూపభక్తి జ్ఞానయోగానికి దారితీస్తుంది. అంటే వేదాంతవిచారణ చేసి నిర్గుణబ్రహ్మజ్ఞానం పొందుతాడు. ఆ విధంగా ఇష్టదేవతా ఉపాసన, విశ్వరూప ఈశ్వర ఉపాసనద్వారా నిర్గుణబ్రహ్మజ్ఞానానికి తీసుకువెళ్ళి మోక్షం వచ్చేలా చేస్తుంది. ఆ విధంగా ఇష్టదేవతా ఉపాసన మోక్షానికి పరంపరా కారణం; సాక్షాత్ కారణం కాదు. అందువల్ల ఇష్టదేవతా ఉపాసనకు దిగివచ్చినా ఫర్వాలేదు.

కాని అది కూడా చెయ్యలేను అని ఎవరైనా అంటే, ఇంకొక మెట్టు దిగి రమ్మంటున్నాడు కృష్ణపరమాత్మ. ఉపాసన అంటే భగవంతుణ్ణి తనలో ఊహించుకోవటం. ఉపాసన మానసకర్మ కాబట్టి ఉపాసన చేసేటప్పుడు శరీరం నిశ్చలంగా ఉండాలి. ఇది ఉపాసన నిర్వచనం. కాని కొంతమంది కాయికపూజను ఉపాసన అనుకుంటారు. కాయికపూజ ఉపాసన కాలేదు; ఎందుకంటే ఉపాసన నిర్వచనం – మానసకర్మ.

ఉపాసనకు నిశ్చలంగా ఒకచోట కూర్చోవాలి. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలను వాడకూడదు. అంటే బాహ్యముఖంనుంచి అంతర్ముఖుడవ్వాలి. మనస్సును బాహ్యప్రపంచంనుంచి వెనక్కి లాగి, అంతర్ముఖం చేస్తేనే, ఇష్టదేవతమీద ఉపాసన సాధ్యమవుతుంది.

కాని రజోగుణం ప్రధానంగా ఉన్న సాధకుడు కాసేపు కూడా కుదురుగా కూర్చోలేడు. ముందు శరీరాన్నే అదుపులో పెట్టలేకపోతే, ఇంక ధ్యానం ఏం చేస్తాడు? అలాంటి వ్యక్తికి ధ్యానం కుదరదు. అటువంటి వ్యక్తి ఇంకొక మెట్టు దిగివచ్చి, రెండవమెట్టుమీద నిలబడతాడు. అంటే ఐదవమెట్టునుంచి నాలుగు, మూడు మెట్లు దిగి, రెండవమెట్టుకు రావచ్చు. ఆ రెండవమెట్టు ఏమిటో పదవశ్లోకంలో చూస్తాము.

శ్లో. 10 **అభ్యాసేప్యసమర్థోఽసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥**
అభ్యాసే, అపి, అసమర్థః, అసి, మత్కర్మపరమః, భవ,
మదర్థమ్, అపి, కర్మాణి, కుర్వన్, సిద్ధిమ్, అవాప్స్యసి ॥

| | | | |
|---|---|---|---|
| అభ్యాసే, అపి | = అభ్యాసమునందును | కర్మాణి | = కర్మలను |
| అసమర్థః, అసి | = అసమర్థుడవైనచో | కుర్వన్, అపి | = చేయుచును |
| మత్కర్మపరమః భవ | = మత్పరాయణుడవై కర్మల నాచరింపుము | సిద్ధిమ్ | = నా ప్రాప్తిరూపసిద్ధిని |
| | | అవాప్స్యసి | = పొందెదవు |
| మదర్థమ్ | = నాకోసం | | |

**(త్వమ్) అభ్యాసే అపి అసమర్థః అసి (చేత్), మత్-కర్మ-పరమః భవ,**
**మత్-అర్థమ్ కర్మాణి కుర్వన్ అపి సిద్ధిమ్ అవాప్స్యసి ।**

తా: అభ్యాసమునందును అసమర్థుడవైనచో మత్పరాయణుడవై కర్మల నాచరింపుము. నాకోసం కర్మలను చేయుచును, నా ప్రాప్తిరూపసిద్ధిని పొందెదవు.

బి) **కర్మయోగం స్థాయి 2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం: శ్లోకం 10**

**అభ్యాసే అపి అసమర్థః** – అభ్యాసయోగం కూడా చెయ్యలేను అని నువ్వు భావిస్తే ఫర్వాలేదు. అభ్యాసయోగం అంటే ఇష్టదేవతా ఉపాసన అంటే ఏకరూప ఈశ్వర ఉపాన అని చూశాము.

**మత్కర్మపరమో భవ** – నువ్వు కర్మలను చెయ్యి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కర్మల్లో మళ్ళీ రెండురకాల కర్మలు ఉన్నాయి. అవి నిష్కామకర్మ, సకామకర్మ. నిష్కామకర్మలో సంఘసేవ చేస్తారు. మానవసేవను మాధవసేవగా చేస్తారు. అందువల్ల ఈ కర్మను పరోపకారకర్మలు అని కూడా అంటారు. పంచమహాయజ్ఞాలద్వారా సమాజసేవ చెయ్యవచ్చు.

**పరోపకారాయ వహన్తి నద్యః, పరోపకారాయ దుహన్తి గావః ।**
**పరోపకారాయ ఫలన్తి వృక్షాః, పరోపకారార్థమ్ ఇదం శరీరమ్ ॥**

**పరోపకారాయ వహన్తి నద్యః** – నదులన్నీ మానవాళికి నీరు అందించటంకోసం ప్రవహిస్తున్నాయి;

**పరోపకారాయ దుహన్తి గావః** – పరులకు ఉపకారం చెయ్యటానికి ఆవులు పాలు ఇస్తున్నాయి. నిజానికి వాటి దూడలకు కావాల్సినంత అందనే అందదు.

**పరోపకారాయ ఫలన్తి వృక్షాః** – చెట్లు పరులకోసమే ఫలాలను ఇస్తాయి. నిజానికి ఫలంకోసం మనం వాటిని రాళ్ళతో కొట్టినా, అవి మనకు పండ్లను రాలుస్తాయి. ఆ విధంగా ప్రకృతిలో చూస్తే ప్రతిదీ ఇచ్చేది ఎక్కువా, తను తిరిగి తీసుకునేది తక్కువా ఉంటుంది.

**పరోపకారార్థమ్ ఇదం శరీరమ్** – మన శరీరం ఉన్నది కూడా ఇతరులకు సేవ చెయ్యటానికి. మనం కూడా ప్రకృతిని చూసి ఇవ్వటం నేర్చుకోవాలి.

**ఛాయామ్ అన్యస్య కుర్వన్తి తిష్ఠన్తి స్వయమ్ ఆతపే**
**ఫలాన్యపి పరార్థాయ వృక్షాః సత్పురుషా ఇవ**

**ఛాయామ్ అన్యస్య కుర్వన్తి** – చెట్లు ఇతరులకు నీడను ఇస్తాయి కాని;

**తిష్ఠన్తి స్వయమ్ ఆతపే** – అవి పాపం ఎండలో నిలుచుంటాయి;

**ఫలాన్యపి పరార్థాయ** – వాటికి పండే పండ్లను కూడా ఇతరులకు ఇస్తాయి;

**వృక్షాః సత్పురుషా ఇవ** – వృక్షాలు సత్పురుషులలాంటివి. సత్పురుషులు దేశశ్రేయస్సుకోసం పాటుపడినట్టుగా వృక్షాలు ఇతరులకోసమే పాటుపడతాయి.

మనం కూడా అలా సమాజానికి సేవ చెయ్యాలి. కాని ఆ సేవ చేసేటప్పుడు నేను కాబట్టి ఇంత సేవ చేస్తున్నాను అనే అహంకారం తలకెక్కే ప్రమాదం ఉంది. అలా కాకుండా ఉండాలంటే సమాజాన్ని ఈశ్వరునిగా భావించి, ఈశ్వరార్పణ భావనతో చెయ్యాలి.

**యద్యద్ కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్**

మానవసేవయే మాధవసేవ అనే అంకితభావంతో చెయ్యాలి. అందువల్ల కావాల్సినన్ని కర్మలు చెయ్యి, కాని నిష్కామకర్మలు చెయ్యి. అందువల్లనే మత్కర్మపరమో భవ అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే ఈశ్వరార్పణ భావనతో కర్మలు చెయ్యమంటున్నాడు. అప్పుడవి నిష్కామకర్మ, చిత్తశుద్ధి ప్రధానకర్మలు అవుతాయి. ఈ స్థాయిభక్తి నెమ్మదిగా ఇష్టదేవతా ఉపాసన మెట్టుమీదకు వెళ్ళటానికి తోడ్పడుతుంది.

**మదర్థమపి కర్మాణి కుర్వన్** – నువ్వు అలాంటి పరోపకార కర్మలు చేస్తే;

**సిద్ధిమ్ అవాప్స్యసి** – నువ్వు మోక్షం పొందుతావు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

నిష్కామకర్మ అంటే నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రలు చదివితే వారు దేశంకోసం వారి సర్వస్వాన్నీ ధారపోశారు. వారి ఆస్తిపాస్తులను, కుటుంబాలను త్యాగం చేశారు. ఆఖరి నెత్తురుబొట్టు చిందేదాకా పోరాడి, మరణించారు. వారిలో చాలామంది వారు ఏ స్వాతంత్ర్యంకోసం అయితే సర్వస్వాన్నీ పోగొట్టుకున్నారో, ఆ స్వాతంత్ర్యాన్ని చూడకుండానే ఆఖరిశ్వాస వదిలారు. శ్రమ ఒకరిదీ, ఫలితం ఇంకొకరిదీ అయింది. నిష్కామకర్మ అంత గొప్పది.

కాని ఒక విషయం జాగ్రత్తగా గుర్తు పెట్టుకోవాలి. నిష్కామకర్మవల్ల మోక్షం వస్తుందంటున్నాడు కృష్ణపరమాత్మ. కాని సాక్షాత్తూ మోక్షమార్గంగా తీసుకోకూడదు దీన్ని. ఇందాక చూసినట్టే ఇది పరంపరగా మోక్షాన్ని ఇస్తుంది. భక్తియోగం అనే నిచ్చెనలో కిందనుంచి చూస్తే నిష్కామకర్మ రెండవ మెట్టు. నిష్కామకర్మనుంచి ఏకరూప ఉపాసన అనే మూడవమెట్టు ఎక్కి, అక్కడ్నుంచి అనేకరూప ఉపాసన అనే నాలుగవ మెట్టు ఎక్కి, అక్కడ్నుంచి

జ్ఞానయోగమనే ఐదవమెట్టు ఎక్కి, అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితే, అప్పుడు మోక్షం పొందుతారు. అందువల్ల నిష్కామకర్మనుంచి సాక్షాత్తూ మోక్షం రాదు. అయినా ఫర్వాలేదు, ఆ మెట్టునుంచే మొదలుపెట్టవచ్చు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

కొంతమంది నిష్కామకర్మకు కూడా రాలేమంటారు. ఎందుకంటే వారికి ఎన్నో బాధ్యతలు ఉంటాయి; దానికి సంబంధించిన కోరికలు కోరాలి. ఆ కోరికలు తన స్వంతానికే కాకపోవచ్చు; కుటుంబ శ్రేయస్సుకోసం కావచ్చు, కాని వాటికోసం సకామకర్మ చెయ్యకతప్పదు. చిన్నబ్బాయికి 99.99% మార్కులు రావాలి; పెద్దబ్బాయికి ఇంజనీరింగ్ కాలేజీలో సీటు రావాలి; మనవడు వృద్ధిలోకి రావాలి. ఇలా అనంతంగా సాగిపోతాయి. నా కోరికలన్నీ తీరాక, నిష్కామకర్మకు వస్తాను అంటారు.

నా భార్య, పిల్లలు, మనవళ్ళు, ఇరుగుపొరుగు వారి సమస్యలన్నీ తీరాక కాని నేను నిష్కామకర్మ గురించి ఆలోచించలేను అంటారు అటువంటివారు. కోరికలు అనంతం. వీటిని కామః అంటారు సంస్కృతంలో. ఇంగ్లీషులో కామా అన్నా అక్కడితో అవలేదు అని అర్థం. అలాంటి వారి సంగతేమిటి?

అయినా ఫర్వాలేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ. చక్కగా మీ వ్యక్తిగతమైన కోరికలన్నీ తీర్చుకోండి; పిల్లల చదువులు చదివించి, అమ్మాయి పెళ్ళి చేయించి, మనవళ్ళకు అక్షరాభ్యాసం చేయించి, నెమ్మదిగానే రండి. ఇంటిపెద్దగా మీ బాధ్యతలు మీరు నెరవేర్చాలి. అందువల్ల సకామకర్మలు కూడా చెయ్యవచ్చు. నిజానికి వేదమే అనేక కామ్యకర్మలను ఇచ్చింది. ఏ కోరిక ఉంటే అది తీర్చుకుంటేనే మంచిది. లేకపోతే వేదాంతానికి వచ్చినా కూడా, కళ్ళు మూసుకుంటే ఆ కోరికే కళ్ళముందు నాట్యం చేస్తుంది. అటువంటి వారిని మిథ్యాచారి అన్నాడు కృష్ణపరమాత్మ.

**కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥** – 3.6

తీరని కోరిక ఏదైనా ఉంటే అది మనస్సులో తొలుస్తూనే ఉంటుంది. అందువల్ల ఆ కోరికలు తీర్చుకోవాలి. అది భక్తియోగంలో కిందనుంచి మొదటిమెట్టు; పైనుంచి ఆఖరిమెట్టు. దాన్ని పదకొండవ శ్లోకంలో చూస్తాము.

శ్లో. 11 **అథైతదప్యశక్తోఽసి కర్తుం మద్యోగమాశ్రితః ।**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥**
అథ, ఏతత్, అపి, అశక్తః, అసి, కర్తుమ్, మద్యోగమ్, ఆశ్రితః,
సర్వకర్మఫలత్యాగమ్, తతః, కురు, యతాత్మవాన్ ॥

| | | | |
|---|---|---|---|
| అథ | = ఒకవేళ | ఏతత్ | = ఈ ఉపర్యుక్త సాధనను |
| మద్యోగమ్ | = నా ప్రాప్తిరూపయోగమును | కర్తుమ్, అపి | = చేయుటకును |
| ఆశ్రితః | = ఆశ్రయించినవాడవై | అశక్తః, అసి | = అసమర్థుడవైనచో |

| | | | | |
|---|---|---|---|---|
| తతః | = అట్టి స్థితియందు | సర్వకర్మఫల | = సకల కర్మల ఫల |
| యతాత్మవాన్ | = మనోబుద్ధ్యాదులను వశపఱచుకొన్నవాడవై | త్యాగమ్ | = త్యాగమును |
| | | కురు | = చేయుము |

**అథ ఏతత్ అపి కర్తుమ్ అశక్తః అసి (చేత్), తతః యత-ఆత్మవాన్ మత్-యోగమ్ ఆశ్రితః (సన్) సర్వ-కర్మ-ఫల-త్యాగమ్ కురు ।**

తా: ఒకవేళ నా ప్రాప్తిరూపయోగమును ఆశ్రయించినవాడవై ఈ ఉపర్యుక్త సాధనను చేయుటకును అసమర్థుడవైనచో అట్టి స్థితియందు మనోబుద్ధ్యాదులను వశపఱచుకొన్నవాడవై సకల కర్మల ఫలత్యాగమును చేయుము.

**ఎ) కర్మయోగం స్థాయి 1 - సకామకర్మ ప్రధాన కర్మయోగం: శ్లోకం 11**

నిష్కామకర్మ లేదా పరోపకార కర్మ చెయ్యలేకపోయినా ఫర్వాలేదు, సకామకర్మ చెయ్యి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**అథ ఏతత్ అపి కర్తుమ్ అశక్తః అసి** - ఒకవేళ పరోపకార కర్మ చెయ్యలేకపోయినా; నిష్కామకర్మ చెయ్యలేకపోయినా,

**మద్యోగమాశ్రితః** - ఈశ్వరార్పణ భావనతో చెయ్యలేకపోయినా ఫర్వాలేదు. సకామకర్మ చెయ్యి ఫర్వాలేదు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

సకామకర్మ అంటే కోరికతో చేసే కర్మ. లౌకిక ఫలాలకోసం చేస్తాడు లేదా తనకు వ్యక్తిగతంగా ఏదో లాభం కలగటానికి చేస్తాడు. అయినా ఫర్వాలేదు. కాని దానికి రెండు నియమాలు జోడించాలి. ఒకటి అది ధర్మపరంగా ఉండాలి. రెండు దాన్ని ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. అలాగే ఫలం వస్తే అతనే అనుభవించవచ్చు, సమాజానికి తిరిగి ఇవ్వనవసరం లేదు. కాని దాన్ని తన విజయంగా పొంగిపోకుండా, ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. అంటే సకామకర్మ కూడా కర్మయోగంలోకే వస్తుంది.

కర్మయోగంలో రెండు అంశాలు ఉంటాయని చూశాము. అవి సరియైన కర్మ, సరియైన దృక్పథం. సకామ కర్మలో సరియైన దృక్పథంలోని ఈశ్వరప్రసాదబుద్ధి పెంచుకోవాలి.

**సరియైన దృక్పథం = ఈశ్వరార్పణ భావన + ఈశ్వరప్రసాదబుద్ధి**

ఈశ్వరప్రసాద బుద్ధితో కర్మఫలాన్ని స్వీకరించటం నేర్చుకుంటే స్వార్థపూరితమైన కర్మకు కూడా చిత్తశుద్ధిని కలగజేసే సామర్థ్యం ఉంటుంది. కర్మను స్వార్థపూరితంగా చేసుకుంటూపోతే చిత్తశుద్ధి కలగదు; ఫలాన్ని ఈశ్వరుని ప్రసాదంగా స్వీకరిస్తే వస్తుంది. ఉదాహరణకు మీరు ఎంతో ఆశపడి ఒక స్వంత ఇల్లు కొనుక్కున్నారు. అది పూర్తిగా కామ్యకర్మ. అందులో సందేహం లేదు. అందులో తప్పేమీ లేదు. కాని ఆ ఇంటి గృహప్రవేశం చేసినప్పుడు, ఆ ఇల్లు భగవంతుని ఇల్లుగా భావించండి. గృహప్రవేశం చేసేటప్పుడు దేవుని పటంతో లోపలకు

అడుగు పెట్టటంలో ఉద్దేశం అదే. భగవంతుని పటంతో అడుగుపెట్టి, పూజాగదిలో పెడతారు. అప్పుడు మనస్ఫూర్తిగా 'ఓ భగవంతుడా, ఈ ఇల్లు నీదే, నన్ను కూడా నీతోపాటు ఉండనివ్వు,' అని ప్రార్థించాలి. అప్పుడు ఇల్లు ఒక ఆలయంలా మారుతుంది; మీరు ఆలయంలో నివసిస్తున్నట్టు అవుతుంది.

ఇలా ఈశ్వరప్రసాదబుద్ధితో చేస్తే ఎన్నో లాభాలు ఉన్నాయి. ఒకపక్క మీ కోరిక తీరింది, మీరు కోరుకున్న ఇంట్లో మీరు ఉన్నారు. ఇంకొకపక్క దాన్ని ఈశ్వరుని ప్రసాదంగా స్వీకరించటంవల్ల మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. అంతేకాదు, ఇల్లు కొన్నప్పటినుంచీ అది వాస్తుశాస్త్రం ప్రకారం లేదని ఎవరైనా హడలగొట్టవచ్చు. చిన్నచిన్న మార్పులు అవసరమైతే చెయ్యగలరు కాని, పెద్ద మార్పులు చెయ్యటానికి వీలుపడకపోవచ్చు. ఇంటిని ఎప్పుడైతే మీరు భగవంతుని నిలయమైన ఆలయంగా భావిస్తారో, అప్పుడే మీ యోగక్షేమాలను ఆయన భుజస్కందాలమీద వేసుకుంటాడు. వాస్తుదోషాలు లేకుండా, వేరే సమస్యలు లేకుండా చూసుకుంటాడు. ఇటువంటి జీవనవిధానాన్ని సకామకర్మ ప్రధాన కర్మయోగం అంటారు.

**సర్వకర్మఫలత్యాగమ్** – ఏ కర్మ చేసినా కూడా ఆ కర్మఫలాన్ని నాకే అర్పించు అంటున్నాడు కృష్ణపరమాత్మ. సకామకర్మలు చేసే వ్యక్తికి సంఘసేవ చేసే తీరిక ఉండదు; ఎంతసేపూ భగవంతుని ముందు కోరికల పొట్లం విప్పటంతోనే సరిపోతుంది. అయినా ఫర్వాలేదు. ఆ సకామకర్మలు చేసినా ఫర్వాలేదు, అంతేకాదు గృహస్థులకు కొన్ని నిషిద్ధకర్మలు కూడా చెయ్యాల్సి ఉంటుంది. బొద్దింకలను, దోమలను చంపటానికి ఏవో వాడతారు. వంట చేసేటప్పుడు కొన్ని క్రిములు నాశనమవుతాయి. ఆ చర్యలు హింస కాదా అంటే వాటిని తప్పనిసరి పాపాలు అంటారు. అందువల్ల ఏం చేసినా భగవంతునికి అర్పించాలి. అప్పుడు ఈ కర్మలు చిత్తశుద్ధిని కలుగజేస్తాయి.

**తతః కురు యతాత్మవాన్** – ఆ కర్మలను శ్రద్ధపెట్టి చెయ్యాలి. దీన్ని సకామకర్మ ప్రధాన కర్మయోగం అంటారని చూశాము.

ముందే చూసినట్టుగా ఈ శ్లోకంలో అన్నిటికన్నా తక్కువస్థాయి భక్తిని గురించి మాట్లాడుతున్నాడు కృష్ణపరమాత్మ. ఎవరైనా 'నేను అది కూడా చెయ్యలేను అంటే వచ్చే జన్మలో ప్రయత్నించు,' అంటాము. ఎందుకంటే శాస్త్రం చెప్పగలిగిన అత్యంత మొట్టమొదటి దశ అది. దీనికన్నా కింద దశ లేదు.

ఈ సకామకర్మ భక్తియోగంలో మొదటి సాధన. ఈ దశలో ఆధ్యాత్మిక చింతనకు రాకుండా, లౌకిక సుఖాలను కోరుకుంటాడు సాధకుడు. ఆధ్యాత్మికతను లౌకిక విజయాలకు వాడుకో ఫర్వాలేదు, కాని రెండు ముఖ్య అంశాలను పాటించు అంటాడని చూశాము. ఒకటి ఎటువంటి విజయం కోరినా కూడా అది ధర్మపరంగా ఉండాలి. అనైతికంగా ఉండకూడదు.

రెండవ నియమం లౌకిక విజయం కోరి కర్మ చేసినా, ఆ ఫలం వచ్చినప్పుడు, దాన్ని మీ విజయంగా పొంగిపోకుండా, ఆ ఫలాన్ని అనుభవించేముందు ఒక్క నిముషం కన్నులు మూసుకుని, అటువంటి విజయాన్ని కలుగజేసినందుకు భగవంతునికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అంటే వచ్చిన ఫలాన్ని కేవలం కర్మఫలంగా

స్వీకరించకుండా, ఈశ్వరప్రసాదంగా స్వీకరించాలి. దానివల్ల ఈశ్వరసంబంధం ఏర్పడుతుంది. తద్వారా చిత్తశుద్ధి కలుగుతుంది.

ఈ సకామకర్మను కొన్నాళ్ళు పాటిస్తే, క్రమేపీ మనస్సు అంతకంతకూ పరిపక్వం చెందుతుంది. అది ఎలా తెలుస్తుంది? కోరికలలో మార్పువల్ల తెలుస్తుంది. ముందు అది స్థూలమైన కోరికగా ఉంటుంది, రానురానూ ఆ కోరిక సూక్ష్మంగా మారుతుంది. పూజ్యస్వామీజీ దాన్ని అద్భుతంగా వర్ణిస్తారు. చిన్నప్పుడు మీరు బెలూన్లకోసం ఆరాటపడ్డారు. బెలూన్ పేలిపోతే బాధపడ్డారు. ఆ వయస్సులో మీకు అత్యంత ముఖ్యమైన వస్తువు బెలూనే. కాని మీకు తెలియకుండా, మీరు ఎదిగినకొద్దీ బెలూన్‌మీద కోరిక మాయమయింది. అలాగే ఒకప్పుడు బిస్కెట్లు ఇష్టంగా తిన్నారు. ఇప్పుడు వాటిమీద ఏమాత్రం మోజులేదు. అంటే మీకు చిన్నచిన్న విషయాలమీద ఆసక్తి తగ్గుతూ వస్తుంది.

అలా సకామభక్తినుంచి నిష్కామభక్తి స్థాయికి ఎదుగుతారు. దేశసేవ చెయ్యాలనుకుంటారు. అది కూడా కోరికే, కాని అది సాత్త్వికమైన కోరిక. అన్నింటిలోకి అత్యంత సాత్త్వికమైన కోరిక ఆత్మజ్ఞానం పొందాలనే కోరిక. మోక్ష ఇచ్ఛ అత్యంత గొప్ప ఇచ్ఛ. ఈ మార్పు మొదటిస్థాయినుంచి క్రమేపీ వస్తుంది. మొదటిమెట్టు కర్మ 1 – సకామకర్మ ప్రధాన కర్మయోగం అయితే రెండవమెట్టు కర్మ 2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం అని చూశాము. స్వార్థమైన ఆలోచన నిస్వార్థంగా మారుతుంది. మీచుట్టూ ఉన్న పరిసరాలను, చెట్లను, జంతువులను గమనించటం నేర్చుకుంటారు. చిత్తశుద్ధినుంచి చిత్తవైశాల్యత ఏర్పడుతుంది. దానివల్ల పంచమహాయజ్ఞాలు చేస్తారు. మీ మేలు మాత్రమే కోరకుండా, ఇతరుల మేలు కోరతారు.

ఇప్పుడు రెండవస్థాయి అయిన నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం స్థాయినుంచి మూడవమెట్టుకు ఎదుగుతారు. మూడవమెట్టు ఉపాసన యోగం స్థాయి 1 – ఏకరూప ఈశ్వరధ్యానం. దీన్నే ఇష్టదేవతా ఉపాసనరూపభక్తి అని కూడా అంటారు. ఈ స్థాయి భక్తిలో మనస్సు బాగా పరిపక్వత చెందుతుంది. బాహ్యాముఖంగా పరుగులు తీయటం ఆపి, అంతర్ముఖం అవుతుంది. అంతర్ముఖం అయితే ఏకరూప ఈశ్వరధ్యానం చెయ్యగలుగుతారు.

ఏకరూప ఈశ్వరధ్యానం నాలుగవమెట్టుకు తీసుకువెళుతుంది. అది ఉపాసనయోగం స్థాయి 2 – అనేక రూప ఈశ్వరధ్యానం. దాన్నే విశ్వరూప ఈశ్వర ఉపాసన అని కూడా అంటారు. అది చివరిమెట్టు అయిన జ్ఞానయోగం – అక్షర ఉపాసనకు తీసుకువెళుతుంది. దీన్ని నిర్గుణఈశ్వరజ్ఞానం అనీ, అద్వైతజ్ఞానం అనీ అంటారు. భక్తియోగంలో ఇది అత్యున్నతస్థాయి. ఐదుస్థాయిల భక్తియోగంలో ఇది ఐదవమెట్టు. ఈ మెట్టులో సాధన చేస్తే బ్రహ్మజ్ఞాని అవుతారు; స్థితప్రజ్ఞులు అవుతారు; అద్వైతభక్తులు అవుతారు. ఈ ఐదుమెట్ల భక్తియోగాన్ని ముగించబోతున్నాడు కృష్ణపరమాత్మ రాబోయే శ్లోకంలో.

శ్లో. 12 **శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్ ॥**

శ్రేయః, హి, జ్ఞానమ్, అభ్యాసాత్, జ్ఞానాత్, ధ్యానమ్, విశిష్యతే,
ధ్యానాత్, కర్మఫలత్యాగః, త్యాగాత్, శాంతిః, అనంతరమ్ ॥

| | | | | | |
|---|---|---|---|---|---|
| అభ్యాసాత్ | = | తత్త్వము తెలియక చేయు అభ్యాసము కన్నా | కర్మఫల త్యాగః | = | సకలకర్మల ఫలత్యాగము (శ్రేష్ఠము) |
| జ్ఞానమ్ | = | జ్ఞానము (శాస్త్రజ్ఞానము) | హి | = | ఎందుకంటే |
| శ్రేయః | = | శ్రేష్ఠమైనది | త్యాగాత్ | = | త్యాగమువల్ల |
| జ్ఞానాత్ | = | అనుభవరహితశాస్త్రజ్ఞానముకన్నా | అనంతరమ్ | = | వెంటనే |
| ధ్యానమ్ | = | పరమేశ్వరస్వరూపధ్యానము | శాంతిః | = | పరమశాంతి |
| విశిష్యతే | = | శ్రేష్ఠమైనది | (లభ్యతే) | = | లభించును |
| ధ్యానాత్ | = | ధ్యానముకన్నా | | | |

**అభ్యాసాత్ జ్ఞానమ్ హి శ్రేయః (అస్తి) జ్ఞానాత్ ధ్యానమ్ విశిష్యతే,**
**ధ్యానాత్ కర్మ-ఫల-త్యాగః (విశిష్యతే), అనన్తరమ్ త్యాగాత్ శాన్తిః (భవతి) హి ।**

తా: తత్త్వము తెలియక చేయు అభ్యాసముకన్నా జ్ఞానము (శాస్త్రజ్ఞానము) శ్రేష్ఠమైనది. అనుభవరహితశాస్త్ర జ్ఞానముకన్నా పరమేశ్వరస్వరూపధ్యానము శ్రేష్ఠమైనది. ధ్యానముకన్నా సకలకర్మల ఫలత్యాగము శ్రేష్ఠము. ఎందుకంటే త్యాగమువల్ల వెంటనే పరమశాంతి లభించును.

**నాలుగు సాధనలు** – ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నాలుగు రకాల సాధనల గురించి చెప్పబోతున్నాడు. వాటిని కిందనుంచి మొదలుపెట్టి, పైస్థాయిదాకా తీసుకువెళుతున్నాడు. అవి – అభ్యాసం, జ్ఞానం, ధ్యానం, కర్మఫలత్యాగం.

ఎ) **అభ్యాసం** – అభ్యాసం అంటే ధ్యానం. ఈశ్వరధ్యానం లేదా ఉపాసనను అభ్యాసం అంటారు. ఈ ధ్యానంలో ఈశ్వరజ్ఞానం ఉండదు. జ్ఞానం పొందకుండా యాంత్రికంగా చేసే ధ్యానం ఇది. భగవంతుడు ఉన్నాడని ఎక్కడో వినో, చదివో, ఆ భగవంతునిమీద నమ్మకం కొద్దీ ధ్యానం చేస్తారు. అంటే ఇంకోవిధంగా చెప్పాలంటే **జ్ఞానరహిత ధ్యానం**.

బి) **జ్ఞానం** – ఇది కిందనుంచి రెండవస్థాయి సాధన. జ్ఞానం అంటే శాస్త్రాన్ని అధ్యయనం చేసి శ్రవణంద్వారా ఈశ్వరజ్ఞానం పొందటం. అంటే ఈశ్వరుని గురించి నిశ్చయజ్ఞానం ఉంది, కాని వీరు ధ్యానం చెయ్యరు. పొందిన జ్ఞానంమీద ధ్యానం చేస్తే ఆ జ్ఞానం జీర్ణించుకుంటారు. కాని వీరు ధ్యానం చెయ్యరు. మొదటి స్థాయి వారిది జ్ఞానరహిత ధ్యానం అయితే వీరిది దానికి భిన్నం. వీరిది **ధ్యానరహిత జ్ఞానం**.

సి) **ధ్యానం** – ముందు అభ్యాసం అంటే కూడా ధ్యానం అన్నాము. కాని ఆ ధ్యానానికీ, ఈ ధ్యానానికీ భేదం ఉంది. అది జ్ఞానరహిత ధ్యానం అయితే ఇది జ్ఞానసహిత ధ్యానం. ఈ సాధకులు ఈశ్వరుని గురించిన నిశ్చయజ్ఞానం పొందాక, ఆ జ్ఞానంతో ఈశ్వరధ్యానం చేస్తారు. అంటే ఈ స్థాయిలో ధ్యానం, జ్ఞానం రెండూ ఉంటాయి. వీరిది **జ్ఞానసహిత ధ్యానం**.

డి) **కర్మఫలత్యాగం** – కర్మఫలాలను ఈశ్వరునికి అంకితం చెయ్యటం. అంటే సకామకర్మలే చేస్తారు కాని వచ్చిన ఫలాలను ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తారు. వీరిది **ఈశ్వరప్రసాదబుద్ధి**

ఈ నాలుగు సాధనలనూ మళ్ళీ ఒకసారి చూస్తే, అవి కిందనుంచి వరుసగా – అభ్యాసం, జ్ఞానం, ధ్యానం, కర్మఫలత్యాగం.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఈ కర్మఫలత్యాగం పదాన్ని పదకొండవ శ్లోకంలో వాడాడు కృష్ణపరమాత్మ. దేనికి? భక్తియోగంలో ఐదుస్థాయిలను వర్ణిస్తూ, సకామకర్మను అన్నిటికన్నా తక్కువస్థాయిగా వర్ణించాడు. దాన్ని మొదటిమెట్టుగా పెట్టిన కృష్ణపరమాత్మే ఇప్పుడు ఈ శ్లోకంలో ఈ నాలుగు సాధనల్లో సకామకర్మకు పెద్దపీట వేస్తున్నాడు. తనను తనే ఖండించుకుంటున్నాడా? భగవంతుడు తనను తాను ఎన్నడూ ఖండించుకోడు. ఆయన లీలలను మనమే సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఆయనను సరిగ్గా అర్థం చేసుకునేందుకు మనకు కొండంత అండగా శంకరాచార్యులవారు ఉన్నారు. ఆయన ఈ సమస్యను పరిష్కరిస్తారు. భగవంతుని హృదయాన్ని మనమే సరిగ్గా అర్థం చేసుకోవాలి.

ముందు చెప్పిన ఐదుదశలూ సరిగ్గానే ఉన్నాయి. అందులో చెప్పినట్టుగా కర్మఫలత్యాగం (సకామకర్మ) అన్నిటికన్నా తక్కువస్థాయికి చెందినదే. అంటే భక్తియోగంలో అది మొదటిమెట్టు. దానిపైన నాలుగు మెట్లు ఉన్నాయి. దాని తర్వాత జ్ఞానం పొంది, జ్ఞానసహిత ధ్యానం చెయ్యాలి. అదీ సాధన. కర్మఫలత్యాగం అట్టడుగు మెట్టే.

కాని దురదృష్టవశాత్తూ, మనలో చాలమందిమి ఈ అట్టడుగు మెట్టులోనే ఉన్నాము. మనకు ఎన్నో తీరని కోరికలు ఉన్నాయి. పిల్లల చదువులు అవాలి, అమ్మాయిల పెళ్ళిళ్ళు చెయ్యాలి, మనవళ్ళు పుట్టాలి, ఎన్నో బాధ్యతలు తీరాలి. వాటికోసం తిరుపతిలో కళ్యాణం చేయించాలి, గురువాయూర్‌లో ఉయ్యాల కట్టించాలి, అలా కోరికలు అనంతంగా సాగిపోతుంటే నిష్కామకర్మల గురించి ఆలోచించే తీరికెక్కడ ఉంది? అందువల్ల మనలో చాలామందిమి ఈ అట్టడుగు మెట్టుమీదనే ఉన్నాము.

అట్టడుగు మెట్టుమీద ఉన్నారు, వీరితో ఏమీ లాభం లేదని కృష్ణపరమాత్మ కొట్టిపారేస్తే, మనకు ఆత్మన్యూనతా భావన వచ్చే ప్రమాదముంది. అందువల్ల మనను వెన్నుతట్టి ప్రోత్సహించటానికి అట్టడుగు సాధనను తీసుకెళ్ళి అత్యున్నతస్థానంలో కూర్చోపెట్టాడు. పెద్ద పెద్ద విజయాలు పొందాలని అందరికీ ఉంటుంది కాని పెద్ద విజయం సాధించలేకపోతే, చిన్న విజయమే బాగుంది అనేస్తారు. అలాగే ఇక్కడ చిన్న విజయం అయిన కర్మఫలత్యాగాన్ని స్తుతిస్తున్నాడు కృష్ణపరమాత్మ. దీనిని అతిశయోక్తి అంటారు. అతిశయోక్తిని అర్థవాదం అంటారు శాస్త్రంలో.

పన్నెండవ శ్లోకాన్ని అర్థవాదశ్లోకం అంటారు. అర్థవాదం అంటే ఒక సాధనను ఎక్కువచేసి మాట్లాడటం. ఈ శ్లోకంలో కృష్ణపరమాత్మ నాలుగు సాధనల గురించి చెప్పాడు. అవి కిందనుంచి వరుసగా **అభ్యాసం** – జ్ఞానరహిత ధ్యానం; **జ్ఞానం** – ధ్యానరహిత జ్ఞానం; **ధ్యానం** – జ్ఞానసహిత ధ్యానం; **కర్మఫలత్యాగం** – ఈశ్వరప్రసాదబుద్ధి.

**అభ్యాసం** – అన్నిటికన్నా తక్కువస్థాయికి చెందినది అభ్యాసం, యాంత్రిక ఉపాసన. కాని అసలు ఏ సాధన

చెయ్యకపోవటంకన్నా యాంత్రిక ఉపాసన చెయ్యటం మంచిదే. యాంత్రిక ఉపాసన అంటే చిన్నప్పుడు ఎప్పుడో నేర్చుకున్న ఏ గాయత్రీ మంత్రమో పఠించటం లాంటిది. దాని అర్థం తెలియదు కాని తండ్రిమీద భయంకొద్దీ, దేవుడు శిక్షిస్తాడనే పాపచింతనతో చేస్తారు. అది అన్నిటికన్నా తక్కువస్థాయి సాధన.

**అభ్యాసాత్ జ్ఞానం శ్రేయః** – దీనికన్నా మెరుగైనది జ్ఞానం పొందటం. జ్ఞానం అంటే ఈశ్వరజ్ఞానం. ఇక్కడ జ్ఞానం నిర్వచనం ఏమని చూశాము? ధ్యానరహితజ్ఞానం. జ్ఞానరహిత ధ్యానంకన్నా ధ్యానరహితజ్ఞానం గొప్పది. దానికన్నా శ్రేష్ఠమైనది ఏది?

**జ్ఞానాత్ ధ్యానం విశిష్యతే** – జ్ఞానంకన్నా ధ్యానం గొప్పది. ధ్యానం అంటే ఏమిటి? ఇంతకుముందే చూశాము. జ్ఞానసహిత ధ్యానం. భగవంతుని గురించిన జ్ఞానం పొందాక చేసే ధ్యానం గొప్పది. ఇంతవరకూ మన ప్రయాణం సాఫీగా సాగింది. ఇప్పుడు కృష్ణపరమాత్మ అనుకోకుండా ఒక మలుపు తిప్పుతున్నాడు.

**ధ్యానాత్ కర్మఫలత్యాగః** – ధ్యానంకన్నా శ్రేష్ఠమైనది కర్మఫలత్యాగం. నాలుగు సాధనల్లో కర్మఫలత్యాగం అత్యంత గొప్పసాధన.

ఇక్కడే కృష్ణపరమాత్మ తన లీలను ప్రదర్శిస్తున్నాడు. ముందే చూసినట్టుగా ఈ కర్మఫలత్యాగాన్ని భక్తియోగ సాధనల్లో అట్టడుగు మెట్టుమీద పెట్టిన కృష్ణపరమాత్మే ఇప్పుడు అదే మొదటిమెట్టు అంటున్నాడు. అందువల్ల ఇది సత్యం కాదు. ఇది మనను ఇంకా పైకి ఎదగటానికి ప్రోత్సహించటానికి వాడిన అర్థవాదం అని గుర్తుంచుకోవాలి. సకామకర్మ ప్రధాన కర్మయోగం అంటారు దీన్ని. ఇది ధ్యానంకన్నా గొప్పది.

**త్యాగాత్** – కర్మఫలత్యాగం అంటే కర్మఫలాన్ని అనుభవించే ముందు దాన్ని భగవంతునికి అంకితం చేసి, ఈశ్వరప్రసాదంగా స్వీకరించటం అని చూశాము. ఈ ప్రసాదబుద్ధి మన సంప్రదాయంలో అంతర్లీనంగా ఉంది. మనకు శాస్త్రం ఏం చెబుతుందో తెలియకపోయినా, కొత్త దుస్తులు కొనుక్కున్నా కూడా వాటిని భగవంతుని ముందు పెట్టి, వాటికి పసుపో, కుంకుమో పెట్టి అప్పుడు ధరిస్తాము. అలాగే ఏ పిండివంట చేసినా భగవంతునికి అర్పించి, అప్పుడు స్వీకరిస్తాము. దాన్ని నివేదన చెయ్యటం అంటారు.

నివేదన అంటే 'ఓ దేవా, నేను ఏది అనుభవిస్తున్నా అది నీ కృపవల్లనే. నేను ఈ ఫలం పొందటానికి శ్రమపడ్డాను కాని ఈ శ్రమపడే సామర్థ్యం కూడా నీ కృపవల్లనే ఏర్పడింది. అందువల్ల నీకు సదా కృతజ్ఞుడిని,' అని విన్నవించుకోవటం. ఇటువంటి భావనతో ఫలాన్ని స్వీకరించటాన్ని కర్మఫలత్యాగం అంటారు. అలా స్వీకరిస్తే వచ్చే గొప్పఫలం – గొప్పశాంతి. దాన్ని ప్రసాదం అంటారు. ఎటువంటి మానసిక అలజడి ఉండదు. మామూలుగా ప్రసాదం అనగానే మనకు గుర్తుకొచ్చేది వడ, లడ్డు, పొంగలిలాంటి తినే ప్రసాదం. ప్రసాదం అంటే అసలు అర్థం ప్రశాంతచిత్తం, శాంతి. జీవితంలో కలిగే ప్రతి ఒక్క అనుభవాన్నీ ప్రసాదంగా స్వీకరించాలి. పెళ్ళయి జీవితభాగస్వామి రావటం, పిల్లలు పుట్టటం, అన్నీ ప్రసాదం అనుకుంటే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఎటువంటి ఆందోళనా ఉండదు. త్యాగః అంటే ఏది వచ్చినా స్వీకరించటం.

**ఆగతే స్వాగతం కుర్యాత్**

**(త్యాగాత్) శాంతిః అనంతరమ్** – త్యాగంవల్ల శాంతి కలుగుతుంది.

**సమత్వం యోగ ఉచ్యతే**

అనంతరం అంటే వెంటనే. వెంటనే శాంతి కలుగుతుంది. దీనితో భక్తియోగసాధన ముగిసింది. దీనితో ఈ అధ్యాయంయొక్క మొదటి అంశం ముగిసింది.

2. **భక్తియోగ ఫలము: శ్లోకాలు 13-19 – ఉపోద్ఘాతం**

భక్తియోగాన్ని ఐదుదశలుగా చూశాము. అవి కర్మయోగంలో రెండుస్థాయిలు, ఉపాసనయోగంలో రెండుస్థాయిలు, చివరికి జ్ఞానయోగం. జ్ఞానయోగంలో సాధకుడు వేదాంతశాస్త్రంయొక్క శ్రవణ, మనన, నిదిధ్యాసనలు చేస్తాడు. జ్ఞానయోగం భక్తియోగంలో అత్యున్నతస్థాయి.

ఒక సాధకుడు ఈ ఐదుదశల భక్తీ దాటి వచ్చాడనుకుందాము. ఈ దశలు దాటటానికి ఎంత సమయం పడుతుంది? అది అందరికీ ఒక్కలాగా ఉండదు. కొంతమంది ఈ జన్మలోనే దాటవచ్చు, కొంతమంది కొన్ని జన్మలుగా సాధన చేస్తూ వచ్చి ఉండవచ్చు. అలా ఒక వ్యక్తి ఈ సాధనలన్నీ చేశాడనుకుందాము. అప్పుడతన్ని జ్ఞాని అంటారు. అతను పరాభక్తుడు అవుతాడు. ఈ పరాభక్తునికి జ్ఞానం ఉండితీరాలి. ఎందుకంటే భక్తిలో ఐదవదశను జ్ఞానయోగం అని చూశాము.

ముందు భగవంతుణ్ణి ఏకరూప ఈశ్వరునిగా కొలిచి, విశ్వరూప ఈశ్వరధ్యానం చేసి, భగవంతుడు నిర్గుణబ్రహ్మ అనే జ్ఞానం పొందుతాడు చివరికి. నామరూపాలున్న ఈ మిథ్యాజగత్తు వెనక ఉన్న చైతన్యసత్యం బ్రహ్మ అని తెలుసుకుంటాడు. ఇంకా గొప్పవిశేషం – ఎప్పుడైతే బ్రహ్మ నిర్గుణబ్రహ్మ అని తెలుసుకుంటాడో, ఆ బ్రహ్మ ఎవరో కాదు, తనే అని అర్థం చేసుకుంటాడు. అహం బ్రహ్మ అస్మి లేదా సః అహం అస్మి అని నేర్చుకుంటాడు.

నిజానికి చిన్నవయస్సునుంచే సంధ్యావందన మంత్రాల్లో అసావాదిత్యో బ్రహ్మ అని నేర్చుకుంటాడు; కాకపోతే అప్పుడు అర్థం తెలియక యాంత్రికంగా చేస్తాడు. జ్ఞానయోగానికి వచ్చాక, జీవాత్మ పరమాత్మల ఐక్యం గురించి నేర్చుకుంటాడు. దీన్ని అద్వైతజ్ఞానం అంటారని చూశాము. అల, సముద్రం రెండు భిన్నవస్తువులు కావు; అవి ఒకటే నీరుకు ఉన్న రెండు భిన్ననామరూపాలు. నిజానికి అల అనే వస్తువు లేదు, సముద్రం అనే వస్తువు లేదు; ఉన్నది ఒకటే నీరు. అలాగే జీవాత్మ పరమాత్మలు నామద్వయం; నామి ఒకటే.

ఇటువంటి జ్ఞానం పొందిన వ్యక్తిని జ్ఞాని అంటారనీ, స్థితప్రజ్ఞుడు అంటారనీ రెండవ అధ్యాయంలో చూశాము. అంతేగాక అతని లక్షణాలను కూడా చూశాము.

ఇప్పుడు 13-19 శ్లోకాల వరకూ, కృష్ణపరమాత్మ అలాంటి జ్ఞాని ప్రవర్తన ఎలా ఉంటుందో చెప్పబోతున్నాడు. అతను జీవితంలోని ఒడిదుడుకులను ఎలా ఎదుర్కొంటాడు? ఒక్కముక్కలో చెప్పాలంటే పరాభక్తలక్షణాలు. అంటే జ్ఞాని లక్షణాలను వివరించబోతున్నాడు – అలా చెప్పటం ఎందుకు?

జ్ఞాని లక్షణాలను వింటే కొన్ని ప్రయోజనాలు కలుగుతాయి. అవి–

ఎ) ఈ సాధనయొక్క ప్రయోజనం తెలిస్తే, ఈ సాధన చెయ్యాలనే ఉత్సాహం కలుగుతుంది. ప్రకటనలు ఒక వస్తువును పదేపదే చూపించటం వెనకనున్న ఉద్దేశం అదే. ఒక వస్తువుపైన తాటికాయంత అక్షరాలతో దీన్ని వెయ్యి రూపాయలకే మీ స్వంతం చేసుకోండి అని రాస్తారు. దాని కింద చాలా చిన్న అక్షరాలతో 20 సంవత్సరాల పాటు, నెలసరి వాయిదా 500 రూపాయలు చెల్లించండి అని ఉంటుంది.

కాని శాస్త్రం చెప్పే ప్రయోజనాలు వట్టి మాటలు కాదు.

బి) జ్ఞానికి సహజంగా అబ్బిన లక్షణాలను మనం సాధన చెయ్యాలి.

**యాని జ్ఞానినః లక్షణాని, తాని అజ్ఞానినః సాధనాని భవంతి**

జ్ఞానికి సహజంగా అబ్బిన లక్షణాలను మనం ప్రయత్నపూర్వకంగా చేస్తే, త్వరలో మనకు కూడా ఆ లక్షణాలు అబ్బుతాయి. దీన్నే పూజ్యస్వామీజీ, **'ఫేకిట్ అండ్ మేకిట్,'** అంటారు.

సి) జ్ఞానం పొందితే, ఇక్కడే ఇప్పుడే మోక్షం పొందుతావు అంటుంది శాస్త్రం. అంటే మోక్షం ఎప్పుడో మరణం తర్వాత వచ్చే ఫలం కాదు. ఒకవేళ నువ్వు జ్ఞానం పొందితే మోక్షం పొందుతావు. మోక్షం అంటే వైకుంఠానికో, కైలాసానికో వెళతావు అంటే మనం భయపడిపోతాము. నాకు జ్ఞానమూ వద్దు, మోక్షమూ వద్దు, నేను ఇంకా కొన్ని కాలాలపాటు జీవించాలి; నేను నెరవేర్చాల్సిన బాధ్యతలు ఎన్నో ఉన్నాయి; నేను మరణించే ముందు వస్తాను, అప్పుడు నేర్పిద్దువు గాని ఈ జ్ఞానాన్ని అంటాము.

అందువల్ల కృష్ణపరమాత్మ ప్రత్యేకించి చెబుతున్నాడు – మోక్షం అంటే నీ మనస్సులో పొందే ఆనందం; దాన్ని ఇప్పుడే, ఇక్కడే పొందుతావు.

డి) మోక్షాన్ని జీవన్ముక్తి అంటారు. బ్రతికి ఉండగానే మోక్షాన్ని అనుభవిస్తాము. మరణించాక వచ్చే ఫలం కాదు. అందువల్ల పరాభక్తి లక్షణాలు అనే బదులు జీవన్ముక్త లక్షణాలు అని అనవచ్చు రాబోయే మంత్రాల్లోని వర్ణనను. ఇది తెలుసుకోవటంవల్ల కలిగే ఇంకొక ప్రయోజనం – మనం జ్ఞాని కిందకు వస్తామో, రామో మనను మనమే పరీక్షించుకోవచ్చు. మనకు అప్పుడప్పుడు శంక కలుగుతుంది. ఏమిటది? ఇన్ని సంవత్సరాలుగా శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నాను, నాకు మోక్షం వస్తుందా రాదా అనుకుంటాము. మనకు విద్య నేర్పిన గురువు ఫలానా అతను జీవన్ముక్తుడు, అతణ్ణి గౌరవించి, పాదపూజ చెయ్యండని ప్రశంసాపత్రం ఇస్తాడా? ఏమీ అవసరం లేదు. ఈ లక్షణాలు ఉన్నాయో లేదో ఆత్మపరీక్ష చేసుకుంటే చాలు.

ఇప్పుడు 13–19 శ్లోకాల్లో జ్ఞాననిష్ఠలో ఉన్న భక్తుని స్వభావాన్ని చూడబోతున్నాము. ఈ జ్ఞానీభక్తుని గురించి కృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయంలోనే చెప్పాడు.

**చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోఽర్జున ।**

**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥** – 7.16

**తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**

**ప్రియో హి జ్ఞానినోఽత్యర్థమ్ అహం స చ మమ ప్రియః ॥** – 7.17

ఈ రెండు శ్లోకాలనే ఇప్పుడు రాబోయే మంత్రాలలో వివరించబోతున్నాడు. జ్ఞానీభక్తుడు అందరిలోకీ చాలా గొప్పభక్తుడు. చిన్మయానందస్వామి అద్భుతంగా వివరిస్తారు – ప్రేమగాని, భక్తిగాని ఎక్కువయితే వారి మధ్యనున్న దూరం తగ్గుతుంది. మనం ఎవరినైనా ఎక్కువగా ప్రేమిస్తే ఏమంటాము? అతను నాకు చాలా దగ్గర వ్యక్తి అంటాము, లేదా నాకు ఆత్మీయుడు అంటాము. అంటే ప్రేమ ఎంత ఎక్కువ ఉంటే, దూరం అంత తగ్గుతుంది.

ఈ సూత్రాన్ని అన్వయిస్తే అత్యంత ఎక్కువ ప్రేమ ఉన్నచోట దూరం బొత్తిగా ఉండకూడదు. అంటే అసలు దూరం లేదు. అంటే జీవాత్మ, పరమాత్మల మధ్య దూరం బొత్తిగా లేదు. అందువల్ల అద్వైతంలో భగవంతునిమీద భక్తి అనంతం. ఆ భావనను కృష్ణపరమాత్మే స్వయంగా చెప్పాడు. నాకు జ్ఞాని దగ్గర కాదు; జ్ఞానే నేను, నేనే జ్ఞానిని.

ఇటువంటి వ్యక్తి ఎలా ప్రవర్తిస్తాడు? అతను ఎంత గొప్ప జ్ఞాని అయినా కూడా, అతనికున్న ప్రారబ్ధకర్మను అనుభవించక తప్పదు. అతను జ్ఞానానికి రాకముందు కొన్ని పుణ్యపాపాలు చేసి ఉండవచ్చు. వాటియొక్క ఫలితాలను అతను జ్ఞానం పొందాక కూడా అనుభవించక తప్పదు. వాటికి ఎలా స్పందిస్తాడు?

శ్లోకాల్లోకి వెళ్ళేముందు చిన్నమాట. ఈ జ్ఞాని లక్షణాలను మీకు మీరు పరీక్షించుకోవటానికి వాడవచ్చని చూశాము. కాని ఒక విషయం గుర్తుంచుకోండి. ఈ పరీక్షను ఎదుటివ్యక్తి జ్ఞానా కాదా అని పరీక్షించటానికి ఉపయోగించకండి. ఎదుటివారిని పరీక్షించటానికి మీకు హక్కు లేదు. అంతేకాదు, మిమ్మల్ని మీరు పరీక్షించు కునేటప్పుడు కూడా ఆ పరీక్షను జాగ్రత్తగా చెయ్యాలి. ఎందుకంటే ఆత్మపరీక్ష సానుకూల ఫలితాలను ఇవ్వవచ్చు; ప్రతికూల ఫలితాలను కూడా ఇవ్వవచ్చు. ఈ పరీక్షను తెలివిగా చెయ్యకపోతే ఆత్మపరీక్ష మీలో నిరాశానిస్పృహలను, ఆత్మన్యూనతా భావనను తీసుకురావచ్చు. ముఖ్యంగా ఎదుటివారితో పోలిస్తే మీరు కృంగిపోవచ్చు. అలాంటి భావన ఒకవేళ కలిగితే, ఈ పరీక్షను ఆపేయండి.

ఇలా ఆత్మపరీక్ష చేసుకోవాల్సిన కారణం, మిమ్మల్ని మీరు ఉత్తేజపరుచుకోవటానికి. ఎదుటివారితో పోల్చుకోకండి. మీరు ఏ స్థాయిలో ఉన్నారో బేరీజు వేసుకుని, ఆ స్థాయిని దాటి పైకి ఎదగండి. ఇప్పుడు ఈ నేపథ్యంతో ఈ భాగాన్ని చూద్దాము.

శ్లో. 13 **అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవ చ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥**

శ్లో. 14 **సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।**
**మయ్యర్పితమనోబుద్ధిః యో మద్భక్తస్స మే ప్రియః ॥**

అద్వేష్టా, సర్వభూతానామ్, మైత్రః, కరుణః, ఏవ, చ,
నిర్మమః, నిరహంకారః, సమదుఃఖసుఖః, క్షమీ ॥
సంతుష్టః, సతతమ్, యోగీ, యతాత్మా, దృఢనిశ్చయః,
మయి, అర్పితమనోబుద్ధిః, యః, మద్భక్తః, సః, మే, ప్రియః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | సతతమ్ | = సర్వదా సంతుష్టుడై |
| సర్వభూతానామ్ | = సకల ప్రాణులయందును | సంతుష్టః | యుండువాడో |
| అద్వేష్టా | = ద్వేషభావమును కలిగియుండడో | యతాత్మా | = శరీరేంద్రియ మనస్సులను వశపఱచుకొన్నవాడో |
| మైత్రః, చ | = స్వార్థరహితమైన ప్రేమను కలిగియుండునో | దృఢనిశ్చయః | = నాయందే నిశ్చయబుద్ధి గలవాడో |
| కరుణః | = హేతురహితదయాళువో | మయి | = నాయందే |
| ఏవ | = అలాగే | అర్పితమనో బుద్ధిః | = మనోబుద్ధులను అర్పించినవాడో |
| నిర్మమః | = మమతారహితుడో | సః | = అటువంటి |
| నిరహంకారః | = అహంకారము లేనివాడో | మద్భక్తః | = నా భక్తుడు |
| సమదుఃఖసుఖః | = సుఖదుఃఖముల ప్రాప్తి యందు సమభావము కలిగియున్నవాడో | మే, ప్రియః | = నాకు ఇష్టుడు |
| క్షమీ | = క్షమాగుణము గలవాడో | | |
| యోగీ | = యోగియై | | |

**యః సర్వ–భూతానాం అద్వేష్టా, మైత్రః, కరుణః చ ఏవ, నిర్మమః,**
**నిరహఙ్కారః, సమ–దుఃఖ–సుఖః క్షమీ, సతతమ్ సన్తుష్టః ।**

**యోగీ, యత–ఆత్మా, దృఢ–నిశ్చయః, మయి అర్పిత–మనః–బుద్ధిః,**
**సః మత్–భక్తః మే ప్రియః (అస్తి) ।**

తా: ఏ పురుషుడు సకల ప్రాణులయందును ద్వేషభావమును కలిగియుండడో స్వార్థరహితమైన ప్రేమను కలిగియుండునో, హేతురహితదయాళువో అలాగే మమతారహితుడో, అహంకారము లేనివాడో, సుఖదుఃఖముల ప్రాప్తియందు సమభావము కలిగియున్నవాడో, క్షమాగుణము గలవాడో, యోగియై సర్వదా సంతుష్టుడై యుండువాడో, శరీరేంద్రియ మనస్సులను వశపఱచుకొన్నవాడో, నాయందే నిశ్చయబుద్ధి గలవాడో, నాయందే మనోబుద్ధులను అర్పించినవాడో అటువంటి నా భక్తుడు నాకు ఇష్టుడు.

ఈ శ్లోకాల్లో జ్ఞానీ లక్షణాలను తెలుసుకుంటామని చూశాము.

ఎ) **ద్వేషభావం ఉండదు – అద్వేష్టా సర్వభూతానామ్** – జ్ఞానికి ద్వేషభావన ఉండదు. ఎవరినీ ద్వేషించడు.

మనం మోక్షానికి ఎంత దగ్గరగా ఉన్నామో పరీక్షించుకోవాలనుకుంటే, ఒక కాగితం తీసుకుని జ్ఞాని లక్షణాలను రాసుకోవాలి. ఆ లక్షణాలు మనకు ఎంత తక్కువగా ఉంటే, మనం మోక్షానికి అంత దూరంగా ఉన్నామని అర్థమవుతుంది. ఆ లక్షణాలు ఎక్కువ ఉంటే, మోక్షాన్ని దగ్గరగా ఉన్నట్టు అర్థం.

శాస్త్రం ఎవరినీ ద్వేషించకూడదని చెపితే, మనం ముందుగా చేసేపని, మన ద్వేషాన్ని సమర్థించుకుంటాము. మనం ద్వేషించే వ్యక్తి ఏయే అక్రమాలు చేస్తున్నాడో, అతనిలో ఉన్న చెడు లక్షణాలు ఏమిటో గుర్తు తెచ్చుకుని అందువల్ల నేను ద్వేషిస్తున్నాను అని సమర్థించుకుంటాము. అంతేకాదు, ఎవరికైనా చెప్పి, వారు కూడా మనలను సమర్థించాలని ఆశిస్తాము.

కాని శాస్త్రం ప్రకారం మంచి ద్వేషం, చెడు ద్వేషం అని లేదు. ద్వేషించటమే తప్పు. అది ఎటువంటి ద్వేషమైనా సరే. ఎందుకు? ఎందుకంటే శాస్త్రం ప్రకారం ప్రతి ఒక్కవ్యక్తి కూడా పరమాత్మస్వరూపం. జీవాత్మ నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావం ఉన్న శుద్ధపరమాత్మ. ఆ పరమాత్మను నేనే అని నేర్చుకుంటారు. అలాంటప్పుడు అతన్ని విడిగా ఎలా భావించగలరు? ఎలా ద్వేషించగలరు అంటుంది శాస్త్రం.

సరే ప్రతి ఒక్కవ్యక్తీ పరమాత్మస్వరూపమేనని ఒప్పుకుంటాము కాని అతను చేసే చర్యలు దారుణంగా ఉన్నాయి. అవి అతని స్వరూపం కాదు కదా; అలాంటప్పుడు అతను చేసే పనులు చెడుపనులు అయి ఉండవచ్చు. వ్యక్తిని ద్వేషించకూడదన్నారు బాగానే ఉంది, అతని చెడు పనులను ద్వేషించవచ్చా?

అతను చేసే చెడు పనులను కూడా ద్వేషించకూడదు అంటుంది శాస్త్రం. ఎందుకు? ఆ వ్యక్తిని ద్వేషించటంవల్ల మీరు అతనిలో మార్పును తీసుకురాలేరు. ఒకవేళ ద్వేషించటంవల్ల మార్పు తీసుకురాగలిగితే, రేడియమ్ ట్రీట్మెంట్ ఇచ్చినట్టుగా, దీనికి కూడా 5, 6 సార్లు నేను నిన్ను ద్వేషిస్తున్నానని అరగంటకొకసారి చెబుతూ రావచ్చు. కాని అది సాధ్యం కాదు. ద్వేషించినంత మాత్రాన ఎవరూ మారరు. అందువల్ల ఒకవ్యక్తినీ ద్వేషించ కూడదు; అతని చర్యలనూ ద్వేషించకూడదు. ఒక వ్యక్తిని ద్వేషించకూడదు, ఎందుకంటే అతను భగవత్ స్వరూపం; అతని చర్యలను ద్వేషించకూడదు, ఎందుకంటే అతను మారడు. అందువల్ల ద్వేషం ఏ విధంగానూ లాభంలేదు.

ఎవరినైనా ద్వేషించటంవల్ల అతనిలో మార్పు రాకపోగా, అది మీ మనస్సుమీద పెద్ద దెబ్బ తీస్తుంది. మీరు ద్వేషించే వ్యక్తి బాగానే ఉంటాడు కాని అతన్ని మీరు ద్వేషిస్తూపోతే, మీ మనస్సును బాగా కృంగదీస్తుంది. అసలే అతని దుర్మార్గం మిమ్మల్ని బాధపెట్టింది; అగ్నికి ఆజ్యం తోడయినట్టుగా దానికి మీరు ద్వేషాన్ని జత చేస్తే, మీ పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. అందువల్ల ఎవరినీ ద్వేషించవద్దు అంటుంది శాస్త్రం.

సరే, ఎవరినీ ద్వేషించకూడదు, అతని చర్యలను ద్వేషించకూడదు, అలా చేస్తే నా మనస్సే కృంగిపోతుంది అంటే అటువంటి వ్యక్తిమీద నా స్పందన ఎలా ఉండాలి? ఇది నా సందేహం. ఖచ్చితంగా ద్వేషం మాత్రం

ఉండకూడదు. శాస్త్రం సామదానభేధదండోపాయాల్లో ఏదైనా పద్ధతిని వాడండి అంటుంది. ముందు సామదానభేధాలు ఉపయోగించి, వాటివల్ల ఆశించిన ఫలితం రాకపోతే దండన పాటించండి. తప్పులేదు. కాని దాన్ని ద్వేషభావనతో పాటించకూడదు, ప్రేమగా శిక్షించాలి. అతనికి విధించే దండన అతన్ని శిక్షించటానికి వినియోగించకూడదు. ప్రేమతో అతన్ని మార్చటానికి వినియోగించాలి అంటుంది.

ప్రేమించే వ్యక్తిని ఎలా దండించగలము? ద్వేషం, దండనలకు పొత్తు కుదురుతాయి కాని, ప్రేమ ఉన్న చోట దండన ఎలా ఉపయోగిస్తాము? శాస్త్రం అది సాధ్యమే అంటుంది. దానికి గొప్ప ఉదాహరణ మన కళ్ళముందు కనపడే కన్నతల్లే. ఆవిడ పిల్లలను ఎంతో గొప్పగా ప్రేమిస్తుంది, కాని అవసరమైతే పిల్లవాడు తప్పుదారి పడుతుంటే అతన్ని దండించటానికి కూడా వెనుకాడదు. అందువల్ల ద్వేషానికి చోటులేదు; ఏ శిక్ష విధించినా కూడా ప్రేమతో విధించాలి. ఎవరినీ ద్వేషించకూడదు. ఇది మొదటి లక్షణం.

సరే నేను ఎవరినీ ద్వేషించను కాని ఒకరిద్దరిని మాత్రం ద్వేషించకుండా ఉండలేను. అది కుదురుతుందా? కుదరదు అంటుంది శాస్త్రం. మనకు ద్వేషించటం సరదా అవవచ్చేమో కాని, శాస్త్రం అలాంటి సరదాలకు చోటు లేదంటుంది. మీకు నచ్చని పనులు చేసిన వ్యక్తిని విమర్శించవచ్చు, కాని దాన్ని కూడా ప్రేమతో చెయ్యాలి అని అంటున్నదని చూశాము. ఆ వ్యక్తినుంచి దూరంగా శారీరకంగా వెళ్ళినా కూడా, మానసికంగా మాత్రం ద్వేషించకూడదు. మీరు చెయ్యగలిగింది అతని గురించి ప్రార్థన చెయ్యటమే 'ఓ దేవా, అతనికి మంచి బుద్ధిని ప్రసాదించు.'

బి) **మిత్రభావన – మైత్రః** – అందరికీ స్నేహితునిగా ఉంటాడు. జ్ఞానికి కొందరు మాత్రమే దగ్గర స్నేహితులు ఉండరు.

> **భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
> **సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥** – 5.29

సర్వభూతానాం సుహృదం. అందరితోనూ స్నేహంగా ఉంటాడు. స్నేహితుడు అంటే ఎవరు? భర్తృహరి తన నీతిశతకంలో స్నేహితుని లక్షణాలను వివరిస్తాడు.

> **పాపాన్నివారయతి యోజయతే హితాయ గుహ్యం నిగూహతి గుణాన్ ప్రకటీకరోతి**
> **ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే సన్మిత్ర లక్షణమిదం ప్రవదన్తి సన్తః** – నీతిశతకం 23

స్నేహితుడు చేసే పనులేమిటి?

**పాపాత్ నివారయతి** – పాపాలు చెయ్యబోతుంటే వాటినుంచి నివారిస్తాడు. మంచి స్నేహితునికి మీకు కూడా తెలియని మీ బలహీనతలు తెలుస్తాయి. అంతటా కాంతిని వెదజల్లే దీపం కిందట చీకటి ఉంటుంది. అన్ని రంగులు, రూపాలు చూసే కన్ను మీ కంటి రంగును చూడలేదు. అలా అందరి గురించీ తెలుసుకునే మీకు మీ బలహీనత తెలియకపోవచ్చు. మంచిమిత్రుడు మీ బలహీనతలను తెలుసుకుని, మీరు పాపాలు చెయ్యకుండా కాపాడుతాడు.

**యోజయతే హితాయ** – మిమ్మల్ని మంచి మార్గంలో పెడతాడు.

**గుహ్యం నిగూహతి** – మీరు మీ మనస్సులో ఉన్న రహస్యాలను మంచిమిత్రునితో పంచుకుంటారు. ఎందుకు? అతను ఎవరికీ చెప్పడన్న నమ్మకంతో. స్విస్‌బ్యాంకులో డబ్బులు వేసుకుంటే, వారు ఎవరికీ మీకు అక్కడ అకౌంటు ఉందని చెప్పరు. మంచి స్నేహితుడు మానసిక స్విస్‌బ్యాంకులాంటి వ్యక్తి. అతని భుజంమీద తలవాల్చి, భోరున విలపించటానికి ఒక ఆసరా. అంతేకాదు, మీ విషయాలు గుప్తంగా ఉంచుతాడు.

**గుణాన్ ప్రకటీకరోతి** – మీలో ఉన్న మంచి లక్షణాలను పదిమందికీ చెబుతాడు. మనం సాధారణంగా దానికి భిన్నంగా చేస్తాము. మంచి గుణాలు చెప్పము, అతని చెడులక్షణాలు, అతని రహస్యాలు అందరికీ చాటి చెబుతాము.

**ఆపద్గతం చ న జహాతి దదాతి కాలే** – అంతవరకూ మీ చుట్టూ ఉన్న కొందరు స్నేహితులు, మీకు ఏదైనా ఆపద ముంచుకువస్తే ఆమడదూరం పారిపోతారు. కాని నిజమైన మిత్రుడు ఆపదలో ఆదుకుంటాడు.

**వయసి గతే కః కామవికారః శుష్కే నీరే కః కాసారః**
**క్షీణే విత్తే కః పరివారః జ్ఞాతే తత్త్వే కః సంసారః** – భజగోవిందం

మీ చేతిలో డబ్బు లేదనేసరికి మీవారు అనుకున్నవారు కూడా మాయమైపోతారు. ఆపద సమయంలో పారిపోని స్నేహితుడే నిజమైన స్నేహితుడు. డబ్బే కాదు, ఒక మంచిమాట చెప్పే నోరు, ఒక ధైర్యం ఇచ్చే అమృతహస్తం, మీకు సమయం వెచ్చించే ఆప్యాయత, మీకు అండగా నిలిచే హృదయం ఉంటుంది అతనికి.

**సన్మిత్ర లక్షణమిదం ప్రవదన్తి సన్తః** – ఇటువంటి లక్షణాలు ఉన్న వ్యక్తిని మంచిమిత్రుడు అంటారు.

సి) **దయ – కరుణః** – కరుణ అంటే జాలి, దయ. ఎవరైనా కష్టంలో ఉంటే కరిగిపోయే మనస్సు. దయ అంటే ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించి కరిగిపోయే మనస్సు కలిగివుండాలి. నిజానికి కొంతమంది వారు చూస్తున్న సినిమాతో మమేకం చెందుతారు. హీరోయిన్ నవ్వితే ఆమెతో పాటు నవ్వి, ఆమె ఏడిస్తే ఆమెతో పాటు ఏడుస్తారు. ఆమె భర్త చనిపోతే చాలా బాధపడతారు. దీన్ని తాదాత్మ్యభావన అంటారు. తాత్కాలికంగా ఆ వ్యక్తితో మమేకం చెంది, అతని కష్టసుఖాలు తన కష్టసుఖాలుగా భావించగలగటాన్ని దయాగుణం అంటారు. అంటే వారి కష్టాన్ని తన కష్టంగా భావించటం.

**ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోఽర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥** – 6.32

అంటే మీకు ఏదైనా కష్టం వస్తే, వెంటనే దాన్ని తీర్చుకోవటానికి ఎలా పాటుపడతారో అలాగే ఎదుటివారి కష్టాన్ని కూడా తీర్చటానికి చూస్తారు. దానికి చేసే సహాయం ధనరూపంలోనే ఉండాలనే నియమం లేదు. మీరు ఏ సహాయమూ చెయ్యలేకపోతే, మనసారా భగవంతుణ్ణి ప్రార్థించి, ఆ ప్రార్థనవల్ల వచ్చే పుణ్యాన్ని ఆ వ్యక్తికి ధారపోయవచ్చు.

**సర్వే భవంతు సుఖినః సర్వే సంతు నిరామయాః**

అందరి మేలుకోరి చేసే పూజ చాలు. అది మనసారా చెయ్యాలి. ఏదైనా ప్రకృతి వైపరీత్యం వచ్చినప్పుడు ముఖ్యమంత్రి రక్షణనిధికి అందరూ ఎలా ధనం పంపిస్తారో, అలా మీరు కూడా మీరు చేసే ప్రార్థనను భగవంతుని రక్షణనిధికి పంపించవచ్చు.

నలుగురిలో ఉన్నప్పుడు ఎవరిదైనా పైపంచ జారిపోతుంటే, నీ పంచ జారిపోతోందని చెప్పేకన్నా, మీరు దాన్ని పట్టుకుని అతని భుజంమీద సర్దటం కూడా మీరు చూపే దయాగుణమే. కారుణ్యగుణాన్ని జ్ఞానికి ఎందుకు ఆపాదిస్తాము? జ్ఞాని భగవంతునితో సమానం కాబట్టి, అతనికి కూడా భగవంతుని లక్షణాలు ఉంటాయి.

డి) **మమకారం లేకపోవటం – నిర్మమః** – మమకారం లేకపోవటం అంటే నాది, నావారు అనే భావన లేకపోవటం.

ఈ మమకారాన్ని పోగొట్టుకోవటానికి రెండు పద్ధతులున్నాయి. అవి భక్తిపరమైన పద్ధతి, వేదాంతపద్ధతి. ఈ రెండింటిలో వేదాంతపద్ధతి చాలా కష్టం.

వేదాంతపద్ధతిలో ఆత్మజ్ఞానం పొందుతారు. ముందు ఆత్మ అసంగం అనీ, ఆకాశంలాగా దేనితోనూ సంగత్వం పెంచుకోదనీ నేర్చుకుంటారు. తర్వాత ఆ ఆత్మ మీరే అని నేర్చుకుంటారు. ఆత్మలాగా మీరు నిత్యసంబంధరహితులు అనీ, ఆత్మలాగా మీకు దేనితోనూ సంగత్వం ఉండదనీ నేర్చుకుంటారు. ఎప్పుడైతే ఆ జ్ఞానాన్ని మీలో జీర్ణించుకుంటారో, అప్పుడే మీరు కూడా నెమ్మదిగా మమకారాన్ని తగ్గించుకుంటారు.

**న మాతా న పితా న బంధుర్న శాస్త్రమ్**

**న శిష్యో న శిక్షా న చత్వం న చాహం న ప్రపఞ్చః** – నిర్వాణదశకమ్

నేను తల్లిని కాదు, తండ్రిని కాదు, శిష్యుణ్ణి కాను అంటూ మమకారాన్ని తొలగించుకోవటానికి తోడ్పడే శ్లోకం ఇది. జ్ఞానం పొంది, వైరాగ్యం పెంపొందించుకోవటం వేదాంతపద్ధతి.

జ్ఞానమార్గంకన్నా భక్తిమార్గం ఆచరించటం తేలిక. ఈశ్వరప్రసాద బుద్ధి కలిగివుండాలి. నేను అనుభవిస్తున్నదంతా భగవంతుడు నాకు తాత్కాలికంగా ఇచ్చిన కానుక. దాన్ని నేను సద్వినియోగం చేసుకుని, ఆధ్యాత్మికంగా ఎదగాలి. అంటే నా భార్య, పిల్లలు, తల్లిదండ్రులు, నా ఆస్తిపాస్తులు అన్నీ భగవంతుడు నాకిచ్చిన వరాలు. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు భగవంతునికి నానుంచి వెనక్కి తీసుకునే హక్కు ఉంది. వారిని ఇచ్చినందుకు భగవంతునికి ఋణపడివుండాలి. అలాగే ఆయన వెనక్కి తీసేసుకున్నప్పుడు ఆయనను నిందించకూడదు. భగవంతునికి వారిని కృతజ్ఞతాపూర్వకంగా తిరిగి అప్పచెప్పాలి.

**తన్ మన్ ధన్ సబ్‌కుచ్ తేరా**

తనువు, మనస్సు, ధనమూ అన్నీ నీవే అనగలగాలి. ఈ మాటలు పెదవులనుంచి రావటం కాదు, హృదయం లోతుల్లోంచి రావాలి. వాటిని నిజంగా ముందే ఇచ్చివేయనవసరం లేదు, కాని బంధించే మమకారం పెంచుకోకూడదు.

ఇ) **అహంకారం లేకపోవటం – నిరహంకారః** – అహంకారం లేకపోవటం. బాహ్యప్రపంచంమీద అనుబంధం

పెంచుకుంటే దాన్ని మమకారం అంటారు; మీ శరీరంమీద అనుబంధం పెంచుకుంటే దాన్ని అహంకారం అంటారు. శరీరం అంటే స్థూలశరీరం ఒకటే కాదు; సూక్ష్మశరీరం, కారణశరీరం కూడా వస్తాయి.

**శరీరత్రయ అభిమానః అహంకారః, శరీరభిన్న విషయ అభిమానః మమకారః**

శరీరత్రయంమీద అభిమానాన్ని అహంకారం అంటే బాహ్యవస్తువులు, మనుష్యులమీద అభిమానాన్ని మమకారం అంటారు. సంసారం అంటే అహంకార, మమకారాలు ఉండటం. అహంకార, మమకారాలను వదులుకోవటం మోక్షం. జ్ఞాని ఈ అహంకార, మమకారాలను వదులుకుంటాడు.

అహంకారాన్ని వదులుకోవటమెలా? దీనికి కూడా ముందు చెప్పిన రెండు పద్ధతుల్లో ఏదైనా ఒక దానిని పాటించాలి. భర్తృహరి వైరాగ్యశతకంలో ఈ అహంకారత్యాగాన్ని అద్భుతంగా వర్ణించారు. మరణశయ్య మీద ఉన్న జ్ఞాని భావన ఎలా ఉంటుంది?

**మాతర్మేదిని తాత మారుత సఖే తేజః సుబన్ధో జల**

**భ్రాతర్వ్యోమ నిబద్ధ ఏవ భవతామన్త్యః ప్రణామాఞ్జలిః**

**యుష్మత్సఙ్గవశోపజాతసుకృతస్ఫారస్ఫురన్నిర్మల**

**జ్ఞానాపాస్తసమస్తమోహమహిమా లీయే పరబ్రహ్మణి** – భర్తృహరి వైరాగ్యశతకం 100

పంచభూతాలకు కృతజ్ఞత చెబుతున్నాడు ఈ జ్ఞాని. పంచభూతాలు అతని శరీరం ఏర్పడటానికి తోడ్పడ్డాయి. శరీరం ఆకాశం; ఊపిరి వాయువు; శరీర ఉష్ణోగ్రత అగ్ని; ద్రవపదార్థం నీరు; శరీరం బరువు భూమి. ఆ విధంగా పంచభూతాలనుంచి ఈ పాంచభౌతిక శరీరం ఏర్పడింది. ఈ పాంచభౌతిక శరీరాన్ని ఉపయోగించి, జ్ఞానం పొందాను, ఇప్పుడు ఈ శరీరాన్ని మీకు తిరిగి ఇస్తున్నాను అంటున్నాడు జ్ఞాని. ఇదీ అహంకారం లేకపోవటం అంటే.

ఎఫ్) **సమత్వం – సమదుఃఖసుఖః** – సుఖదుఃఖాలను సమానంగా స్వీకరించటం. అంటే సమత్వం కలిగివుండటం. రోడ్డుమీద వెళుతుంటే; అది చాలా ఎత్తుపల్లాలతో ఉంటుంది. మీ కారుకు మంచి షాక్ అబ్సార్బర్లు ఉంటే ప్రయాణం సాఫీగా సాగుతుంది. అలాగే జీవితం కూడా అనేక ఎత్తుపల్లాలతో ఉంటుంది. మీరు చక్కటి షాక్ అబ్సార్బర్లను పెంపొందించుకుంటే మీ జీవనయానం కూడా సాఫీగా సాగుతుంది. వాటిని కూడా భక్తిపరంగానూ, జ్ఞానపరంగానూ పెంచుకోగలరు.

జ్ఞానపరంగా చూస్తే ఆత్మజ్ఞానం పొందితే, సుఖదుఃఖమిథ్యాత్వదర్శనం కలుగుతుంది. అంటే కష్టాలు కరిగిపోవు, కాని జ్ఞానం వాటిని తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంది. అహం సత్యం, జగత్ మిథ్యా అనే జ్ఞానం కలిగితే, తాత్కాలికంగా వచ్చిపోయే సుఖానికి పొంగిపోరు; దుఃఖానికి కృంగిపోరు.

ఇది జీర్ణించుకోవటం కష్టమనుకుంటే, భక్తిమార్గం ఉండనే ఉంది. ఈ జగత్తు మొత్తాన్ని భగవంతుడు సృష్టించాడు. ఆయన దేన్నీ అనవసరంగా సృష్టించడు అని అర్థం చేసుకోవాలి. అంటే ప్రతి ఒక్క వస్తువువల్ల కూడా ఏదో ఒక ప్రయోజనం ఉంటుంది. ఆ ప్రయోజనం మీకు తెలియనంత మాత్రాన లేదనుకోకూడదు.

భగవంతుడు దేనినీ అనవసరంగా సృష్టించడని నమ్మకం పెంచుకోగలగటమే శ్రద్ధ. ఈ శ్రద్ధ చాలా లోతుగా ఉండాలి. సృష్టిలోని వస్తువులను గమనించిన కొద్దీ, మీకు తెలియకుండానే ఈ శ్రద్ధ పెరుగుతుంది. విజ్ఞానశాస్త్రంలో ఏ భాగం నేర్చుకున్నా సృష్టిలో ప్రతిదానికీ ఒక విలువ ఉందని అర్థమవుతుంది.

**తస్మాత్ సుకృతముచ్యత ఇతి** – తైత్తిరీయం

ఈ సృష్టిని సుకృతం అంటుంది ఆ ఉపనిషత్తు. అంటే సృష్టిలో ప్రయోజనం లేని వస్తువంటూ ఏదీ లేదు. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఈ సుఖదుఃఖాల జంటను కూడా సృష్టిలో భాగంగా గ్రహిస్తారు. పురాణాల్లో ఎవరిని చూసినా – రాముడు, కృష్ణుడు, నలమహారాజు, ధర్మరాజు – అనేక సుఖదుఃఖాలను అనుభవించారు. అంటే సుఖదుఃఖాలకు కూడా ఒక ప్రయోజనం ఉంది; అవి మీ జీవితాన్ని తీర్చిదిద్దుతాయి అని అర్థం చేసుకోవాలి.

మీ మనస్తత్వం మారాలంటే, మీరు ఎదగాలంటే, దుఃఖం కూడా అనుభవించాలి. ఒక ముడిసరుకు ఒక వస్తువుగా రూపుదిద్దుకునే ముందు ఎన్నో అవస్థలు దాటిరావాలి. సమ్మెటపోట్లకు గురికావాలి; వేడిమంటలను భరించాలి. అలాగే మీరు కూడా మంచివారుగా ఎదగాలంటే కొన్ని సమ్మెటపోట్లను, కొన్ని బాధాకర పరిస్థితులను ఎదుర్కోకతప్పదు. ఈ విషయం తెలుసుకుంటే సుఖదుఃఖాలను సమానంగా స్వీకరిస్తారు.

జి) **క్షమాగుణం – క్షమీ** – క్షమాగుణాన్ని పెంపొందించుకోవటం. నిజానికి క్షమాగుణాన్ని, మనకు లేని గుణంగా నిర్వచించవచ్చు. ఈ గుణం పెంపొందించుకోవటం చాలా కష్టం. అందులో నేటి ఈ పరుగుపందెంలో ఈ క్షమాగుణాన్ని అలవరచుకోవటం చాలా కష్టం. దీన్నే తితీక్ష అని కూడా అంటారు.

మామూలుగా మీకు నచ్చని సంఘటన ఏదైనా జరిగితే, దాన్ని మీకు అనుకూలంగా తిప్పుకోవటానికి ప్రయత్నిస్తారు. అది సంఘటనే అవనవసరం లేదు. మీ కుటుంబసభ్యులలో ఎవరి ప్రవర్తనో మీకు నచ్చలేదనుకోండి, మామూలుగా ఏం చేస్తారు? ఆ వ్యక్తిని మీకు అనుకూలంగా మార్చటానికి ప్రయత్నిస్తారు. ఈ మార్పును తీసుకురావటానికి మళ్ళీ రెండు రకాలుగా ప్రయత్నించవచ్చు. దూకుడుగా వారిని తిట్టటమో, కొట్టటమో చేయవచ్చు. రెండవది ఎదుటివారికి నచ్చచెప్పటం. కాని ఎవరికీ అంత ఓపిక ఉండదు. ముందు కోపం ముంచుకు వస్తుంది.

కానీ క్షమాగుణం ఉన్నవ్యక్తి తప్పు చేసినవారిని దండించటం వెంటనే చెయ్యడు. వీలున్నంతవరకూ దండోపాయం వాడకుండా ఉండటానికే ప్రయత్నిస్తాడు. యుద్ధభూమిలో నిలిచి కూడా శ్రీరామచంద్రుడు రావణాసురునితో 'ఇవాళ పోయి, రేపు రా,' అన్నాడు. అంటే దండన విధించే ముందు కూడా క్షమాగుణాన్ని ప్రదర్శించాడు.

శిక్షించటం ఒక విధంగా మంచిదే. ఎందుకంటే మంచిమాటలు చెప్పినదాని కన్నా, ఒక బెదిరింపు ఎదుటి వ్యక్తిని మారుస్తుంది; అది కూడా త్వరగా తీసుకువస్తుంది ఆ మార్పు. అంటే దండించటం చాలా తేలిక, సత్వరఫలితాలను ఇస్తుంది, వేగంగా పనిచేస్తుంది కాని దానివల్ల వచ్చే పర్యవసనాలు తీవ్రంగా ఉంటాయి.

ఒక్కోసారి ఒక రోగం తగ్గటానికి మనం వేసుకునే మందు ఆ రోగాన్ని వెంటనే తగ్గించినా, ఆ రోగంకన్నా ఎక్కువగా మనను బాధిస్తుంది. అలాగే శిక్షించటం కూడా.

ఈ విషయాన్ని మీరు ఎంత బాగా అర్థం చేసుకుంటే అంత ఎక్కువగా దండించే పద్ధతిని దూరం పెడతారు. ఈ విషయం అర్థం కావాలంటే మనస్సు పనిచేసే తీరుతెన్నులు అర్థం చేసుకోవాలి. అంటే మానసిక పరిస్థితిని తెలుసుకోవాలి. మీరు ఒక వ్యక్తిని తీవ్రంగా శిక్షిస్తే, అతనిలోనూ తీవ్రమైన కోపం పెరుగుతుంది. అంటే మీరు ఎవరిని దండిస్తారో, వారు కూడా ఈ పద్ధతిని అలవరచుకుంటారు.

మీరు దండించేది మీ పిల్లలనయితే, వారు మిమ్మల్ని తిరిగి కొట్టలేరు, తిట్టలేరు. కాని వారు కూడా ఎవరినీ తేలికగా క్షమించలేరు. వారు పెరిగి పెద్దయ్యాక వారి పిల్లలను చిన్న తప్పుకు కూడా శిక్షిస్తారు. వారి పిల్లలు తమ పిల్లలను దండిస్తారు. అంటే ఇదొక విషవలయంలాగా సాగిపోతుంది. ఈ విషయం గ్రహిస్తే శిక్షించకుండా, క్షమాగుణాన్ని పెంపొందించుకుంటారు. శాస్త్రం దండోపాయాన్ని అంగీకరిస్తుంది, కాని దాన్నే మొదటి ఉపాయంగా వాడకూడదంటుంది. తక్కిన మార్గాలేవీ పనిచెయ్యకపోతే, అప్పుడు దీనికి రావాలి. అలా దీనికి రాకుండా ఓపిక పట్టే వ్యక్తిని క్షమీ అంటుంది.

హెచ్) **పరిపూర్ణత – సంతుష్టః** – పూర్ణత్వాన్ని కనుగొనటం. తనకు ఏ వెలితీ లేదనుకుంటాడు జ్ఞాని. ఈ ఆంతర పరిపూర్ణత్వాన్ని సంతుష్టః అంటున్నాడు కృష్ణపరమాత్మ. జ్ఞానికి ఈ పూర్ణత్వం ఎలా వస్తుంది? ఈశ్వరుడు పూర్ణ ఈశ్వరుడు; పూర్ణ ఈశ్వరునికి తను భిన్నంగా లేడని తెలుసు. ఒకవేళ మీరు ఈశ్వరునికి భిన్నం ఉన్నాను అనుకుంటే, ఈశ్వరుడు అపూర్ణుడు అవుతాడు. ఎందుకంటే పూర్ణత్వం అంటే అందులో అన్నీ రావాలి.

అందువల్ల జ్ఞానికి నేను పూర్ణ ఈశ్వరుణ్ణి అనే జ్ఞానం కలుగుతుంది. పూర్ణ ఈశ్వరుడు అంటే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ. ఎప్పుడైతే మీరు అనంతం బ్రహ్మ, పూర్ణ ఈశ్వరుడు అని అర్థం చేసుకుంటారో, అప్పుడే మీకు ఏలోటూ ఉండదు. జీవితంలో ఏదో వెలితి ఉంది అనుకున్నన్నాళ్ళూ దానికోసం పాటుపడుతూనే ఉంటారు. జ్ఞానికి ఆ వెలితి ఉండదు.

**ఆత్మన్యేవ ఆత్మనా తుష్టః – 2**

ఆ తుష్టః పదాన్నే ఇక్కడ సంతుష్టః అని చూస్తున్నాము. సంతుష్టః అంటే సమ్యక్ తుష్టః – దేనికీ లోటు లేదు.

మనకు అనేక కోరికలు ఉంటాయి. భగవంతుడు మన ముందు ప్రత్యక్షమయి, 'భక్తా, ఏమి నీ కోరిక,' అని అడిగితే ఆ కోరికలకు అంతు ఉండదు. నాకు పిల్లవాడు కావాలినుంచి మొదలుపెట్టి, నాకు జుట్టు రాలిపోతోంది, మంచి జుట్టు కావాలి దాకా కోరతాము. మనకు మూడు స్థాయిల్లో అపూర్ణత్వం ఉంటుంది.

**శారీరక అపూర్ణత్వం** – శరీరపరంగా తృప్తి లేదు. పొట్టిగా ఉన్నామనో, లావుగా ఉన్నామనో, బండ ముక్కు ఉందనో, తెల్లగా లేమనో – ఏదో ఒక బెంగ, ఒక కొరత. ఈ బెంగలను ఆధారం చేసుకుని ఎన్నో ప్లాస్టిక్ సర్జరీలు పుట్టుకొచ్చాయి.

**మానసిక అపూర్ణత్వం** – అమెరికాలో ఉన్న నా కొడుకు రోజూ ఫోను చేసి మాట్లాడటం లేదు. ఇదొక అపూర్ణత్వం. ఎవరికీ నేను అవసరం లేదు, ఎవరూ నన్ను పట్టించుకోవటం లేదు, ఎవరూ ఎలావున్నావని నోరు తెరిచి అడగరు అని వాపోతాము.

**బుద్ధిపరమైన అపూర్ణత్వం** – చాలా ప్రాథమిక ప్రశ్నలు మన బుద్ధిని తొలిచేస్తూ ఉంటాయి. వాటిలో అన్నిటికన్నా ముఖ్యమైనది – భగవంతుడు తీరికగాకూర్చుని ఈ విశ్వాన్ని ఎందుకు సృష్టించాడు? భగవంతుడు సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయితే, ఇంకా మంచి వాటిని సృష్టించవచ్చు కదా! అసలు ఈ దోమలను ఎందుకు సృష్టించాడు?

జ్ఞానికి ఈ మూడురకాల అపూర్ణత్వమూ లేవు. అతను సంతుష్టుడై ఉంటాడు. ఎప్పుడు?

**సతతం** – జ్ఞాని ఎప్పుడూ పరిపూర్ణభావనతో ఉంటాడు. ఎందుకు? అతనికి పూర్ణత్వజ్ఞానం కలగటంవల్ల.

జ్ఞానికి పూర్ణత్వభావన ఉంటే అతను ఇంక కర్మలు ఎందుకు చేస్తాడు అంటారు కొంతమంది. వారి ఉద్దేశంలో, ఏదైనా కోరిక ఉంటేనే ఏదైనా కర్మ చేస్తారు ఎవరైనా. కాని దానికి వేదాంతం చెప్పే జవాబు, నిజానికి జ్ఞానే సమాజానికి బాగా సేవ చెయ్యగలడు. ఏదైనా కోరికతో కర్మ చేసే వ్యక్తి, తన గురించే ఆలోచిస్తాడు కాని సమాజం గురించి ఆలోచించడు. అదే జ్ఞానికి కోరికలు తీరిపోతాయి కాబట్టి, అతను సంఘశ్రేయస్సుకోసం పాటుపడతాడు. తనకు వచ్చిన ఫలాన్ని సంతోషంగా నలుగురితో పంచుకుంటాడు.

జ్ఞాని జీవితమంతా పరోపకారానికే వెచ్చిస్తాడు. తన సమయాన్ని, తన శక్తిని, తన జ్ఞానాన్ని, తన ధనాన్ని – అంతటినీ సమాజసేవకు వినియోగిస్తాడు. అందువల్ల జ్ఞాని సమాజానికి సేవ చెయ్యడనే అపోహ తొలగించుకోవాలి. తక్కినవారి ఆనందం వచ్చిపోయేది. జ్ఞానికి ఆనందం ఎప్పుడూ ఉంటుంది. జ్ఞాని చేసే కర్మలను లీల అంటే, అజ్ఞాని చేసే కర్మలను అవస్థ అంటారు.

ఐ) **జ్ఞానం – యోగీ** – జ్ఞానికి జ్ఞానం ఉంటుంది. యోగీ అంటే యోగాసనాలు వేసే వ్యక్తి అనికాదు అర్థం. మనం యోగా అనే పదం వినగానే, మామూలుగా అనేక ఆసనాలను వెయ్యటం, ముఖ్యంగా శీర్షాసనం వెయ్యటం అనుకుంటాము లేదా సిద్ధులు ఉండటం అనుకుంటాము. కాని ఇక్కడ యోగం అంటే జ్ఞానం. యోగీ అంటే జ్ఞానం ఉన్న వ్యక్తి, జ్ఞాని అని అర్థం. యోగం అంటే జ్ఞానం అని ఎలా చెప్పగలరు?

యోగా పదం యుజ్ ధాతువునుంచి వచ్చింది. యుజ్ అంటే రెండింటిని కలపటం. జ్ఞానాన్ని యోగం అని ఎందుకంటారంటే జ్ఞానంద్వారానే జీవాత్మ, పరమాత్మల మధ్య దూరం తొలుగుతుంది. ఇంతకుముందు కూడా చూశాము జీవాత్మ, పరమాత్మల మధ్య నిజానికి దూరం లేదు, కాని మన అజ్ఞానంవల్ల పరమాత్మ మనకు దూరంగా ఎక్కడో వైకుంఠంలో ఉన్నాడు అనుకుంటాము. ఒకపక్క పరమాత్మ సర్వవ్యాపకం అంటూ, రెండోపక్క ఆయన వైకుంఠంలో ఉన్నాడు అంటే అవి పరస్పర విరుద్ధమైన వాక్యాలు కావా? అలా ఎందుకు చెబుతున్నాము? అజ్ఞానంవల్ల.

నిజానికి పురాణాల్లో భగవంతుడు వైకుంఠంలో ఉన్నాడని చెప్పినా, దాని అర్థం హృదయం. గుర్తుంచుకోండి, పురాణాల్లో వైకుంఠం అంటే అది మన హృదయానికి ప్రతీక. అందువల్ల సర్వవ్యాపకమైన పరమాత్మ, మనకు భిన్నంగా ఉన్నాడు అనుకుంటే అది భావపరంగా ఏర్పడిన అపోహ. చిన్నపిల్లలకు అలాంటి అపోహ కలుగుతూ ఉంటుంది. ఒక చిన్నపిల్లవాడు తల్లి ఒడిలో చల్లగా నిద్రపోతాడు కాని ఉన్నట్టుండి ఉలిక్కిపడి ఏడుస్తాడు. తల్లి అతని ఏడుపు విని ఖంగారు పడి లేపితే, అప్పుడు ఆ పిల్లవాడికి తన బాధేమిటో అర్థమవుతుంది. తల్లి ఒడిలో పడుకున్నాడు కాని స్వప్నంలో తల్లికి దూరమైనట్టు వస్తుంది. అది నిజమనుకుని కన్నీరు మున్నీరుగా విలపిస్తాడు. తల్లి లేపినప్పుడు తన తల్లిని కంటికెదురుగా చూస్తే అప్పుడు తనకొచ్చినది కల అని అర్థమవుతుంది.

ఆ విధంగా అజ్ఞానం దూరం చేస్తే, జ్ఞానం కలుపుతుంది. ఇక్కడ జ్ఞానం జీవాత్మ పరమాత్మల ఐక్యజ్ఞానం. అందువల్ల యోగం అంటే ఐక్యం.

**జీవాత్మా పరమాత్మనా సహ యుజ్యతే అనేన ఇతి యోగః**

ఏ జ్ఞానంవల్లనైతే జీవాత్మ పరమాత్మలో ఐక్యం అవుతుందో, ఆ జ్ఞానం యోగం. ఆ జ్ఞానం పొందిన వ్యక్తి యోగీ.

యోగీ అంటే సిద్ధులు కలిగివుండటం అని ఇంకొక అపోహ. దానికి కూడా జవాబు మనం ఇంతకుముందు చూశాము. కాని ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి మళ్ళీ చూద్దాము. మనుష్యుల్లో నాలుగు రకాలు ఉంటారు. వారు –

| | | |
|---|---|---|
| జ్ఞానమూ లేదు, సిద్ధులూ లేవు | – సిద్ధిరహిత అజ్ఞానం | – సిద్దులు లేని అజ్ఞాని |
| సిద్ధులు ఉన్నాయి కాని జ్ఞానం లేదు | – జ్ఞానరహిత సిద్ధి | – సిద్దులున్న అజ్ఞాని |
| జ్ఞానం ఉంది కాని సిద్ధులు లేవు | – సిద్ధిరహిత జ్ఞానం | – సిద్దులు లేని జ్ఞాని |
| జ్ఞానమూ ఉంది, సిద్ధులూ ఉన్నాయి | – సిద్ధిసహిత జ్ఞానం | – సిద్దులున్న జ్ఞాని |

వీరిలో ఎవరికి మోక్షం వస్తుంది? జ్ఞానంవల్లనే మోక్షం వస్తుందని మనకు తెలుసు కాబట్టి చివర చెప్పిన ఇద్దరికీ వస్తుంది. సిద్ధులు లేకపోయినా జ్ఞానం ఉంటే చాలు. సిద్ధులు కూడా ఉంటే అది అదనపు అర్హత అవుతుంది. కాని సిద్ధులు ఉండి, జ్ఞానం లేకపోతే మోక్షం రాదు. ఆ విషయం ఛాందోగ్యోపనిషత్తులో చూస్తాము. నారదులవారికి అనేక విద్యలు తెలుసు, అందువల్ల సిద్ధులు కూడా ఉన్నాయి. కాని ఆత్మజ్ఞానం లేదని గ్రహించుకుని గురువు దగ్గరికి వెళ్ళాడు.

**శోచామి తం మా భగవాన్ శోకస్య పారం తారయత్వితి,**

**తం హోవాచ యద్వై కించైతదధ్యగీష్ఠా నామైవైతత్** – ఛాందోగ్యం 7.1.3

అందువల్ల సిద్ధులు ఉండి, జ్ఞానం లేకపోతే అతను సిద్ధసంసారి అవుతాడు. సిద్ధులమీద దృష్టి పెట్టకండి. నిజానికి సిద్ధులు మోక్షం పొందటానికి ఆటంకమవుతాయి. అందువల్ల యోగీ అంటే సిద్ధులు ఉన్నా, లేకపోయినా జ్ఞాని అయిన వ్యక్తి.

జె) **ఆత్మ సంయమనం – యతాత్మా** – ఇక్కడ ఆత్మ అంటే సచ్చిదానంద ఆత్మ కాదు; కార్యకరణసంఘాతం లేదా మనశ్శరీరాలు. మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని కలిపి ఆత్మ అంటారు. యతః అంటే వశంలో ఉంచుకోవడం. అందువల్ల యతాత్మా అంటే తన మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని తన వశంలో ఉంచుకున్న వ్యక్తి. అంటే తన ఇంద్రియాలకు, తన మనస్సుకు తాను బానిస అవకుండా, వాటిని తన అదుపులో పెట్టుకోగలగిన వ్యక్తి.

ఇలా కార్యకరణసంఘాతాన్ని అదుపులో పెట్టుకోవటానికి మనకు పతంజలి చెప్పిన అష్టాంగయోగం ఉంది. దీన్ని మనం ఆరవ అధ్యాయంలో వివరంగా చూశాము. ఆ అష్టాంగయోగంలోని యమ, నియమాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దితే; ఆసనం శరీరాన్ని తీర్చిదిద్దితే; ప్రాణాయామం శక్తిని పెంపొందిస్తే; ప్రత్యాహారం ఇంద్రియనిగ్రహం నేర్పిస్తే; ధారణ, ధ్యానం, సమాధులు మనస్సును నియంత్రిస్తాయి. ఆ విధంగా అష్టాంగయోగంలో ఈ ఎనిమిది కలిసి మనస్సును, ఇంద్రియాలను, శరీరాన్ని తీర్చిదిద్దుతాయి. దానివల్ల యతాత్మా అవుతాము.

నిజానికి వేదాంతానికి రాకముందే ఈ మనశ్శరీరాల నిగ్రహం కావాలి. సాధనచతుష్టయసంపత్తిలో మూడవ అంశం శమాదిషట్కసంపత్తి. అందులో శమ, దమాలు అంటే ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం కలిగివుండటం. గంటసేపు గీతాబోధ వినాలంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఉండాలి. ఏకాగ్రతతో వినాలి. మనస్సు చెదరకూడదు. అంటే శ్రవణానికి శమదమాలు ఉండాలి. నిదిధ్యాసనకు కూడా శమదమాలు ఉండాలి. ఆత్మ సంయమనం లేకపోతే వేదాంతమే కాదు, జీవితంలో ఏదీ సాధించలేము.

కొంతమంది, ఒక పుస్తకంలో పట్టుమని ఒక పేజీ కూడా చదవలేరు. ఐదుపంక్తులు చదివి, లేచి కాఫీ త్రాగుతారు. మళ్ళీ కూర్చుని మళ్ళీ ఐదుపంక్తులు చదివి, టీవీ పెడతారు. కాని జ్ఞాని అలా కాదు. ఆత్మసంయమనం కలిగివుంటాడు. దానివల్ల ఇంకొక లక్షణం అలవడుతుంది.

కె) **స్థితప్రజ్ఞః – దృఢనిశ్చయః** – ఆత్మ సంయమనంవల్ల స్థితప్రజ్ఞుడు అవుతాడు. దృఢ అంటే స్థిత; నిశ్చయః అంటే ప్రజ్ఞ. దృఢనిశ్చయః అంటే స్థితప్రజ్ఞ. అంటే జ్ఞాననిష్ఠలో ఉన్న వ్యక్తి.

వేదాంతవిద్యను రెండు దశల్లో నేర్చుకోవాలి. అవి శ్రవణం, మననం. శ్రవణం స్థాయిలో ప్రశ్నలు అడక్కుండా శ్రద్ధగా వినాలి. మీకేమైనా సంశయాలు కలిగినా, శ్రద్ధగా వింటూవుంటే, కాలక్రమేణా ఆ సంశయాలు వాటంతట అవే తొలగిపోతాయి. చాలామంది స్వామీజీని అడుగుతుంటారుట, 'మీకేమైనా టెలీపతీ ఉందా, ఇవాళ నేను ఏ సందేహం తీర్చుకుందామని మీ బోధకు వచ్చానో, సరిగ్గా ఆ సందేహనికే మీరు జవాబు చెప్పారు.' 'అది టెలీపతీ కాదు, శాస్త్రంయొక్క గొప్పతనం,' అంటారు స్వామీజీ.

కాని శ్రవణం దశలో అన్ని సందేహాలూ తీరకపోవచ్చు. మననం దశలో వాటిని తీర్చుకోవాలి. బుద్ధి లక్షణమే సందేహాలను కలుగజేయటం. ఆ సందేహాలను తీర్చాలి. సందేహాలు తీరకపోతే నిశ్చయజ్ఞానం కలగదు. ఆ నిశ్చయజ్ఞానం కలిగితే దాన్ని దృఢనిశ్చయః అంటారు.

ఈ పదాన్ని బట్టి అత్యుత్తమభక్తునికి శాస్త్రంమీద నిశ్చయజ్ఞానం ఉండాలని అర్థమవుతుంది. ఎలా చెప్పగలము? కృష్ణపరమాత్మే స్పష్టంగా చెప్పాడు. వేదాంతజ్ఞానం పొందకపోతే, మీరు భక్తులు అవుతారు కానీ, భగవంతునికీ మీకూ మధ్య దూరం అలాగే ఉంటుంది. అందువల్ల భక్తిపరాకాష్ఠ అంటే భగవంతునికీ, భక్తునికీ మధ్య ఐక్యజ్ఞానం కలిగివుండటం. దీన్ని దృఢనిశ్చయః అన్నాడు.

ఎల్) **అంకితభావం – మయ్యర్పితమనోబుద్ధిః** – పరాభక్తియొక్క ఇంకొక లక్షణం భగవంతునిమీద అంకితభావం కలిగివుండటం.

మనం భగవంతుణ్ణి మూడు స్థాయిల్లో కొలుస్తామని అనేకసార్లు చూశాము. అవి ఏకరూపభక్తి, అనేకరూపభక్తి, అరూపభక్తి. ఏకరూపభక్తిలో ఇష్టదేవతను కొలుస్తాము. ఆ భగవంతుడు వైకుంఠంలోనో, కైలాసంలోనో ఉన్నాడనుకుంటాము. అనేకరూపభక్తిలో భగవంతుడు అంతటా ఉన్నాడని అంటాము. ఇక్కడ ఒక విషయం గ్రహించాలి. ఒక స్థాయినుంచి ఇంకొక స్థాయికి ఎదిగితే, కిందస్థాయిని కించపరచకూడదు. అలా ఎవరైనా భావిస్తే, అతను వేదాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకోనట్టు అర్థం. అరూపభక్తికి వచ్చినా ఏకరూప భగవంతుణ్ణి కొలవవచ్చు. దానికి శంకరాచార్యులవారే నిదర్శనం. ఉపనిషత్తుల్లో, బ్రహ్మసూత్రాల్లో నిర్గుణబ్రహ్మ గురించి భాష్యాలు రాశారు. అదే శంకరాచార్యులవారు ఎన్నో భక్తిశ్లోకాలు రాశారు. అది కూడా అనేక దేవతలమీద – శివస్తోత్రం, దేవీస్తోత్రం, సరస్వతీస్తోత్రం, సుబ్రహ్మణ్యస్తుతి – అలా అనేకం ఉన్నాయి.

అద్వైతజ్ఞానం ద్వైతభక్తిని నాశనం చెయ్యదని దీన్ని బట్టి అర్థమవుతుంది. నిజానికి ద్వైతభక్తిని, అద్వైతజ్ఞానం ఉన్న వ్యక్తే బాగా అనుభవించగలడు.

అద్వైతజ్ఞానికి మూడు ఛానెల్స్ ఉన్నాయి – ఏకరూప ఛానెల్, అనేకరూప ఛానెల్, అరూప ఛానెల్. అతను ఏదైనా ఆలయానికి వెళితే ఏకరూప ఈశ్వరుణ్ణి కొలుస్తాడు; బదరీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రిలాంటి సుందర ప్రాంతాలకు వెళితే అనేకరూప ఈశ్వరుణ్ణి తలుచుకుని, ప్రకృతిలో విశ్వరూపదర్శనం చేసుకుంటాడు. తను అహం బ్రహ్మ అస్మి జ్ఞాననిష్ఠలో ఉన్నప్పుడు అరూప ఈశ్వరభక్తిలో ఉంటాడు.

మనుష్యులైన మనకు మామూలుగా మనను ఒడిలో చేర్చుకుని లేదా భుజంమీద తలవాల్చుకోనిచ్చి ఓదార్చే అమృతహస్తం కావాలి. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో పిల్లలకు అలాంటి అండ బాగా దొరికేది. ఏ కష్టం, సుఖం వచ్చినా బాబాయి భుజం, బామ్మ ఒడి, తాతయ్య లాలన ఎప్పుడూ సిద్ధంగా ఉండేవి. ఇప్పుడు ఒంటరి కాపురాలు వచ్చాయి; తండ్రికి ఉద్యోగధర్మంతో ఇంటికి ఎప్పుడు వస్తాడో తెలియదు; తల్లి ఇంటిపని, ఆఫీసుపని చెయ్యలేక, క్షణం తీరికలేక సతమతమవుతూ ఉంటుంది. అటువంటి స్థితిలో పిల్లవాడు వెళ్ళి స్కూల్లో నన్ను ఎవరో కొట్టారని చిన్న ఓదార్పుకోసం ప్రయత్నిస్తే, వాడిని నువ్వు ఎందుకు కొట్టావని, అతని మాట పూర్తిగా వినకుండా తల్లి అతన్ని కొడుతుంది. అలా పిల్లలగోడు వినే నాథుడే కరువైపోయాడు.

ఇటువంటి సందర్భం పిల్లలకి కాదు, పెద్దలకు కూడా ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. ఓదార్చే ఓ చల్లని హస్తంకోసం అల్లాడిపోతారు. కొంతమంది, మనుష్యుల్లో ఆ అమృతహస్తం దొరక్క, ఇష్టదైవానికి తమ గోడును

వెలిబుచ్చుకుంటారు. అలా వచ్చిన కథలే మీరాబాయి, సక్కుబాయి, తుకారం కథలు. శంకరాచార్యులవారు కూడా శివానందలహరిలో అలాగే తన ఇష్టదైవాన్ని వర్ణించారు. ఇష్టదేవతా భక్తి అంటారు దీన్ని. భగవంతుని పాదాలమీద మనస్సును అర్పించటం. ఇది మనస్సు పరంగా ఆలోచించినప్పుడు చూపే భక్తి.

ఒక్కోసారి మనస్సును అధిగమించి బుద్ధి పని చేస్తుంది. బుద్ధి తార్కికంగా ఆలోచించినప్పుడు, భగవంతుడు ఎవరు? ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు? ఈ జగత్తులో కష్టాలు ఎందుకు ఉన్నాయి? ఇలాంటి ప్రశ్నలు వేధించినప్పుడు అరూపభక్తికి అంటే ఆత్మజ్ఞానానికి వస్తాము. అంటే బుద్ధి రాజ్యం ఏలుతుంటే అరూప ఈశ్వరజ్ఞానం పొందుతాము; మనస్సు కృంగదీస్తుంటే సగుణ ఈశ్వరభక్తి చూపుతాము. ఆ విధంగా సగుణ ఈశ్వరభక్తి, నిర్గుణబ్రహ్మజ్ఞానం రెండూ ఉంటాయి మనకు.

**తేజోమయం సగుణనిర్గుణమద్వితీయమ్,**
**ఆనందకందమపరాజితమప్రమేయమ్ ।**
**నాగాత్మకం సకలనిష్కలమాత్మరూపమ్,**
**వారాణసీ పురపతిం భజవిశ్వనాథమ్ ॥**

ఇంచుమించు అన్ని స్తోత్రాల్లోనూ శంకరులవారు సగుణ, నిర్గుణ అద్వితీయం గురించి ప్రస్తావిస్తూ ఉంటారు. అందువల్ల మనస్సుపరంగా ఇష్టదేవతను కొలిచి, బుద్ధిపరంగా ఈశ్వరజ్ఞానం పొందాలి.

మయ్యర్పితమనోబుద్ధిః అంటే భావపరమైన మనస్సు; జ్ఞానపరమైన బుద్ధిని కూడా పరమాత్మ పాదాలచెంత ఉంచాలి. అంటే ఇష్టదేవతా భక్తిని పురాణాల శ్రవణంద్వారా పెంపొందించుకోవచ్చు. భగవంతుని లీలలను వాటిలో వింటాము. అరూపభక్తిని వేదాంత శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా పొందుతాము.

**యః మద్భక్తః** – అటువంటి భక్తుడు. ఎటువంటి భక్తుడు? భగవంతుణ్ణి ఏకరూప, అనేకరూప, అరూప ఈశ్వరునిగా కొలిచే భక్తుడు.

**సః మే ప్రియః** – నాకు చాలా ప్రియమైన వ్యక్తి. ఈ విషయం ఏడవ అధ్యాయంలోనే చెప్పాడు.

**జ్ఞానీ తు ఆత్మైవ మే మతం** – 7

ఆ జ్ఞానే నేను, నేనే జ్ఞాని.

శ్లో. 15 **యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః ।**
**హర్షామర్షభయోద్వేగైః ముక్తోయస్స చ మే ప్రియః ॥**
యస్మాత్, న, ఉద్విజతే, లోకః, లోకాత్, న, ఉద్విజతే, చ, యః,
హర్షామర్షభయోద్వేగైః, ముక్తః, యః, సః, చ, మే, ప్రియః ॥

| | | | |
|---|---|---|---|
| యస్మాత్ | = ఎవనివల్ల | యః | = ఎవరు |
| లోకః | = ఏ ప్రాణియు | హర్షామర్ష | = హర్షము, ఈర్ష్య, భయము, |
| న, ఉద్విజతే | = ఉద్వేగమునకు గురికాదో | భయోద్వేగైః | ఉద్వేగము మొదలగు వాటినుంచి |
| చ | = ఇంకా | ముక్తః | = ముక్తుడో |
| యః | = ఎవరు (స్వయముగా) | సః | = అట్టి భక్తుడు |
| లోకాత్ | = ఏ ప్రాణివల్ల | మే | = నాకు |
| న, ఉద్విజతే | = ఉద్వేగమును పొందడో | ప్రియః | = ఇష్టుడు |
| చ | = అలాగే | | |

**లోకః యస్మాత్ న ఉద్విజతే, యః చ లోకాత్ న ఉద్విజతే, యః చ**
**హర్ష–ఆమర్ష–భయ–ఉద్వేగైః ముక్తః, సః మే ప్రియః (అస్తి)।**

తా: ఎవనివల్ల ఏ ప్రాణియు ఉద్వేగమునకు గురికాదో ఇంకా ఎవరు (స్వయముగా) ఏ ప్రాణివల్ల ఉద్వేగమును పొందడో, అలాగే ఎవరు హర్షము, ఈర్ష్య, భయము, ఉద్వేగము మొదలగు వాటినుంచి ముక్తుడో అట్టి భక్తుడు నాకు ఇష్టుడు.

రెండు రకాల మనుష్యులు ఉంటారు. ఒకరకం వారు రాయిలాంటి కఠినమనస్కులు, ఇంకొకరకం వారు కుసుమ కోమలహృదయులు.

ఒక విధంగా ఇలాంటి కఠినమనస్సు ఉండటం అదృష్టమే. ఎందుకంటే అతనికి ఎలాంటి కష్టాలు ఎదురైనా అతను చలించడు. అందువల్ల మన సాంప్రదాయంలో ఒక పద్ధతి ఉంది. దీన్ని కూడా ఇంతకుముందు చూశాము. ఉపనయనం చేసేటప్పుడు బ్రహ్మచారిని ఒక బండరాయిమీద నిలబెడతారు. ఆ రాయిమీద నిలుచుని ఇలా ప్రార్థించాలి అతను –

**ఆతిష్ఠేమమశ్మానమశ్వేవ త్వం స్థిరోభవ**

అంటే నీ జీవితంలో ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా వాటిని గుండెధైర్యంతో ఎదుర్కొనే గుండె నిబ్బరం అలవరుచుకోవాలని ఆచార్యుడు చెబుతాడు.

అదే విధంగా, పెళ్ళికూతురును పెళ్ళి తతంగంలో భాగంగా, ఒక రాయిమీద కాలు పెట్టించి, అదే ప్రార్థన చేయిస్తారు. కాకపోతే ఇక్కడ లింగభేదం చూస్తాము. అక్కడ బ్రహ్మచారి కొత్త జీవితంలోకి అడుగు పెట్టబోతుంటే, ఇక్కడ పెళ్ళికూతురు కొత్త కుటుంబంలోకి అడుగుపెట్టబోతోంది. అక్కడ ఎటువంటి విమర్శలు ఎదురైనా తట్టుకోగలిగే గుండె నిబ్బరం ఉండాలి.

ఇటువంటి కఠినహృదయం ఉండటం మంచిదే. ఎందుకంటే ఎటువంటి పరిస్థితికి కూడా చలించరు. ఎవరేమైనా కృంగిపోరని చూశాము. ఇది సానుకూలంగా చూస్తే మంచి పద్ధతి. కాని ఇటువంటి వారితో ఒక ప్రమాదం కూడా ఉంది. వారు తమ మాటల తూటాలతో ఎదుటివారి గుండెలను తూట్లు పొడుస్తారు.

వారి మాటలు ఎదుటివారిని ఎంత గాయపరుస్తాయో కొంచెం కూడా ఆలోచించరు. ఎందుకంటే, వారి ఉద్దేశంలో ఎదుటివారు కూడా వీరిలాగే బండరాయి మనస్తత్వం కలిగివుంటారు అనుకుంటారు. వీరు దున్నపోతు మీద వర్షం కురిసినట్టు ఉంటారు కాబట్టి, ఎదుటివారిని కూడా అలాగే ఊహించుకుంటారు. అందువల్ల ఈ మొదటిరకం వారు, వారు ఏ కష్టానికీ చలించరు కాని, ఇతరులను బాధపెడతారు.

ఇకపోతే, రెండవరకం మనుష్యులు వేరే ఉంటారు. వారి మనస్సులు పువ్వంత సున్నితంగా ఉంటాయి. చిన్న గాలికే రెపరెపలాడే పువ్వులా వారి మనస్సు కూడా చిన్న తాకిడికే అల్లల్లాడిపోతుంది. వారు కూడా, ఎదుటివారు వారిలాగే సున్నిత మనస్కులై ఉంటారు అనుకుంటారు. అందువల్ల ఎదుటివారిమీద సహృదయంతో ఉంటారు; వారిని ఎట్టి పరిస్థితిలోనూ మానసికంగా బాధించరు. అందువల్ల వారివల్ల ఇతరులకు ఏ బాధా ఉండదు. కాని సమస్య ఎక్కడ? వారు ఎవరైనా చిన్నమాట అన్నా చాలు, చాలా విలవిలలాడిపోతారు. చిన్న అవమానాన్ని, చిన్న మాటను భరించలేరు. రోజుల తరబడి నిద్రపోకుండా బాధపడతారు. ఎప్పుడొచ్చావని ఎదుటి వ్యక్తి యథాలాపంగా అడిగినా, ఎందుకొచ్చావని అడిగినట్టుగా ఊహించుకుని చాలా బాధపడిపోతారు.

సైన్సు ల్యాబుల్లో త్రాసు ఉంటుంది. అది చాలా సున్నితంగా ఉంటుంది. ఎంతో చిన్న గాలి వీచినా, మట్టి రేణువు దానిమీద పడినా, ఒక్క వెంట్రుక పడినా, ఆ త్రాసు తట్టుకోలేదు. ఒక వైపుకు ఒంగుతుంది. అంటే అది ఎప్పుడూ సమంగా ఉండదు. అందువల్ల గాలి చొరబడకుండా ఉండటంకోసం దాన్ని గ్లాసు షోకేస్‌లో పెడతారు.

ఇటువంటి సున్నిత మనస్కులను కూడా అలా అద్దాలమేడలో పెట్టాలి. అంటే వారితో ఎవరూ ఎటువంటి వ్యవహారమూ నడపకూడదు. కాని అది సాధ్యమేనా? వారు విశాలప్రపంచంలో, భిన్నమనుష్యులు ఉన్న ప్రపంచంలో ఉన్నారు. వారు ఎవరినీ బాధించటం లేదని గ్రహించరు ఎవరూ. వారివారి స్వభావం ప్రకారం వారు మాట్లాడతారు; అవసరమైతే మాటల తూటాలు కూడా వదులుతారు. అవి ఎదుటివారిని బాధిస్తున్నాయని గ్రహించకపోవచ్చు కూడా. ఇటువంటి వారిని ఎదుర్కోవటం ఎలా?

రెండురకాల మనుష్యులూ అవస్థ పడతారు. బండరాయి మనస్తత్వం ఉన్నవారు ఎదుటివారిని బాధిస్తారు; సున్నిత మనస్తత్వం ఉన్నవారు ఎదుటివారి మాటలకు కృంగిపోతారు. సంసారంయొక్క ఒక నిర్వచనం – హర్ట్ అండ్ గిల్ట్. అంటే బాధ, పశ్చాత్తాపం. ఈ రెండు రకాల మనుష్యులలో మొదటిరకంవారు ఎదుటివారిని బాధపెడితే, సున్నిత మనస్కులు తామే బాధపడతారు.

జ్ఞాని ఎవరు? జ్ఞాని ఈ ఇద్దరి మేలు కలయిక. కృష్ణపరమాత్మ జ్ఞాని ఎదుటివారితో వ్యవహారం నడిపినప్పుడు పువ్వులాగానూ, ఎదుటివారి మాటలు ఎదుర్కొంటున్నప్పుడు బండరాయిలాగానూ ఉంటాడు అంటాడు. అంటే కర్తగా మృదువుగా, భోక్తగా కఠినంగా ఉంటాడు.

జ్ఞాని సున్నితంగా ఉంటాడు కాని, ఆ సున్నితత్త్వం వెనక జ్ఞానం, పరిపక్వత ఉంటాయి. మామూలుగా మనం సున్నితంగా ఉంటే ఎదుటివారు అలా ఉండరు. అది మనను బాధిస్తుంది. కాని జ్ఞానికి సున్నితత్త్వంతో పాటు పరిపక్వత ఉంటుంది కాబట్టి, అందరూ తనలాగా సున్నితంగా ఉండరనే జ్ఞానం ఉంటుంది. కొంతమంది

శరీరం చాలా సున్నితంగా ఉంటుంది. ఉదాహరణకు కొందరు ఎప్పుడూ మినరల్ వాటరే తాగుతారు. అలాంటివారు ఒక్కసారి ఏ కుళాయి నీళ్ళో తాగితే చాలు, వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. కాని ఎప్పుడూ కుళాయినీళ్ళు తాగేవారి ఆరోగ్యం త్వరగా దెబ్బతినదు. వారికి రోగనిరోధకశక్తి ఉంటుంది.

జ్ఞానికి ఉండే రోగనిరోధకశక్తి అతనికున్న పరిపక్వత. అందువల్ల తను సున్నిత మనస్కుడైనా కూడా అందరూ ఒక్కలాగా ఉండరనే పరిపక్వత ఉంటుంది.

**యస్మాత్ లోకః న ఉద్విజతే** – జ్ఞాని ఎదుటివారిని బాధించడు. ఎదుటివారి గురించి అక్కర ఉంటుంది. అందువల్ల తెలిసి ఎవరినీ నొప్పించడు. తనకు తెలియకుండా వారు బాధపడితే అతనేమీ చెయ్యలేడు. కాని తను కావాలని ఎవరినీ బాధపెట్టడు. అంటే అహింస పాటిస్తాడు. లోకః అంటే లోకంలోని మనుష్యులు. న ఉద్విజతే అంటే బాధపడరు; యస్మాత్ అంటే ఈ జ్ఞానివల్ల. అంటే ఈ జ్ఞానివల్ల లోకంలో ఎవరూ బాధపడరు. ఎందుకంటే అతను సున్నిత మనస్కుడై ఉండి, ఎదుటివారి భావాలకు విలువనిస్తాడు.

**లోకాత్ న ఉద్విజతే** – అలాగని లోకం తనను బాధపెట్టినా చలించడు. అప్పుడు తనను, తన గుండెను దిటవు పరచుకుంటాడు. రాక్ ఆఫ్ గిబ్రాల్టర్‌మీద సముద్రపు అలలు ఎంతగా ఎగసిపడినా, ఆ రాయి చెక్కుచెదరకుండా అలాగే ఉంటుంది. జ్ఞాని కూడా తన మనస్సును అలా రాయిలా కఠినపరచుకుని, ఎవరేమన్నా చలించకుండా ఉంటాడు. లోకాత్ అంటే లోకంనుంచి వచ్చిన బాధలకు; న ఉద్విజతే అంటే చలింపడు.

జ్ఞానిని కీర్తిస్తూ ఒక అద్భుతమైన శ్లోకం ఉంది –

**వజ్రాదపి కఠోరాణి మృదూని కుసుమాదపి ।**
**లోకోత్తరాణాం చేతాంసి కో హి విజ్ఞాతుమర్హతి ॥**

**వజ్రాదపి కఠోరాణి** – జ్ఞాని హృదయం కఠినంగా ఉంటుంది. ఎప్పుడు? అనుభవాలు పొందేటప్పుడు. ఎవరేమన్నా చలించడు.

**మృదూని కుసుమాదపి** – పువ్వుకన్నా మృదువుగా ఉంటాడు. ఎదుటివారితో వ్యవహరించేటప్పుడు మృదువుగా వ్యవహరిస్తాడు. అంటే వారిని బాధపెట్టడు.

మనమూ వజ్రంలా కఠినంగా, పువ్వులా మృదువుగా ఉంటాము. కాని జ్ఞానికీ, మనకూ ఎక్కడ భేదముంది అంటే అతను వాడే పరిస్థితులు వేరు, మనం వాడే పరిస్థితులు వేరు.

మనం ఎదుటివారితో వ్యవహరించేటప్పుడు కఠినంగా ఉంటాము, అంటే వారిని బాధిస్తాము; ఎదుటివారు మననేదన్నా అంటే పువ్వులా సుకుమారంగా ఉండి క్షోభపడతాము. కాని జ్ఞాని ఎదుటివారితో సున్నితంగా వ్యవహరించి, వారు చూపిన స్పందనలకు చలించడు. ఒక్కమాటలో చెప్పాలంటే, జ్ఞాని తను ఎవరి మాటలకూ బాధపడడు, తాను ఎవరినీ బాధించడు. ఇది జ్ఞానియొక్క గొప్పతనం.

జ్ఞాని ఎవరినీ బాధపెట్టడు కాబట్టి, అతనికి పశ్చాత్తాపం కూడా ఉండదు. ఎవరినైనా బాధిస్తేనే కదా, పశ్చాత్తాప పడేది. జ్ఞానికి బాధా లేదు, పశ్చాత్తాపమూ లేదు. ఇంతకుముందు కూడా చూశాము, సంసారంయొక్క ఒక నిర్వచనం – హర్ట్ అండ్ గిల్ట్; బాధ, పశ్చాత్తాపం. జ్ఞానికి ఈ రెండూ ఉండవు కాబట్టి అతను సంసారంనుంచి ముక్తి పొందుతాడు.

ఎమ్) **జీవన్ముక్తి – హర్షామర్షభయోద్వేగైః ముక్తః** – ముక్తః అంటే మోక్షం పొందుతాడు. జ్ఞాని **జీవన్ముక్తి** పొందుతాడు అని జ్ఞానఫలంగా చెబుతాము. ముక్తి పొందుతాడు అంటే అనేక సందేహాలు వస్తాయి. దేన్నించి ముక్తి పొందుతాడు? సంసారంనుండా, ఈ వేషధారణనుండా? అతను రేపటినుంచి కాషాయవస్త్రాలు ధరించి తిరుగుతాడా? దేన్నించి ముక్తి పొందుతాడో ఇక్కడ కృష్ణపరమాత్మ స్పష్టంగా చెబుతున్నాడు. బాహ్యవస్తువులనుంచి కాదు; ఆంతర్గతస్వేచ్ఛ పొందుతాడు. వేదాంతం ఎప్పుడూ ఆంతర్గత స్వేచ్ఛ గురించి చెబుతుంది.

ఇక్కడ నాలుగు విషయాలను వర్ణిస్తున్నాడు కృష్ణపరమాత్మ. అవి హర్షం, అమర్షం, భయం, ఉద్వేగం. ఈ నాలుగూ మనస్సును భారంగా చెయ్యగలవు.

హర్షః – హర్షః అంటే అతిశయించిన ఉత్సాహం. ఉత్సాహానికీ, అతిశయించిన ఉత్సాహానికీ మధ్యనున్న భేదం ఏమిటి? ఉత్సాహం హద్దులు దాటితే విచక్షణాశక్తిని కోల్పోతాము. ఎటువంటి భావోద్రేకమైనా సరే, హద్దులు మీరితే అది మనకు హానికరమవుతుంది.

భగవంతుడు మనకిచ్చిన గొప్పవరం – వివేకశక్తి; మంచిచెడులను బేరీజు వేసే విచక్షణాశక్తి. ఉత్సాహం మంచిదే అయినా, అది కూడా మితిమీరిన ఉత్సాహం అయితే మన వివేకశక్తిని కోల్పోతాము. అప్పుడు అది కూడా ప్రమాదమే. ఎందుకు? వివేకశక్తిని కోల్పోతే ఇప్పుడు వచ్చిన మితిమీరిన ఆనందం కూడా తాత్కాలికమే అనే నగ్నసత్యాన్ని ఆ ఉత్సాహం కప్పేసుంది. ఆ రెట్టించిన ఉత్సాహం ఎప్పుడూ ఉండాలని కోరుకుంటాము. అది జరగనిపని అని వివేకం మామూలుగా చెబుతుంది. కాని ఆ ఎగసిపడే సమయంలో అది పనిచెయ్యదు. అందువల్ల మితిమీరిన ఆనందం పోగానే, మనస్సు చెదిరిపోతుంది.

అందువల్ల హర్షం మంచిది కాదు, మనస్సు పరంగానే కాదు, శరీరపరంగా కూడా మంచిది కాదు. మితిమీరిన ఆనందం తట్టుకోలేక గుండె ఆగి మరణించినవారు ఎందరో ఉన్నారు.

అమర్షః – అమర్షః అంటే చిరాకు, భరించలేకపోవటం. ఈర్ష్య కూడా వస్తుంది.

చురుగ్గా పనిచేసే అలవాటు ఉన్న వ్యక్తికి పనులన్నీ ఆఘమేఘాలమీద అయిపోవాలనుకుంటాడు. అతను ఎంత ప్రచండవేగంతో పనిచేస్తాడో, ఎదుటివారు కూడా అంత ప్రచండవేగంతో పనులు చెయ్యాలనుకుంటాడు. అలా ఎవరైనా తను చెప్పినపని చిటెకలో చెయ్యకపోతే మండిపడతాడు. భార్యను కాఫీ అడిగితే, మరుక్షణం సలసలా మరుగుతున్న కాఫీతో కప్పును చేతపట్టుకుని భార్య తన ముందు ప్రత్యక్షమవ్వాలి. లేకపోతే వస్తువులను విసిరికొడతాడు. వారు తమ జీవితంలో విజయం సాధించి ఉండవచ్చు గాక, కాని ఎవరి అసమర్థతనూ

భరించలేరు. అందరూ ఒక్కలాగా ఉండరు, కొంతమంది చురుకుగా పనిచెయ్యలేరు అనే నగ్నసత్యాన్ని వారు జీర్ణించుకోలేరు. అంటే వారిని విజయం సాధించకూడదు అనటం లేదు, కాని ఏదీ హద్దులు మీరి ఉండకూడదు అంటున్నాము అంతే. రాత్రికి రాత్రి మనుష్యులు మారిపోలేరు.

అలాగే ప్రతిసారీ అద్భుతంగా చేసే వ్యక్తి కూడా, ఎవరైనా అడ్డదిడ్డంగా పనులు చేస్తే వారిని భరించలేడు. ఈ రకం వ్యక్తిని పర్‌ఫెక్షనిస్ట్ అంటారు. అతను ప్రతిదీ ఒక పద్ధతిలో చెయ్యాలంటాడు. ఉదాహరణకు ఒక పెన్నును కూడా ఎక్కడపడితే అక్కడ పడేయకూడదు. రాయటం అవగానే, చక్కగా పెన్నుకు క్యాప్ పెట్టి, దాన్ని దానికోసం కేటాయించబడిన పెన్‌స్టాండ్‌లో పెట్టాలి. అది కూడా క్యాప్ పైకి కనబడేలా, నిలువుగా పెట్టాలి. లేకపోతే ఎదుటివారిమీద ధుమధుమలాడిపోతాడు.

అందువల్ల అమర్షం అంటే చిరాకు, అసహనం అనవచ్చు. ఈ అసహనాన్ని రోడ్డుమీద గమనించవచ్చు. కొంతమంది అసలు సిగ్నల్స్‌ను పాటించరు. సిగ్నల్సు ఏదో అలంకరణకోసం రోడ్డుమీద పెట్టినట్టుగా భావిస్తారు. కొంతమంది సిగ్నల్సును పాటిస్తారు కాని ఆకుపచ్చ లైటు పడగానే, ముందు కారు ఏదో కారణంవల్ల కదలకపోతే హారన్ల రణగొణధ్వని ఆ ప్రాంతమంతా మారుమ్రోగిపోతుంది. అక్కడికేదో ఆ కారులోని వ్యక్తికి అలా ఆగటం నచ్చి, అక్కడే ఆగిపోయేటట్టు. అతనూ కదిలేవాడే. కాని ఆ అరక్షణం ఆలశ్యాన్ని కూడా భరించలేరు. పరుగులు తీయాలి – ఇప్పటి కాలంలో అరక్షణం కూడా విలువైనదే అనుకుంటారు. అరక్షణంలో ఏదో సాధించేయవచ్చు అనుకుంటారు.

ఈ హర్షం, అమర్షం ఒక్కోసారి వెంటవెంటనే అనుభవిస్తాము. ముఖ్యంగా క్రీడాకారులకు ఇది అనుభవంలోకి వస్తుంది. ఒక సిక్సర్ కొడితే గాలిలో తేలిపోయినట్టు ఉంటే, ఒక వికెట్టు పడిపోతే గుండె జారిపోయినట్టు ఉంటుంది. ఆడే క్రీడాకారులకే కాదు, చూసే ప్రేక్షకులకు కూడా అలాగే ఉంటుంది. ఒకపక్క విజయం, మరోపక్క అపజయం. మనం కోరుకున్నట్టు, మన ప్రణాళిక ప్రకారం జరిగితే, ఆ ఆటను మనం ఆనందిస్తాము. కాని అవి మన చేతిలో లేవు కాబట్టే ఆకాశంలో తేలినట్టు, గుండె జారినట్టు అనిపించటం జరుగుతుంది. దీన్ని సంసారం అంటారు.

ఆట విషయం తీసుకుంటే, ఓటమిని ఉదారంగా తీసుకోలేరు చాలామంది. ప్రతిసారీ గెలుపు తథ్యం కాదు కదా, అయినా ఎదుటిదేశం గెలిస్తే, మనం స్వీకరించలేము. అది ఆటల్లోనే కాదు, మన జీవితంలోని ఆటకు కూడా వర్తిస్తుంది. మనం చేసే వ్యాపారంలో మనదే పైచెయ్యిగా ఉండాలి. మనకన్నా ఎవరైనా ఉన్నత స్థానానికి ఎదిగితే, మనం భరించలేము.

**పర ఉత్కర్షం దృష్ట్వా జాయమానః సంతాపః అమర్షః**

అందువల్ల అమర్ష అంటే ఈర్ష్య కూడా వస్తుంది. ఎవరైనా పైకి వస్తుంటే భరించలేము. ఎవరైనా వచ్చి ఫలానావ్యక్తి బాగా వృద్ధిలోకి వచ్చాడంటే మనం భరించలేము. వెంటనే అతనిమీద బురద జల్లుతాము. అతని వ్యక్తిగత జీవితంలోని ఏదో లొసుగుని ఎత్తిచూపుతాము. ఈ ఈర్ష్యను అమర్షః అంటారు.

ఈర్ష్యకు మందు కూడా లేదు. తక్కిన బలహీనతలను తేలికగా తగ్గించుకోగలము కాని, ఈర్ష్యను తగ్గించుకోవటం అంత తేలిక కాదు. ఎవరి ఉన్నతినీ ఉదారంగా ఒప్పుకోలేము. ఒకవేళ ఒప్పుకున్నా, వేరే రంగంలో మెచ్చుకోగలమేమో కాని, మన రంగంలో మనకు ధీటుగా నిలిచిన వ్యక్తిని మెచ్చుకోలేము. దానిమీద ఒక జోక్ కూడా ఉంది.

ఒక వ్యక్తి ఒక డాక్టరు దగ్గరికి వెళ్ళి, 'డాక్టర్, నాకు కడుపునొప్పి చాలా ఎక్కువగా ఉంది. భరించలేకుండా ఉన్నాను. నేను పక్కవీధిలో ఉన్న డాక్టరు రంగారావు దగ్గరకి వెళ్ళాను...' అతని వాక్యం పూర్తి కాకుండానే, ఆ డాక్టరుమీద ఈర్ష్యతో భగ్గున మండే మనస్సు ఉన్న ఈ డాక్టరు 'అతను తెలివి తక్కువ డాక్టరు. నీకు ఏ తెలివి తక్కువ సలహా ఇచ్చాడు?' అన్నాడు. 'మీ దగ్గరకు వెళ్ళమని సలహా ఇచ్చాడు డాక్టర్,' అన్నాడు రోగి.

ఎవరి గొప్ప వారికి ఉంటుంది. అందరూ ఒకే విధంగా ఉండలేరు. అందువల్ల ఎవరిని చూసి ఈర్ష్య పడకూడదు. జ్ఞానికి ఈ ఈర్ష్య ఉండదు. అందరిలోనూ మంచే చూస్తాడు.

**పరగుణపరమాణూన్ పర్వతీకృత్య నిత్యం**

**నిజహృది వికసన్తః సన్తి సన్తః కియన్తః** – నీతి శతకం 79

భర్తృహరి అంటారు, ఉన్నతమైన వ్యక్తులు ఎదుటివారి మంచి లక్షణాలను భూతద్దంలోంచి చూస్తే, వారి లోపాలను చిన్న అద్దంలోంచి చూస్తారు. మన దగ్గర కూడా ఈ రెండు అద్దాలూ ఉన్నాయి కాని చిన్న భేదం ఉంది. మనం చూసే విషయాలలో భేదం ఉంది. మనం వారి తప్పులను భూతద్దంలోంచి చూస్తే, వారి మంచి గుణాలను చిన్న అద్దంలో చూస్తాము. అందువల్ల సంసారం బాధిస్తుంది మనను. జ్ఞాని అమర్షాత్ ముక్తః అంటే ఇటువంటి ఈర్ష్యనుంచి విముక్తి పొందుతాడు.

భయం – ఈ భయం మనను చిన్నప్పటినుంచి వెన్నంటే ఉంటుంది. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు తల్లికొంగు పుచ్చుకుని వదలము, తల్లి అందుబాటులో లేకపోతే, తల్లి చీరెను పక్కన పెట్టుకుని పడుకుంటారు కొందరు పిల్లలు. ఆ భయం పెద్దయ్యాక కూడా కొనసాగుతుంది.

శారీరకంగా మనం నూటికి నూరుశాతం భద్రతలో ఉండలేము. కొంతమంది శరీరం చిన్న తాకిడికి కూడా తట్టుకోలేదు. కాస్త గాలిమార్పు వస్తే చాలు జలుబో, దగ్గో వస్తుంది. శరీరం ఎప్పటికీ ఒక్కలాగే ఉండలేదు, కాలానికి అతీతం కాదు. సైన్సు ఎంతగా విజయం సాధించినా కూడా, శరీరాన్ని శాశ్వతం చెయ్యలేకపోతుంది. ఈ నగ్నసత్యాన్ని గ్రహించలేక, భయపడుతూ ఉంటాము.

భర్తృహరి తన వైరాగ్యశతకంలో ఈ భయాన్ని అద్భుతంగా వర్ణించారు.

**భోగే రోగభయం కులే చ్యుతిభయం విత్తే నృపాలాద్భయం**

**మానే దైన్యభయం బలే రిపుభయం రూపే జరాయాభయమ్**

**శాస్త్రే వాదిభయం గుణే ఖలభయం కాయే కృతాన్తాద్భయం**

**సర్వం వస్తు భయాన్వితం భువి నృణాం వైరాగ్యమేవాభయమ్** – వైరాగ్యశతకం 31

**భోగే రోగభయమ్** – భోగికి ఎప్పుడు రోగంమీదకు వచ్చి పడుతుందో అనే భయం వెంటాడుతూ ఉంటుంది. మనకు ఇష్టమైన సగం ఆహారపదార్థాలు ఆరోగ్యానికి మంచివి కావు. మనకు ఆరోగ్యకరమైనవి కాకరకాయ, అది చేదుగా ఉంటుంది; ఆనపకాయ, దానికి రుచి ఉండదు. మనం తినే ఆహారపదార్థం చక్కెరవ్యాధిని తెస్తుందో, బి.పి.ని తెస్తుందో, దంతాలను బలహీనం చేస్తుందో అనే భయం. ఇప్పుడు ఇరవైనాలుగు గంటలూ టీవీకే అంకితమయిపోతున్నాము; దానివల్ల కంటిచూపు దెబ్బతింటుంది.

**కులే చ్యుతి భయమ్** – మంచి కులానికి చెందితే, పరువు పోతుందేమోననే భయం. మా తండ్రి ఘనపాఠీ, మా తాతగారు జటావల్లభులు; మా ముత్తాతలు అగ్నిహోత్రులు, మాది అంత గొప్ప వంశం అని వెన్ను విరుచుకు తిరిగినా, ఏదోమూల మన పిల్లలు ఎక్కడ మన వంశ పరువు, ప్రతిష్ఠలు తీస్తారో అనే భయం. పిల్లలు ఏ చెడుపనులు చేస్తారో, ఏ కులం అమ్మాయిని పెళ్ళి చేసుకుంటారో, ఎక్కడ వంశప్రతిష్ఠ పోతుందో అనే నిరంతర భయం వేధిస్తుంది అలాంటి వారిని.

దయానంద సరస్వతి స్వామీజీ అంటారు – మనకున్న అత్యంత పెద్ద సమస్య, ఎవరేమనుకుంటారో అనే. పిల్లలు ఏమైనా తప్పు చేస్తే, మనం ఎంత దాచిపెడదామనుకున్నా కూడా, అది గాలికన్నా వేగంగా ప్రయాణిస్తుంది. నలుగురూ దుమ్మెత్తి పోస్తారన్న భయంతో, సమాజానికి దూరంగా తొలగిపోతాము. పెళ్ళిళ్ళు, పేరంటాలకు వెళ్ళము.

**విత్తే నృపాలాద్భయమ్** – ధనం ఎక్కువగా ఉంటే, పన్నులు కట్టాలనే భయం. నృపాలా అంటే రాజు; ఇక్కడ ప్రభుత్వం అనవచ్చు. ప్రభుత్వం కళ్ళు కప్పి టాక్స్ ఎలా ఎగగొట్టాలా అని చూస్తాము.

**మానే దైన్యభయమ్** – పేరు ప్రతిష్ఠలు పొందిన వ్యక్తికి ఎప్పుడు ఎవరే అవమానం చేస్తారో అని భయం. మామూలు వ్యక్తి ఎక్కడికన్నా వెళ్ళి, ఎవరి మధ్యలోనైనా కూర్చోగలడు. కాని పేరుప్రతిష్ఠలు ఉన్న వ్యక్తి ఎక్కడికెళ్ళినా, తనకు రాచమర్యాదలు జరగాలనీ, తనకు పెద్దపీట వెయ్యాలనీ ఆశిస్తాడు. దైన్యం అంటే అవమానం. ఎవరైనా అవమానం చేస్తారేమోననే భయం. అందువల్లనే అటువంటి వారిని బ్లాక్‌మెయిల్ చేస్తుంటారు కొందరు అవకాశవాదులు. వారి పేరు పోతుందనే భయంతో వీరి బెదిరింపులకు లొంగిపోతుంటారు.

**సంభావితస్య చాకీర్తిః మరణాదతిరిచ్యతే** – 2.34

మాన్యుడైన పురుషునికి అపకీర్తి మరణంకంటే బాధాకరమైనది.

**బలే రిపుభయమ్** – బలవంతునికి శత్రువు పక్కలో బల్లెంలాంటివాడు. ఎంత బలవంతుడైన రాజునైనా కూడా శత్రురాజు ఎక్కడ తన రాజ్యంమీద దండెత్తుతాడో అనే భయం వెంటాడుతూనే ఉంటుంది. ఆ భయం రాజుకే కాదు, విజేతలందరికీ ఉంటుంది. తన రంగంలో తాను ప్రథమస్థాయిలో ఉన్నా కూడా, ఎవరు తనను మించిపోతారో అనే భయం వెన్నాడుతూనే ఉంటుంది.

**రూపే జరాయాభయమ్** – అందాన్ని చూసి మిడిసిపడేవారికి ఏమూలో పొంచివున్న వృద్ధాప్యం ఎక్కడ వచ్చి మీద పడుతుందోననే భయం అడుగడుగునా ఉంటుంది. అందానికి ప్రాముఖ్యతనిచ్చేవారు, దానికోసం ఎంతో

వ్యయప్రయాసల కోర్చి, అందానికి మెరుగులు దిద్దుకుంటారు. ఒక్క తెల్లవెంట్రుక కనబడ్డా, మొహంమీద ఒక్క ముడత ఏర్పడినా, నిలువెల్లా ఒణికిపోతారు. ఈ బలహీనతను ఆసరా చేసుకునే నేడు ఎన్నో బ్యూటీపార్లర్లు రాజ్యం ఏలుతున్నాయి. అనేక కృత్రిమ అలంకారాలకోసం వేలకువేలు ఖర్చు పెడుతున్నారు.

**శాస్త్రే వాదిభయమ్** – శాస్త్రం తెలిసిన పండితునికి, ఎవరైనా తనతో వాదించి గెలుస్తారేమోననే భయం వేధిస్తుంది. శాస్త్రం అంటే ఆధ్యాత్మశాస్త్రమే కానవసరం లేదు, ఏ రంగంలో నిష్ణాతులైనవారైనా కావచ్చు. ఎప్పుడు ఎవరు వారిని ఖండిస్తారో అనే భయం ఉంటుంది. ఎవరో వచ్చి కొబ్బరినూనె మంచిది కాదు అంటారు; కొన్నాళ్ళయ్యాక ఇంకొకరు పరిశోధనలు జరిపి కొబ్బరినూనె మంచిది, కాఫీ మంచిది కాదు అంటారు. మరొకరు మరో పరిశోధన జరిపి కాఫీ మంచిది అంటారు. ఏది చెప్పినా, దాన్ని ఖండించేవారు ఎప్పుడో అప్పుడు రానే వస్తారు.

**గుణే ఖలభయమ్** – ధార్మికజీవనం గడిపేవారిని అధార్మిక వ్యక్తులు పరిహాసం చేస్తారేమోననే భయం. ఎవరైనా సాంప్రదాయబద్ధంగా జీవిస్తే వారిని చూసి నవ్వేవారే ఎక్కువ. ముఖ్యంగా పిల్లలు ఈ పరిహాసాన్ని ఎదుర్కొంటుంటారు. వారికి కుంకుమ లేదా విభూతిపెట్టి పంపిస్తే, తోటి విద్యార్థులు వీరిని గేలిచేస్తారు. అందుకని పిల్లలు కూడా బొట్టుపెట్టుకోవటానికి ఇష్టపడరు. అందువల్ల ధార్మికజీవనం గడపాలంటే ఏటికి ఎదురీదటం లాంటిది. ఎవరేమని ఏడిపిస్తారోననే భయం.

**కాయే కృతాన్తాద్భయమ్** – ఇంతకుముందు అందంమీద మక్కువ ఉంటే వృద్ధాప్యం వచ్చిమీద పడుతుందనే భయం వెన్నాడుతుందని చూశాము. ఇప్పుడు శరీరంమీద మోజు ఉన్నవారికి మృత్యుభయం వెన్నాడుతుంది. కృతాన్తా అంటే యమధర్మరాజు. ముందుగా చెప్పి రాడు యమధర్మరాజు. అందువల్ల శరీరం నేను అనుకునేవారికి మృత్యుభయం.

**సర్వంవస్తుభయాన్వితం భువి నృణాం** – ఆ విధంగా ఈ అశాశ్వతమైన ప్రపంచంలో ఏ వస్తువును పట్టుకున్నా కూడా అది భయాన్నే కలుగజేస్తుంది గాని, అభయాన్నివ్వదు. మరి ఏది అభయాన్ని ఇస్తుంది?

**<u>వైరాగ్యమేవాభయమ్</u>** – <u>వైరాగ్యం</u> ఒక్కటే అభయాన్ని ఇస్తుంది. మీమీద మీరు ఆధారపడటం నేర్చుకోవాలి. మీమీద మీరు ఆధారపడటం అంటే బాహ్యప్రపంచాన్ని పూర్తిగా త్రోసిపుచ్చనవసరం లేదు; బాహ్యప్రపంచాన్ని అనుభవించండి; చూసి ఆనందించండి; కాని దానిమీద ఆధారపడకండి.

అంతకుముందు కూడా ఈ ఉదాహరణ చూశాము. చేతికర్రను సరదాగా పట్టుకునేది కొందరైతే, దానిమీద ఆధారపడి నడిచేవారు మరికొందరు. సరదాగా పట్టుకునేవారు కర్ర పడిపోయినా, విరిగిపోయినా బాధపడరు. కాని దానిమీద ఆధారపడి నడిచేవారు కర్ర లేకపోతే వారు కూడా పడిపోతారు. ఇదే సూత్రం వస్తువులకు, మనుష్యులకు కూడా వర్తిస్తుంది. బాహ్యప్రపంచాన్ని మీరు సరదాగా పట్టుకున్నారా, దానిమీద ఆధారపడ్డారా? ఎలా తెలుస్తుంది ఈ రెండింటి మధ్య భేదం? బాహ్యప్రపంచాన్ని సరదాగా పట్టుకుంటే భయం ఉండదు. దానిమీద ఆధారపడితే భయం అనివార్యం. జ్ఞాని బాహ్యప్రపంచంమీద ఆధారపడడు.

గీతాశ్లోకంలో తరువాత పదానికి వెళదాము.

ఉద్వేగః – ఉద్వేగం అంటే మానసిక అలజడి. అమర్షం లేదా భయంవల్ల కలిగే ఆందోళన, దుఃఖంలాంటి మానసిక అలజడి. జ్ఞానికి ఈ ఉద్వేగం ఉండదు. అతను పరాభక్తుడు లేదా అద్వైతభక్తుడు.

జ్ఞాని ఈ లక్షణాలను ఎలా పొందాడో కృష్ణపరమాత్మ ఇక్కడ చెప్పడు. ఈ లక్షణాలను కాలక్రమేణా పొందుతాడు జ్ఞాని. మనం ఏడవ అధ్యాయంలో చూశాము. ఒక సాధకుని ప్రయాణం క్రమంగా ప్రపంచంమీద ఆధారపడే స్థాయినుంచి, భగవంతునిమీద ఆధారపడే స్థాయికి ఎదిగి, భగవంతునిమీద ఆధారపడే స్థాయినుంచి తనమీద తనే ఆధారపడే స్థాయికి ఎదగటం. తనమీద ఆధారపడటమంటే చైతన్యపరంగా తనూ, భగవంతుడూ ఒక్కటే అనే ఐక్యజ్ఞానం పొందటం. అప్పుడు భగవంతునిమీద ఆధారపడటం తనమీద ఆధారపడటంగా మారుతుంది.

**ముక్తో యస్స చ మే ప్రియః** – అటువంటి జ్ఞాని ముక్తుడు అవుతాడు. అటువంటి వ్యక్తి నాకు ప్రియమైనవాడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 16 **అనపేక్షః శచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః ।**
**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥**
అనపేక్షః, శుచిః, దక్షః, ఉదాసీనః, గతవ్యథః,
సర్వారంభపరిత్యాగీ, యః, మద్భక్తః, సః, మే, ప్రియః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఏ పురుషుడు | సః | = అట్టి |
| అనపేక్షః | = ఆపేక్ష లేనివాడో | సర్వారంభ | = సమస్త కర్మలయందును |
| శుచిః | = బాహ్యాభ్యంతరములయందు శుచియైనవాడో | పరిత్యాగీ | = కర్తృత్వ అభిమానము లేనివాడైన |
| దక్షః | = నిపుణుడో | మద్భక్తః | = నా భక్తుడు |
| ఉదాసీనః | = పక్షపాతరహితుడో | మే | = నాకు |
| గతవ్యథః | = దుఃఖములనుండి ముక్తుడో | ప్రియః | = ఇష్టుడు |

**యః మత్–భక్తః అనపేక్షః, శుచిః దక్షః, ఉదాసీనః,**
**గత–వ్యథః, సర్వ–ఆరమ్భ–పరిత్యాగీ, సః మే ప్రియః ।**

తా: ఏ పురుషుడు ఆపేక్ష లేనివాడో, బాహ్యాభ్యంతరములయందు శుచియైనవాడో, నిపుణుడో, పక్షపాతరహితుడో, దుఃఖములనుండి ముక్తుడో అట్టి సమస్త కర్మలయందును కర్తృత్వ అభిమానము లేనివాడైన నా భక్తుడు నాకు ఇష్టుడు.

ఎవరైతే దేని గురించీ బాహ్యవస్తువులమీద ఆధారపడరో, వారు వాటినుంచి దేనినీ ఆశించరు. ఎప్పుడు ఆధారపడతారో, అప్పుడే వాటినుంచి ఏదైనా ఆశించటం జరుగుతుంది. ఏమీ ఆశించటం లేదంటే ఆశాభంగం

కూడా ఉండదు. అంటే ఏదైనా ఆశించి అది పొందకపోతే ఆశాభంగం కలుగుతుంది. ఆశే లేకపోతే ఆశాభంగానికి చోటేది? వస్తువులనుంచే కాదు, మనుష్యులనుంచి కూడా కొన్ని ఆశిస్తారు. పిల్లలకు 99.99% మార్కులు అన్ని సబ్జెక్టులలోనూ రావాలి అనుకుంటారు. అది సాధ్యమా? ఒకవేళ వచ్చినా కూడా అన్నిట్లో రాదు. అందువల్ల శాస్త్రం ఏదీ ఆశించవద్దు అంటుంది. ఇది మొదటిదశ.

ఏదైనా ఆశించి తీరాలంటే, బంధించే ఆశ పెట్టుకోవద్దు అంటుంది శాస్త్రం. అంటే ఏదైనా కోరి అది తీరితే మంచిదే కాని, అది కుదరకపోతే నిరాశ చెందవద్దు అంటుంది. ఆగతే స్వాగతం కుర్యాత్ – ఏదైనా వస్తే సంతోషమే, దాన్ని స్వీకరించు; కాని రాకపోతే బాధపడవద్దు. అంటే మంచి ఆశించాలి, విషమపరిస్థితికి సంసిద్ధులై ఉండాలి. ఏదైనా ఆశించనిది జరిగితే, 'ఏమిటి?' స్థితినుంచి 'అయితే ఏమిటి?' స్థితికి ఎదగాలి. అంటే మనకు ఆశాభంగం ఉండకూడదు అనికాదు అర్థం; ఆశాభంగం కలగటం తప్పనిసరి, కాని దాన్నించి బయటపడగలగటం ఆంతర్గతశక్తి.

ఎన్) **అనపేక్షః** – ఆపేక్ష లేని వ్యక్తి అంటే ఏదీ ఆశించని వ్యక్తి. బంధించే ఆశలు లేనివ్యక్తి.

ఓ) **శుచిః** – బాహ్యంగానూ, అంతర్గతంగానూ శుచిగా ఉన్న వ్యక్తి. జ్ఞాని ఏదీ పట్టించుకోనవసరం లేదు అనుకోకూడదు. జ్ఞాని బాహ్యంగానూ, అంతర్గతంగానూ శుచిగా ఉండాలి. బాహ్యంగా అంటే తను ఉండే పరిసరాలు, తన వేషధారణ వస్త్రాయి. అంతర్గతశుచి అంటే ఆలోచనలు కూడా ధార్మికంగా ఉండాలి.

పీ) **దక్షః** – దక్షః అంటే ఎటువంటి పరిస్థితి ఎదురైనా కూడా సమర్థవంతంగా పనిచేసేవాడు.

సాధారణంగా మనుష్యులు రెండు రకాలుగా ప్రవర్తించే అవకాశం ఉంది. ఒక రకం మనుష్యులు ఏదైనా సమస్య ఎదురైతేనో, లేదా ఎవరైనా ఏదైనా అంటేనో రెచ్చిపోయి ఆవేశంగా ఎదుటివారిని తిట్టటమో లేదా దూకుడుగా ఏదైనా చెయ్యటమో చేస్తారు. అలా ఆలోచించకుండా, అసంకల్పితంగా చేసే పని, సాధారణంగా తప్పుగానో, అన్యాయంగానో ఉంటుంది. ఎందుకంటే అలా అసంకల్పిత ప్రతీకారచర్యలో విచక్షణాశక్తిని కోల్పోతారు. ఇటువంటి చర్యను ప్రతిస్పందన అంటారు. ఈ ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుంది.

ఇంకొక రకం మనుష్యులు ఉంటారు. వారు అసలేమీ స్పందన చూపించరు. ఏ సమస్య ఎదురైనా దాన్ని నిస్సహాయంగా భరిస్తారు. ఎవరేమన్నా ఎదురు చెప్పరు. దానికి వారు చెప్పుకునే పేరు మంచితనం, దయ. ఈ మంచితనం పేరుతో, ఎదుటివారు చూపే అన్యాయాన్ని నిశ్శబ్దంగా భరిస్తారు.

అంటే రెండు రకాల స్పందనలు. మొదటిరకంలో తీవ్రంగా స్పందిస్తే, రెండవరకంలో అసలు ఏ స్పందనా చూపకపోవటం. ఒకటి స్పందన, ఇంకొకటి అలక్ష్యం. వేదాంతం రెండూ తప్పే అంటుంది. ఎవరైనా అనవసరంగా మనను హింసిస్తే, మనం నోరు మూసుకుని భరించనవసరం లేదు. అలాగని ఎదురుతిరిగి వారి ముక్కుమీద గుద్దకూడదు.

వారు ఎందుకు అలా చేశారు, కారణం ఏమిటి అని తెలుసుకోవాలి. హత్య చేసిన నేరస్థునికి కూడా న్యాయస్థానంలో తన కారణం చెప్పుకునే అవకాశం ఉంది. హంతకుడని వెంటనే తీర్మానించదు న్యాయస్థానం.

అలాగే, మనకు అధికారం ఉన్నంత మాత్రాన ఎదుటివ్యక్తిని శిక్షించకూడదు. అతని గురించిన నిజానిజాలను తెలుసుకోవాలి

అహింస చూపాలి నిజమే; కాని అహింసను కూడా అనవసరంగా చూపకూడదు. దుర్యోధనుడు నేరం చేస్తే అతన్ని శిక్షించాలి. దుర్యోధనుణ్ణి కూడా వెంటనే శిక్షించబోవటం లేదు. సామదానభేదమార్గాలన్నీ ఉపయోగించి చూశారు. అవేవీ ఫలించనందువల్ల యుద్ధానికి దిగారు. అందువల్ల దండన తప్పని పరిస్థితిలో దండించి తీరాలి.

దక్షత్వం అంటే అసంకల్పితంగా స్పందించకుండా, ఆలోచించి, సరియైన నిర్ణయం తీసుకోగలగటం. శంకరాచార్యులవారు దక్షః పదానికి ప్రత్యుత్పన్నమతి అని అర్థం చెబుతారు. అంటే రాగద్వేషాలకు లోనుకాకుండా, ఎటువంటి పరిస్థితిలోనైనా ఆలోచించి సరియైన నిర్ణయం తీసుకోవటం. రాగద్వేషాలకు అతీతమైన మనస్సును దక్షత్వం అంటారు.

క్యూ) **ఉదాసీనః** – ఉదాసీనుడు పదాన్ని అక్షరాలా తీసుకుంటే ఏమీ పట్టించుకోని వ్యక్తి అని అర్థం వస్తుంది. అది వ్యతిరేక అర్థాన్ని ఇస్తుంది. ఉదాసీనుడు అంటే పక్షపాతవైఖరి లేని వ్యక్తి అని అర్థం. రెండు భిన్న పార్టీలు ఉంటే ఒక పార్టీని మెచ్చుకుని, ఇంకొక పార్టీని విమర్శించడు. జ్ఞాని ఏ పార్టీకి చెందడు. రెండింటినీ సమానంగా చూస్తాడు. వారు కూడా ఇతణ్ణి గౌరవిస్తారు.

ఆర్) **గతవ్యథః** – దుఃఖాలనుంచి ముక్తి చెందినవాడు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా చెక్కుచెదరని వ్యక్తి. జరిగే అనుభవాలమీద తనకు అధికారం లేదని గ్రహిస్తాడు జ్ఞాని. ఎంత గొప్ప జ్ఞాని కూడా పరిస్థితులను తాను అదుపులో పెట్టలేడు. ఎందుకంటే ఆ అనుభవాలు దేశ, కాల, ప్రారబ్ధాలమీద ఆధారపడి ఉంటాయి. చలికాలంలో విపరీతమైన చలి; ఎండాకాలంలో తీవ్రమైన వేడి; వానాకాలంలో హోరున కురిసే వాన – ఇవేవీ తప్పవు. ఎవరూ వీటిని ఆపలేరు. ఇది దేశకాలాలమీద ఆధారపడి వస్తాయి.

ఇవికాక మూడవ అంశం ప్రారబ్ధం. జ్ఞాని జీవితం కూడా ప్రారబ్ధకర్మకు అతీతమేమీ కాదు. అతనికి కూడా ప్రారబ్ధకర్మ అనుకూలమైన పరిస్థితులనూ, ప్రతికూలమైన పరిస్థితులనూ తీసుకువస్తుంది. జ్ఞానం పొందితే పరిస్థితులన్నీ మనకు అనుకూలంగా మారిపోతాయనుకోకూడదు. జ్ఞానికి పరిస్థితులు అతనికి అనుకూలంగా మారతాయనేది పెద్ద అపోహ. శాస్త్రం పరిస్థితులను మార్చదు కాని, ఎటువంటి పరిస్థితి ఎదురైనా తట్టుకునే గుండె ధైర్యాన్ని ఇస్తుంది. అందువల్ల మార్పు బాహ్యంగా కాదు, అంతర్గతంగా వస్తుంది. అంటే మన దృక్పథంలో మార్పు వస్తుంది.

ఏమిటా మార్పు? భగవంతుడు మనకిచ్చే ఏ అనుభవమైనా కూడా మన ఆధ్యాత్మిక ఎదుగుదలకు తోడ్పడుతుంది – ఇది ప్రకృతి సూత్రం. మనందరికీ అంతిమలక్ష్యం ఆధ్యాత్మిక ఎదుగుదలగా ఉండాలి. అలా ఎదగటానికి అనేక పరిస్థితులు దోహదం చేస్తాయి. ఒకసారి ఆరోగ్యం, మరొకసారి అనారోగ్యం; కుటుంబంలో కొత్త జీవి రావటం, కుటుంబంలో ఒక వ్యక్తి నిష్క్రమించటం. వీటన్నిటినీ మనకు కలగజేసేది సర్వజ్ఞుడు, సర్వశక్తివంతుడు అయిన ఈశ్వరుడు.

ఈశ్వరుడు ఎన్నడూ అన్యాయం చెయ్యడు; మనకు అవి అన్యాయంగా కనిపిస్తాయి అంతే. మన జ్ఞానం పరిమితి ఉన్న జ్ఞానం. మనం సర్వజ్ఞులం కాము. భగవంతుని జ్ఞానాన్ని ప్రశ్నించటానికి మన మేధస్సు ఎంత? ఏదైనా అనుభవం కలిగితే అది మంచిది, చెడ్డది అనే అధికారం మనకెక్కడిది? అందువల్ల భగవంతుడు ఏ అనుభవాన్ని కలగజేసినా, దాన్నించి ఒక పాఠం నేర్చుకోవాలి.

ఎందుకు మనష్యులు ఇలా ప్రవర్తిస్తున్నారు? ఎందుకు అతను చిన్నవయస్సులో మరణించాడు? ఎందుకు దొంగతనం జరిగింది? ఎందుకు నా అన్నవారు నన్ను వదిలి వెళ్ళిపోయారు? ఇలా ఎందుకు, ఎందుకు ప్రశ్నలు మనను వేధించకూడదు. ఈ అనుభవాలనుంచి మనం నేర్చుకునే పాఠం ఏమిటి? ఇదొక్కటే వేసుకోవాలి మనం. ఎంత దారుణమైన పరిస్థితి ఎదురైనా, దాన్నించి ఏం నేర్చుకోవాలో చూడాలి మనం. నిజానికి అలా చూడగలిగితే, చాలా క్లిష్టపరిస్థితులు జీవితంలో గొప్ప పాఠాలను నేర్పిస్తాయి.

నిజానికి అర్జునునికి జరిగింది కూడా అదే. తనకు భగవద్గీత బోధ కావాలని ఎప్పుడనుకున్నాడు? తన వారిని తను చంపాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు. విషాదంనుంచి వచ్చింది విజ్ఞానం. అందువల్లనే మొదటి అధ్యాయాన్ని **అర్జున విషాదయోగము** అన్నారు. ఎందుకు కర్మయోగం, భక్తియోగంలాగా విషాదాన్ని కూడా విషాదయోగం అన్నారు? విషాదం కూడా ఒక ఆధ్యాత్మిక సాధనే, నేర్చుకోవాలే కాని, విషాదం కూడా పాఠాన్ని నేర్పిస్తుంది. అందువల్ల జ్ఞానికి ఏ అనుభవం కూడా పొందకూడని అనుభవం కాదు. అతను రెండుచేతులా అన్ని అనుభవాలనూ ఆస్వాదిస్తాడు.

గతవ్యథః అంటే 'నాకే ఎందుకు?' అనే ప్రతికూల ఆలోచన ఉండదు. అందరూ అనుభవించేస్తున్నారు, నేనే బాధపడిపోతున్నాను అనుకుంటారు చాలామంది. నిజానికి అనుభవించేస్తున్నారు అనుకుంటున్న వారి దగ్గరికి వెళ్ళి వారి వ్యక్తిగత విషయాలు వింటే, వీరు అనుకుంటున్నట్టుగా వారేం ఆనందంలో మునిగి తేలటం లేదు. రామాయణ, మహాభారతాల్లో కూడా ఎన్నో కష్టాలు, దుఃఖాలు చూశాము. కాని ఒక చిన్న జ్వరం రాగానే బెంబేలెత్తిపోయి, 'నాకే ఎందుకు?' అని వాపోతారు. జ్ఞాని అలా బాధపడడు.

ఎస్) **సర్వారంభపరిత్యాగీ** – జ్ఞాని బంధించే కర్మలను పరిత్యజిస్తాడు. బంధించే కర్మలు అంటే ఏమిటి? ఈ కర్మ చేస్తే నేను విజయవంతుణ్ణి అవుతాను; ఈ కర్మ చేస్తే నేను పూర్ణత్వం పొందుతాను అనుకోవటం. ఏ కర్మ కూడా పూర్ణత్వాన్ని ఇవ్వలేదు. ఎందుకు? ఈ విషయాన్ని మనం అనేకసార్లు చూశాము.

**అపూర్ణం + అపూర్ణం = అపూర్ణం**

ఒక కర్మఫలం పొందితే పూర్ణత్వం రాదు; మళ్ళీ ఇంకొకటి కోరతాము.

**కృతి మహోదధౌ పతనకారణం, ఫలమశాశ్వతం గతినిరోధకమ్** – ఉపదేశసారం 2

ఈ పని చేస్తే పూర్ణత్వం వస్తుంది, ఆ పని చేస్తే పూర్ణత్వం వస్తుందనుకుని పనులు చేసుకుంటూ పోతాము. ఆ వృత్తంలో పడి తిరుగుతూనే ఉంటాము. దానివల్ల జీవితం బాధాకరమవుతుంది. జ్ఞానికి ఈ విషయం తెలుసు. అజ్ఞాని పూర్ణత్వంకోసం పనిచేస్తే, జ్ఞాని పూర్ణత్వంతో పనిచేస్తాడు. అదీ వీరిద్దరి మధ్య భేదం.

జ్ఞాని తాను పూర్ణుడను అనుకుని పనిచేస్తాడు కాబట్టి, ఆ పనివల్ల విజయం కలిగినా పొంగిపోడు; ఓటమి ఎదురైనా కృంగిపోడు. పూర్ణత్వం అతని జీవనవిధానం అవుతుంది; అది అతని అంతిమలక్ష్యం అవదు. పూర్ణత్వాన్ని గమ్యం అనుకుంటే జీవితం బాధాకరంగా ఉంటుంది; పూర్ణత్వాన్ని జీవనవిధానం అనుకుంటే జీవితం లీలగా మారుతుంది. జ్ఞాని అలా ఏంచేసినా లీలగా చేస్తాడు.

**మద్భక్తస్స మే ప్రియః** – అటువంటి జ్ఞాని నాకు ప్రియమైన వ్యక్తి.

శ్లో. 17 **యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః ॥**
యః, న, హృష్యతి, న, ద్వేష్టి, న, శోచతి, న, కాంక్షతి,
శుభాశుభపరిత్యాగీ, భక్తిమాన్, యః, సః, మే, ప్రియః ॥

| | | | |
|---|---|---|---|
| యః | = ఎవడు | శుభాశుభ | = శుభాశుభకర్మలను |
| న, హృష్యతి | = ఇష్టప్రాప్తికి పొంగిపోడో | పరిత్యాగీ | = పరిత్యజించినవాడో |
| న, ద్వేష్టి | = దేనినిగూడ ద్వేషింపడో | సః | = అటువంటి |
| న, శోచతి | = దేనికినీ విచారపడడో | భక్తిమాన్ | = భక్తుడు |
| న, కాంక్షతి | = దేనినీ కోరడో, అలాగే | మే | = నాకు |
| యః | = ఎవడైతే | ప్రియః | = ప్రియమైనవాడు |

**యః న హృష్యతి, న ద్వేష్టి, న శోచతి, నా కాఙ్క్షతి,**
**యః శుభ–అశుభ–పరిత్యాగీ, భక్తిమాన్ (అస్తి), సః మే ప్రియః (భవతి) ।**

తా: ఎవడు ఇష్టప్రాప్తికి పొంగిపోడో, దేనినిగూడ ద్వేషింపడో, దేనికినీ విచారపడడో, దేనినీ కోరడో, అలాగే ఎవడైతే శుభాశుభకర్మలను పరిత్యజించినవాడో అటువంటి భక్తుడు నాకు ప్రియమైనవాడు.

పరిస్థితులకు రెండు విపరీత ధోరణులు చూస్తుంటాము. కాని జ్ఞాని రెండూ చూపించడు.

టి) **ద్వంద్వాతీతుడు – న హృష్యతి న శోచతి** – జ్ఞాని దేనికీ పొంగిపోడు, దేనికీ కృంగిపోడు. ఆశించినది దొరికితే ఆనందించటం సహజం. అలాగే అనుకోని పరిస్థితి ఎదురైతే కృంగిపోతాము. అదీ సహజమే కాని కృష్ణపరమాత్మ ఈ రెండూ కూడా మన విచక్షణాశక్తిని కోల్పోయేటంత ఎక్కువగా ఉండకూడదు అంటాడు. మనం గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. ఎటువంటి పరిస్థితి ఎదురైనా కూడా మన బుద్ధి పదునుగా ఉండాలి. మనిషిగా మనకున్న గొప్ప ఆస్తి ఈ వివేకశక్తి. అందువల్లనే శంకరాచార్యులవారు దీన్ని వివేక చూడామణి అన్నారు. రాగద్వేషాలు ఉండటం మనిషికి సహజమే, దాని వలన భావోద్రేకాలు కలగటమూ సహజమే, కాని వివేకశక్తిని కప్పివేసేటంత ఉద్రేకానికి లోనుకాకూడదు.

రాముని పట్టాభిషేకం నిశ్చయించాక, కొంత సేపటికే రాముడు అడవులకు వెళ్ళాలి అన్నాడు దశరథ మహారాజు. రాముడు శాంతంగానే ఉన్నాడు; కాని లక్ష్మణునికి చాలా కోపం వచ్చింది.

అలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు మన కోపం మన వివేకబుద్ధిని కప్పేస్తుంది. అలా కప్పకుండా చూసుకోవాలి. కనీసం కోపం వివేకబుద్ధిని కప్పేయబోతున్నదని గ్రహించి, మండుతున్న అగ్నిలాగా ఎగసిపడకుండా, మౌనం వహించాలి. ఇప్పుడేమీ మాట్లాడను అనాలి. ఒకవేళ నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అప్పుడు ఏమీ నిర్ణయం తీసుకోకూడదు. దీన్ని మానసిక శాస్త్రవేత్తలు ఇన్నర్‌స్పేస్ అంటారు. ఇన్నర్‌స్పేస్ అంటే మనస్సు అదుపు తప్పుతోంది అని తెలుసుకోగలిగే విచక్షణ ఉండటం.

మీరు కారు నడుపుతుండగా, కళ్ళు తిరుగుతున్నట్టు అనిపిస్తే, అలాంటి సమయంలో కారు నడపటం చాలా ప్రమాదకరం. వెంటనే కారును రోడ్డుకు ఒక పక్కకు తీసుకువెళ్ళి ఆపాలి. కాని నడుపుతున్న కారును ఒక పక్కకు తీసుకువెళ్ళి ఆపే సమయం ఉండాలి. అంటే ముందుకు సాగే శక్తి లేదు కాని, పక్కకు తీసుకు వెళ్ళటానికి కావాల్సిన ఒకటి రెండు నిముషాల సమయం ఉంటుంది.

అలాగే జీవితమనే కారును నడుపుతున్నప్పుడు కూడా మనస్సు కోపంతో మండిపడుతోందని అనిపిస్తే, వెంటనే మండిపడకుండా, కారును పక్కకు ఆపినట్టుగా, కొంత సమయం తీసుకోండి. కోపం రాగానే ఫోను చేసి తిట్టటమో, కోపంగా ఈమెయిల్ రాయటమో చెయ్యకుండా, కాసేపు మౌనం వహించండి. మీ మనస్సు మీ అదుపులో ఉండాలి. మీరే దానికి యజమాని. అందువల్ల భావోద్రేకాలు రాకూడదు అనదు శాస్త్రం, కాని వచ్చినప్పుడు దాన్ని గ్రహించి, రెండడుగులు వెనకకు వెయ్యాలి అంటుంది. అందువల్ల జ్ఞాని పొంగిపోడు, కృంగిపోడు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**న ద్వేష్టి న కాంక్షతి** – అలాగే జ్ఞాని దేన్నీ ద్వేషించడు, దేనినీ కోరడు. ద్వేష్టి అంటే ద్వేషం, కాంక్ష అంటే రాగం. జ్ఞానికి కట్టిపడేసే రాగద్వేషాలు ఉండవు అంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే జ్ఞాని ఏమీ కోరడు.

ఈ మాటను కూడా సరిగ్గా అర్థం చేసుకోవాలి. జ్ఞాని ఏమీ కోరడు అంటే అసలు కోరికలు ఉండవని కాదు అర్థం. పిల్లలు వృద్ధిలోకి రావాలని, వ్యాపారంలో విజయం సాధించాలని ఎవరికైనా కోరికగా ఉంటుంది.

**ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ** – 3.34

రాగద్వేషాలు ఉండటం చాలా సహజం. అది బఫే భోజనానికి వచ్చినవారిని చూస్తే అర్థమవుతుంది. వారివారి రాగద్వేషాలను బట్టి ఆహారాన్ని ఎన్నుకుంటారు. కొందరు ముందే స్వీట్ దగ్గరికి వెళితే, కొందరు చపాతీల దగ్గరకు వెళతారు. కొందరు ముందువారికి నచ్చిన కూర తింటే, మరికొందరు ఏ పలావో వేసుకుంటారు.

దేవతలకు కూడా ఇష్టాయిష్టాలు ఉంటాయి.

**పాయసాన్నప్రియా త్వక్స్థా పశులోక భయంకరీ** – లలితా సహస్రనామం

అమ్మవారికి పాయసాన్నం అంటే ఇష్టం అని వస్తుంది లలితా సహస్రనామంలో. వేదాంతం ఒక్కటే చెపుతుంది. రాగద్వేషాలు ఉండనివ్వండి, కాని కోరినది తీరితే మితిమీరిన ఆనందం, తీరకపోతే మితిమీరిన దుఃఖం పొందకండి. మీరు భవిష్యత్తుకోసం పాటుపడగలరు; భవిష్యత్తుకోసం ప్రణాళికలు వెయ్యగలరు. అంతే కాని

భవిష్యత్తును అదుపులో పెట్టలేరు. అందువల్లనే ఈ సామెత – మంచిని ఆశించు, చెడు ఎదురైనా సంసిద్ధుడవు కమ్ము. ఇటువంటి షాక్ అబ్సార్బర్‌ను అలవరచుకుంటాడు జ్ఞాని. దీన్నే న ద్వేష్టి న కాంక్షతి అన్నాడు కృష్ణపరమాత్మ.

**శుభాశుభపరిత్యాగీ** – పుణ్యపాపాలకు అతీతంగా ఎదుగుతాడు. శుభం అంటే పుణ్యం; అశుభం అంటే పాపం. వేదాంతం ప్రకారం పుణ్యం కూడా బంధమే. పుణ్యం స్వర్గలోక ఫలాలను ఇస్తుంది, నిజమే కాని కృష్ణపరమాత్మే చెప్పాడు స్వయంగా –

**తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి** – 9.21

పుణ్యం క్షయమవగానే మళ్ళీ మనుష్యలోకంలోకి వస్తాడు. పుణ్యం కూడా శాశ్వతఫలాన్ని ఇవ్వదు కాబట్టి, అది కూడా బంధమే. పుణ్యం బంగారు సంకెళ్ళలాంటిది అయితే, పాపం ఇనుపసంకెళ్ళలాంటిది. రాచవంశంలో నేరం చేసినివారి తలను బంగారు కత్తితో నరుకుతారని అంటారు. శిక్ష అంటూ పడ్డాక బంగారు కత్తి వాడినా, వేరే కత్తి వాడినా భేదం ఏముంది? అందువల్ల పుణ్యం చిరునవ్వులు చిందించే శత్రువు అయితే, పాపం ఉరిమి చూసే శత్రువు. ఏ రాయి అయితేనేం పళ్ళూడటానికి అని సామెత.

అంతమాత్రాన జ్ఞాని పుణ్యకర్మలు చెయ్యడని కాదు అర్థం. కాని పుణ్యకర్మలను పుణ్యం సంపాదించటానికి కాక, చిత్తశుద్ధి పొందటానికి లేదా జ్ఞాననిష్ఠలో ఉండటానికి చేస్తాడు. ఒకే మంచికర్మను పుణ్యం పొందటానికి చెయ్యవచ్చు లేదా చిత్తశుద్ధి పొందటానికి చెయ్యవచ్చు.

**భక్తిమాన్ యస్స మే ప్రియః** – అటువంటి భక్తుడు నాకు ప్రియమైన వ్యక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 18 **సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః ॥**
సమః, శత్రౌ, చ, మిత్రే, చ, తథా, మానావమానయోః,
శీతోష్ణసుఖదుఃఖేషు, సమః, సంగవివర్జితః ॥

| | | | |
|---|---|---|---|
| శత్రౌ, మిత్రే, చ | = శత్రువులయందును, మిత్రులయందును | శీతోష్ణసుఖదుఃఖేషు | = శీతోష్ణములయందును, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములందును |
| మానావమానయోః | = మానమూ అవమానముల యందును | సమః | = సమభావము కలిగి యుండువాడును |
| సమః | = సమభావముగలవాడును | చ | = ఇంకా |
| తథా | = అలాగే | సంగవివర్జితః | = ఆసక్తి రహితుడును |

**సమః శత్రౌ చ మిత్రే చ తథా మాన–అవమానయోః**
**శీత–ఉష్ణ–సుఖ–దుఃఖేషు సమః సఙ్గ–వివర్జితః ।**

తా: శత్రువులయందును, మిత్రులయందును, మానవమానములయందు సమభావము గలవాడును, అలాగే శీతోష్ణములయందును, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములందును సమభావము కలిగి యుండువాడును ఇంకా ఆసక్తి రహితుడును.

**శత్రౌ మిత్రే చ సమః** – శత్రువును, మిత్రుణ్ణి కూడా సమభావంతో చూస్తాడు జ్ఞాని. జ్ఞానికి నిజానికి శత్రువు ఉండడు. అందువల్లనే ధర్మరాజును అజాతశత్రువు అంటారు.

**న జాతః శత్రుః యస్య సః అజాతశత్రుః**

శత్రువులు లేని వ్యక్తి అజాతశత్రువు. అందువల్ల జ్ఞాని పరంగా చూస్తే అతనికి శత్రువులు అంటూ ఎవరూ ఉండరు. కృష్ణపరమాత్మ దుర్యోధనుణ్ణి శత్రువుగా భావించడు; కాని దుర్యోధనునికి కృష్ణపరమాత్మ శత్రువు. ఆ విధంగా కొంతమంది జ్ఞానిని ఇష్టపడి, అతనికి మంచి చెయ్యటానికి ప్రయత్నిస్తే, కొంతమంది జ్ఞానిని ద్వేషించి చెడు చెయ్యటానికి ప్రయత్నించవచ్చు. కాని వారెలా ప్రవర్తించినా జ్ఞాని ఇద్దరినీ సమభావనతో చూస్తాడు.

జ్ఞాని వారిమీద సమత్వం పెంచుకుంటాడు అంటే తనకు చెడు చెయ్యటానికి ప్రయత్నించే వ్యక్తిని ద్వేషించడు; మంచి చేసే వ్యక్తిమీద రాగం చూపించడు. **సమత్వం నామ రాగద్వేషవర్జితత్త్వమ్**

అంటే శత్రువు ఏంచేసినా జ్ఞాని మౌనంగా భరిస్తాడా? ఈ విషయం జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి. జ్ఞానికి శత్రువుమీద ద్వేషం ఉండదంటే అతను ఏంచేసినా మౌనంగా భరిస్తాడని కాదు అర్థం. అతన్ని తిట్టాల్సివస్తే తిడతాడు; అతనిమీద ఏదైనా క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సి వస్తే తీసుకుంటాడు; కాకపోతే ఆ చర్య తీసుకునేటప్పుడు జ్ఞానిలో ఇసుమంతైనా ద్వేషం ఉండదు. ఎదుటివ్యక్తిని శిక్షించేది, అతణ్ణి బాధపెట్టటానికి కాదు; అతణ్ణి తీర్చిదిద్దటానికి. నిజానికి అతనిమీద కఠినచర్య తీసుకోవాల్సి వస్తే జ్ఞాని చాలా బాధపడతాడు.

తల్లి మనస్తత్త్వమే ఉంటుంది జ్ఞానికి కూడా. తల్లి తన పిల్లలను తీవ్రంగా దండించినా, ఏదైనా శిక్ష విధించినా, వారిమీద ద్వేషభావన ఉండదు. మనస్సులో వారిమీద ప్రేమ చెక్కు చెదరదు. అందువల్ల దయాగుణం చూపించటమంటే ఎదుటివారి చెడు పనులను మారుమాట్లాడకుండా స్వీకరించటం కాదు. దయాగుణం అంటే వారిని దండించాల్సిన చోట దండించటం. జ్ఞాని అలా వారిని దయాగుణంతో దండిస్తాడు.

భగవంతుడు అసురులను సంహరించినప్పుడు, వారికి మోక్షాన్నిచ్చాడు అంటారు కాని వారిని వధించాడు అనరు. ఎందుకు? మోక్షం అంటే వారిని శిక్షించటంద్వారా భగవంతుడు వారిలో ఉన్న అశుద్ధాన్ని ప్రక్షాళిస్తున్నాడు అని అర్థం. మోక్షం అంటే వేదాంతంలో నేర్చుకునే జీవన్ముక్తి, ఆ తర్వాత వచ్చే విదేహముక్తి కాదు. పూతనకు మోక్షం కలిగించాడంటే పాపప్రక్షాళన చేశాడు. అది కూడా ప్రేమతో చేశాడు కాని ద్వేషంతో కాదు.

**తథా మానావమానయోః** – గౌరవం పొందినా, అవమానం పొందినా చలించడు. ఎక్కడ గౌరవం ఉంటుందో, దాన్ని వెన్నంటే అగౌరవం కూడా ఉంటుంది. మామూలు వ్యక్తిని ఎవరన్నా నిందించినా అంతగా చలించడు. కాని మనిషి ఉన్నతస్థాయికి ఎదిగిన కొద్దీ, మాటలతో కిందికి లాగాలని చూసేవారు ఎక్కువగా ఉంటారు.

గౌరవం పొందటం, అవమానం పాలు కావటం ఈ రెండూ మీ చేతిలో లేవు. మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా ఇది నగ్నసత్యం. ఎవరు ఎప్పుడు ఆకాశానికి ఎత్తుతారో తెలియదు, ఎవరు ఎప్పుడు అవమానిస్తారో తెలియదు.

ఈ నీలాపనిందలు అవతారమూర్తులకే తప్పలేదు. రాముడు, సీత, కృష్ణుడు – అందరూ నీలాపనిందలు పడ్డారు. అందువల్ల వాటిని తప్పించుకోలేము. మన జాతకంలో కూడా రాజ్యపూజ్యం ఇంత, అవమానం ఇంత అని వస్తుంది. ఒకసారి ఒకటి ఎక్కువ ఉంటే, ఇంకొకసారి ఇంకొకటి ఎక్కువ ఉంటుంది. రెండింటినీ సమానంగా భరిస్తాడు జ్ఞాని.

**శీతోష్ణసుఖదుఃఖేషు** – శీత అంటే చలి; ఉష్ణం అంటే వేడి; సుఖం అంటే సానుకూల పరిస్థితులు; దుఃఖం అంటే ప్రతికూల పరిస్థితులు. ఒక్కముక్కలో చెప్పాలంటే ద్వంద్వాలు. నిజానికి జీవితం అంటే అనేక ద్వంద్వాల మిశ్రమం. పుట్టుక ఉంటే చావు తప్పదు; పైకి ఎదిగితే కిందికి పడక తప్పదు; ఆరోగ్యం బాగుంటే అనారోగ్యం పాలుబడక తప్పదు; లాభం ఉంటే నష్టపోక తప్పదు; కలిస్తే విడిపోక తప్పదు. జీవితం అనేక ద్వంద్వాల మేలు కలయిక. ఈ ద్వంద్వాలను ఎవరూ తప్పించుకోలేరు.

సమః అంటే సమభావం. జ్ఞాని సమత్వం అనే షాక్ అబ్సార్బర్‌ను పెంపొందించుకుంటాడు. జ్ఞానానికి రాకముందు ఇష్టదేవతా భక్తి షాక్ అబ్సార్బర్‌గా పనిచేస్తుంది. ఇక్కడ మనం జ్ఞాని గురించి మాట్లాడుతున్నాము.

**సమస్సంగవివర్జితః** – సంగ వివర్జితః అంటే అసంగత్వం. అందరూ ఉంటే ఆనందిస్తాడు; కాని వారిమీద బంధం పెంచుకోడు. ఎందుకు? జ్ఞానికి తెలుసు జీవితం ద్వంద్వాల మేలుకలయిక అని. ఇప్పుడు సానుకూల పరిస్థితి ఉంటే, ఎప్పటికీ అలాగే ఉండదు. ఎప్పటికీ జీవితం హాయిగా, నిశ్చలంగా సాగిపోదు. అనేక ఒడిదుడుకులు వస్తాయి. ఇవాళ ఉన్నవి రేపు ఉండవు. అలాగని ఎప్పుడో వాటిని కోల్పోతామని ఇప్పుడు కూర్చుని ఏడవకూడదు.

కోకోకోలాని స్ట్రాతో తాగే వ్యక్తి ఆ కోకోకోలాని ఆస్వాదించకుండా, తను పీలుస్తున్నకొద్దీ అతని కళ్ళు సీసాలో అంతకంతకీ తగ్గుతూ వస్తున్న ద్రవాన్ని చూస్తాయి. అంటే ఆనందం కన్నా, అది అయిపోతోందన్న బాధ ఎక్కువ కనిపిస్తుంది. అది తగ్గకుండా అలాగే ఉండాలంటే ఏం చెయ్యాలి? దాన్ని తాగకూడదు. యు కెనాట్ హావ్ ది కేక్ అండ్ ఈట్ ఇట్ టూ అంటారు ఇంగ్లీషులో. అంటే నేను కేకుని తింటాను కాని అది అయిపోకూడదు అన్నట్టు ఉంటుంది. కోకోకోలా తాగితే తరిగిపోతుంది అని తెలుసుకోవాలి. దాన్ని కూడా నవ్వుతూ స్వీకరించాలి.

అదే విధంగా మీకు ఏవి ఉన్నా వాటిని భగవంతుని కానుకగా స్వీకరించండి. మీ ధనం, మీ పిల్లలు, మీ స్నేహితులు, మీ ఐశ్వర్యం, మీ ఆరోగ్యం – అన్నీ భగవంతుడు మీకిచ్చిన కానుకలు. ఆయన ఇచ్చాడు కాబట్టి, ఎప్పుడు కావాలంటే అప్పుడే వెనక్కు తీసేసుకునే హక్కు ఆయనకు ఉంది. భగవంతుడు తీసేసుకున్నప్పుడు 'ధన్యవాదాలు,' చెప్పి, చిరునవ్వుతో తిరిగి ఇవ్వగలగాలి. ఎన్నడూ భగవంతుణ్ణి నిందించకూడదు. ఇటువంటి మనస్తత్వాన్ని సంగవివర్జితః అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్లో. 19 **తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।**
**అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః ॥**
తుల్యనిందాస్తుతిః, మౌనీ, సంతుష్టః, యేన, కేనచిత్,
అనికేతః, స్థిరమతిః, భక్తిమాన్, మే, ప్రియః నరః ॥

| | | | |
|---|---|---|---|
| తుల్యనిందా స్తుతిః | = నిందాస్తుతులను సమానముగా భావించువాడును | అనికేతః | = గృహాదులయందు ఎట్టి ఆసక్తియు లేనివాడును |
| మౌనీ | = మననశీలుడును | స్థిరమతిః | = స్థిరబుద్ధి గలవాడును |
| యేన కేనచిత్ | = శరీరనిర్వహణకై లభించిన దానితోడనే | భక్తిమాన్, నరః | = (అయిన) భక్తుడైనవాడు |
| సంతుష్టః | = తృప్తిపడు వాడును | మే | = నాకు |
| | | ప్రియః | = ఇష్టుడు |

**తుల్య-నిన్దా-స్తుతిః, మౌనీ (యః) యేన కేనచిత్ సన్తుష్టః**
**(భవతి) అనికేతః, స్థిర-మతిః, భక్తిమాన్ (సః) నరః మే ప్రియః ।**

తా: నిందాస్తుతులను సమానముగా భావించువాడును, మననశీలుడును, శరీరనిర్వహణకై లభించిన దానితోడనే తృప్తిపడువాడును, గృహాదులయందు ఎట్టి ఆసక్తియు లేనివాడును, స్థిరబుద్ధి గలవాడును (అయిన) భక్తుడైనవాడు నాకు ఇష్టుడు.

అదే భావన కొనసాగుతున్నది.

**తుల్యనిందాస్తుతిః** – నిందా అంటే విమర్శ; స్తుతి అంటే పొగడ్త. ఇంతకుముందు మానావమానాలు అన్నాడు; ఇప్పుడు నిందాస్తుతులు అంటున్నాడు. మానావమానాలు కాయికం అయితే నిందాస్తుతులు వాచికం. కాయికం అంటే ఏమిటి? మానం అంటే ఎవరో వచ్చి మీ మెడలో దండ వేస్తారు; అవమానం అంటే ఎవరో దండ తీసుకువస్తారు, మీకనుకుని మీరు మెడ కొద్దిగా వంచుతారు; కాని వారు మీకు కాదని నిర్దాక్షిణ్యంగా చెప్పి, మీ పక్కవారి మెడలో వేస్తారు. అందువల్ల మానావమానాలు కర్మపరంగా జరిగేవి; నిందాస్తుతులు వాక్కుపరంగా జరిగేవి.

నిందాస్తుతులను కూడా ఏమాత్రం తప్పించుకోలేరు. మీరు ఏదైనా చెయ్యండి, దాన్ని నిందించటానికి సిద్ధంగా ఉంటారు కొందరు మహానుభావులు. విమర్శ చెయ్యటానికి పైసా ఖర్చు లేదు; పైగా మనకు వాక్ స్వాతంత్ర్యం ఉంది. అసలే ఎవరి గురించైనా చిలవలు, పలవలుగా చెప్పుకోవటం మనకున్న దురలవాటు.

ఆ విమర్శించేది మీకు తెలిసినవారే కానవసరం లేదు, మీ పాటున మీరు అమాయకంగా వెళుతున్నా కూడా, వెనకనుంచి ఎవరో మీ వేషధారణనో, మీ నడకతీరునో, మీరు వెళుతున్న కారునో విమర్శిస్తారు. కొంతమంది

ప్రత్యక్షంగానే సలహాలు ఇస్తారు. 'తుమ్ము వస్తే ఆపుకోలేనట్లు, ఎవరైనా సలహా అంటూ అడిగితే, మానవ మాత్రుడెవరూ సలహా ఇవ్వకుండా ఉండలేరు,' అన్నారొక గొప్ప రచయిత. సలహా అడగకుండానే ఇచ్చేవారు మరెందరో.

ఒక రైతు కష్టపడి భూమి దున్ని విత్తనాలు చల్లే సమయంలో ఒక్కొక్కరు ఒక్కొక్క సలహా ఇస్తున్నారు. అతను తనకు తోచిన ఏర్పాట్లు చేసేసుకున్నాడు; కాని ఎదురొచ్చి మరీ చెబుతున్నారు. ఆ రైతు తెలివైన పని చేశాడు. తన పొలం ముందు ఒక సలహాల పెట్టెను పెట్టాడు. ఎవరికి తోచిన సలహాను వారు ఇచ్చేవారు. ఆ సలహాల పెట్టె ప్రత్యేకత ఏమిటో తెలుసా? ఆ పెట్టె కింద మూతలేదు. ఆ పెట్టె కింద చెత్తబుట్ట ఉంది. ఎవరే సలహా వేసినా, ఆ కాగితం సరాసరి వెళ్ళి చెత్తబుట్టలో పడుతుంది. అంటే అతను వాటిని చూడనే చూడడు.

కాస్త దగ్గు వస్తేనే ముప్పయి రకాల సలహాలు ఇస్తారు అందరూ. అల్లోపతి అంటారు, హోమియోపతి అంటారు, వంటయింటి చిట్కాలు అంటారు. పైగా చెప్పి ఊరుకోరు. అది వాడావంటే, దెబ్బకు నీ దగ్గు ఎగిరిపోతుందని హామీపత్రాలు కూడా ఇస్తారు. 'నేను ఒక మందు వాడుతున్నాను,' అని మీరు చెప్పినా కూడా వదలరు. 'కాని, ఇది కూడా వాడిచూడు,' అని వెంటబడతారు. ఒకవేళ అన్ని మందులూ వాడితే, దేనివల్ల తగ్గిందో మీకు తెలియదు.

ఇంతకీ చెప్పొచ్చింది అలా సలహాలు లేదా విమర్శలు మీరు కావాలనుకున్నా, వద్దనుకున్నా కూడా వచ్చి పడతాయి. వాటన్నిటికీ మీరు చలించారు అంటే మీరు ఇబ్బంది పడిపోతారు. వాటిని ఈ చెవితో విని, ఆ చెవితో వదిలేయాలి. జ్ఞాని అలా నిందాస్తుతులకు చలించడు. మెచ్చుకున్నా పొంగిపోడు, తిట్టినా కృంగిపోడు.

**మన్నిందయా యది జనాః పరతోషమేతి,**
**నన్ వా ప్రయత్నసులభో యమనుగ్రహో మే ।**
**శ్రేయోర్థినస్తు పురుషాః పరతుష్టి హేతోః,**
**క్లేషర్జితానపి ధనాని పరిత్యజంతి ॥**

ఎవరైనా నామీద విమర్శలు చేసి, దానివల్ల ఆనందం పొందేటట్టయితే, నాకూ సంతోషమే అంటాడు జ్ఞాని. ఎదుటివారిని తృప్తిపరచటానికి ఎంతో ధనం ఖర్చుపెడతారు కొందరు. అలాంటిది పైసా ఖర్చు లేకుండా, నేను వారికి ఆనందాన్ని ఇస్తుంటే అంతకన్నా కావాల్సింది ఏముంది అంటాడు. వారు ఎలా పొందుతున్నారు ఆ ఆనందాన్ని? జ్ఞానిని విమర్శించటంద్వారా. అయినా దానికీ చలించడు జ్ఞాని.

**సంతుష్టో యేన కేనచిత్** – తనకు ఏది లభించినా దానితోనే తృప్తి చెందుతాడు జ్ఞాని. జ్ఞానియొక్క గొప్పతనం ఏమిటంటే, అతను చిన్నదానికి కూడా తృప్తిపొందుతాడు. కొంతమందికి ఏదిచ్చినా తృప్తి ఉండదు. కాఫీ ఇవ్వాలన్నా కూడా బ్రహ్మప్రళయమే. అందులో ఎన్ని పాలు, ఎంత పంచదార, ఎంత కాఫీపొడి, ఎంత వేడి, ఏ కప్పులో ఉండాలి – లాంటి ప్రతి చిన్న విషయమూ వారికి ముఖ్యమే. వీటిల్లో ఏ ఒక్కటి సరిగ్గా కుదరక పోయినా, ఆ కాఫీని వేలేసి ముట్టరు. అంత ఎక్కువగా ఉంటాయి రాగద్వేషాలు వారికి.

ప్రతిదీ పరిపూర్ణంగా చెయ్యాలనుకునేవారిని తృప్తిపరచటం కూడా కష్టమే. అలా పరిపూర్ణంగా ఏదైనా పని చెయ్యగలగటం అద్భుతమే; కాదనము కాని, వారు ఎదుటివారినుంచి కూడా అంతే పరిపూర్ణతను ఆశిస్తారు. ఏ వస్తువు ఎక్కడ, ఎలా ఉండాలో అలాగే ఉండాలి; ఏ పని ఎలా చెయ్యాలో అలాగే చెయ్యాలి. లేకపోతే వారికి నిముషాలమీద కోపం వచ్చేస్తుంది. జ్ఞాని అలా కాదు. జ్ఞాని తనకు తాను పరిపూర్ణంగా చేస్తాడు. కాని, ఎదుటివ్యక్తి పరిపూర్ణంగా చెయ్యలేకపోతే మండిపడడు. వారిని అర్థం చేసుకుంటాడు. యేన కేనచిత్ అంటే ఏది వచ్చినా చిరునవ్వుతో స్వీకరిస్తాడు. ముఖ్యంగా జ్ఞాని సన్న్యాసి అయితే, అసలే తనకు ఏదీ కావాలని కోరడు.

నిజానికి శంకరులవారు ఈ శ్లోకాలను సన్న్యాసిని వర్ణించే శ్లోకాలుగా భావిస్తారు. సన్న్యాసి భవతీ భిక్షాందేహీ అనేటప్పుడు భిక్షగా ఏది వస్తే అది స్వీకరించాలి కాని; ఇది కావాలి, అది కావాలని కోరలేడు. ఆ మాటకొస్తే ఒకరోజు భిక్ష దొరకకపోయినా కూడా బాధపడకూడదు.

**అనికేతః** – అనికేతః అంటే సన్న్యాసి అని అర్థం. తనకంటూ ఇల్లు లేని వ్యక్తి అని అర్థం. అంటే అద్దెయిల్లు ఉండవచ్చు కదా అనకూడదు. నికేతః అంటే ఇల్లు; అనికేతః అంటే సన్న్యాసి. అతను ఎక్కడ నివసిస్తాడు?

**సురమన్దిరతరు మూల నివాసః శయ్యా భూతలమజినం వాసః**
**సర్వపరిగ్రహభోగత్యాగః కస్య సుఖం న కరోతి విరాగః** – భజగోవిందం 19

ఎవరెక్కడ ఆశ్రయం ఇస్తే అక్కడ ఉండిపోతాడు, అది రాజసౌధం అయినా, పూరిగుడిసె అయినా పట్టించుకోడు.

**స్థిరమతిః** – ఇటువంటి మానసిక స్థైర్యాన్ని అతను ఎలా పొందుతాడు? అతను పొందిన ఆత్మజ్ఞానంవల్ల.

గుర్తుంచుకోండి జ్ఞానం శక్తిని ఇస్తుంది. నిజానికి జ్ఞానం మాత్రమే శక్తిని ఇస్తుంది. మనిషి తక్కిన జీవరాశులకన్నా శక్తివంతంగా ఉన్నాడంటే, దానికి కారణం మనిషికున్న జ్ఞానంవల్లనే. అనేక రకాల జ్ఞానాలన్నిటిలోకీ గొప్పది ఆత్మజ్ఞానం.

**ఆత్మ నా విందతే వీర్యం, విద్యయా విందతే అమృతమ్** – కేన

అందువల్ల స్థిరమతిః అంటే నిస్సంశయ జ్ఞానం పొందిన వ్యక్తి. స్థిర అంటే దృఢమైన; ఇక్కడ నిశ్చయమైన. మతిః అంటే విజ్ఞానం. స్థిరమతిః అంటే నిశ్చయమైన విజ్ఞానం కలిగిన వ్యక్తి. ఆ విజ్ఞానం దేని గురించి? అహం బ్రహ్మ అస్మి జ్ఞానం.

**భక్తిమాన్ మే ప్రియో నరః** – అటువంటి జ్ఞాని నాకు ప్రియం అంటున్నాడు కృష్ణపరమాత్మ.

ఈ శ్లోకంతో జ్ఞాని నడవడిక గురించిన వర్ణనను ముగించాడు. రాబోయే శ్లోకంలో కృష్ణపరమాత్మ తన బోధను ముగిస్తున్నాడు.

శ్లో. 20 **యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥**

యే, తు, ధర్మ్యామృతమ్, ఇదమ్, యథా, ఉక్తమ్, పర్యుపాసతే,
శ్రద్ధధానాః, మత్పరమాః, భక్తాః, తే, అతీవ, మే, ప్రియాః ॥

| | | | |
|---|---|---|---|
| యే, తు | = ఎవరైతే | పర్యుపాసతే | = నిష్కామభక్తి భావముతో సేవింతురో |
| శ్రద్ధధానాః | = శ్రద్ధాయుక్తులై | తే, భక్తాః | = ఆ భక్తులు |
| మత్పరమాః | = మత్పరాయణులై | మే | = నాకు |
| యథా, ఉక్తమ్ | = పైన తెల్పబడినట్టి | అతీవ | = మిక్కిలి |
| ఇదమ్ | = ఈ | ప్రియాః | = ఇష్టులు |
| ధర్మ్య–అమృతమ్ | = ధర్మ్యామృతమును | | |

**యే తు శ్రద్ధధానాః మత్–పరమాః భక్తాః ఇదమ్ యథా ఉక్తమ్**
**ధర్మ్య–అమృతమ్ పర్యుపాసతే, తే మే అతీవ ప్రియాః (సన్తి) ।**

తా: ఎవరైతే శ్రద్ధాయుక్తులై, మత్పరాయణులై పైన తెల్పబడినట్టి ఈ ధర్మ్యామృతమును నిష్కామభక్తి భావముతో సేవింతురో ఆ భక్తులు నాకు మిక్కిలి ఇష్టులు.

అటువంటి జ్ఞానియొక్క వర్ణన విన్నాక, ఎవరికైనా సహజంగా కలిగే భావన, అటువంటి జ్ఞాని అవటం ఎలా? సూక్ష్మంలో మోక్షం అంటారు. అలా ఏదైనా సూక్ష్మమైన మార్గం ఉందా? అటువంటిదేమీ లేదు; ఈ అధ్యాయంలో వివరించిన ఐదుదశల భక్తియోగమూ, ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ రావాల్సిందే.

**ఇదం యథోక్తం పర్యుపాసతే** – ఎవరైతే ఈ భక్తియోగాన్ని చెప్పింది చెప్పినట్టుగా పాటిస్తారో, వారు జ్ఞాని అవుతారు. అంటే ఇంతవరకూ చెప్పిన ఐదుదశలనూ పాటించాలి. వాటిని మళ్ళీ ఒకసారి చూద్దాము.

| | | |
|---|---|---|
| **కర్మయోగం స్థాయి** | **1 – సకామకర్మ ప్రధాన కర్మయోగం** | **– 1** |
| **కర్మయోగం స్థాయి** | **2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం** | **– 2** |
| **ఉపాసనయోగం స్థాయి** | **1 – ఏకరూప ఈశ్వరధ్యానం** | **– 3** |
| **ఉపాసనయోగం స్థాయి** | **2 – అనేకరూప ఈశ్వరధ్యానం** | **– 4** |
| **జ్ఞానయోగం** | **– నిర్గుణ బ్రహ్మజ్ఞానం** | **– 5** |

ఈ ఐదుదశలనూ వేదాంతంలో మూడుదశలుగా వస్తుందని చూశాము. మొదటి రెండుదశలూ కర్మయోగానికి చెందినవి; తక్కిన రెండుదశలూ ఉపాసన యోగానికి చెందినవి; చివరిదశ జ్ఞానయోగానికి చెందినది. ఒక్క ముక్కలో చెప్పాలంటే –

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తియోగం**

అందువల్ల యథోక్తం అంటే ఈ భక్తియోగాన్ని ఇలా ఎవరైతే పాటిస్తారో. ఈ భక్తియోగానికి ఇక్కడ పేరు–

**ధర్మ్యామృతమ్** – అమృతం అంటే శాశ్వతఫలాన్ని ఇస్తుంది.

**అమృతత్వ హేతుభూతం భక్తియోగం ఇత్యర్థః**

ధర్మ్యమ్ అంటే వేదాలను అనుసరించి చేసిన బోధ. మన సాంప్రదాయంలో వేదాలను ప్రాథమిక శాస్త్రంగా పరిగణిస్తారు. అందువల్ల అందరూ వేదాలను తప్పనిసరిగా పాటించాలి. వేదాలను నమ్మనివారిని నాస్తికులు అంటారు. అందువల్ల ప్రతి గురువు కూడా తన బోధను వేదాలను ఆధారంగా చేసుకుని చెయ్యాలి.

కృష్ణపరమాత్మ కూడా తను స్వంతంగా బోధ చెయ్యటం లేదనీ, వేదాలను ఆధారంగా చేసుకుని బోధిస్తున్నానని చెబుతున్నాడు. నేను నీకు ధర్మ్యమ్ బోధిస్తున్నానంటున్నాడు కృష్ణపరమాత్మ. అంటే వేదాలలో చెప్పినదానికి భిన్నంగా ఏదీ బోధించటం లేదు.

అందువల్లనే భగవద్గీతను స్మృతిగ్రంథం అంటారు. స్మృతి అంటే శ్రుతి (వేదాలు)ని అనుసరించి వచ్చినది. ఒకవేళ ఎవరైనా మొత్తం భక్తియోగాన్ని పాటిస్తే,

**శ్రద్దధానాః** – అది కూడా శ్రద్ధగా పాటిస్తే,

**మత్పరమాః** – నన్నే అంతిమ లక్ష్యంగా పెట్టుకుని పాటిస్తే,

**తే భక్తాః అతీవ మే ప్రియాః** – ఆ భక్తులు నాకు అత్యంత ప్రియభక్తులు అవుతారు అంటున్నాడు కృష్ణపరమాత్మ.

శ్రద్ధ ఉంటే ఇటువంటి భక్తియోగం ఫలితం ఇచ్చి తీరుతుంది అనుకోవాలి. మత్పరమా అంటే అతని లక్ష్యం ఆధ్యాత్మిక చింతన అయి ఉండాలి, లౌకికలక్ష్యాలు ఉండకూడదు. అటువంటి భక్తుణ్ణి ముముక్షువు అంటారు. అతను చివరికి జ్ఞానీభక్తుడు అవుతాడు. అటువంటి జ్ఞానీభక్తుడు నాకు చాలా ప్రియమైన వ్యక్తి అంటున్నాడు కృష్ణపరమాత్మ.

**ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే**
**శ్రీకృష్ణార్జునసంవాదే భక్తియోగో నామ ద్వాదశోఽధ్యాయః**

హరి ఓం తత్సత్

ఇది శ్రీ మద్భగవద్గీతయందు, ఉపనిషత్తులయందు, బ్రహ్మవిద్యయందు, యోగశాస్త్రమునందు, శ్రీకృష్ణార్జున సంవాదమునందు భక్తియోగము అనే పన్నెండవ అధ్యాయము.

# అధ్యాయము 12 - భక్తియోగము సారాంశము

పన్నెండవ అధ్యాయము భగవద్గీతలోని మధ్యభాగానికి ముక్తాయింపు పలుకుతుంది. ఈ మధ్యభాగాన్ని మధ్యమషట్కము లేదా రెండవ షట్కము అంటారు. భగవద్గీతను మూడు షట్కాలుగా విభజించవచ్చని అంతకుముందు కూడా చూశాము. అవి మొదటి షట్కము, రెండవ షట్కము, మూడవ షట్కము. ఈ రెండవ షట్కంలో 7-12 అధ్యాయాలు వస్తాయి.

మొదటి షట్కములో జీవస్వరూపాన్ని వివరిస్తే, ఈ రెండవ షట్కములో ఈశ్వరస్వరూపాన్ని వివరించాడు కృష్ణపరమాత్మ. ఈశ్వరస్వరూపం గురించిన వర్ణన విన్నాక, సహజంగానే అటువంటి ఈశ్వరునిమీద భక్తి ఏర్పడుతుంది.

భక్తికాని, ప్రేమ కాని, ఆరాధన కాని, మనకు బాగా తెలిసినవారిమీదనే ఏర్పడుతుంది. ఒక వ్యక్తిమీద తొలి పరిచయంలో ఏ అభిప్రాయమూ ఏర్పడదు. అతనితో చనువుగా మెలిగాక, అతనంటే ప్రేమ, ఆరాధన, గౌరవంలాంటి భావన ఏదైనా కలుగుతుంది. ఆ వ్యక్తి గురించి లోతుగా తెలుసుకున్న కొద్దీ ప్రేమ ఎక్కువవుతుంది. ఇది లౌకికంగా జరిగే విషయం.

ఈ సూత్రం భగవంతుని విషయంలో కూడా వర్తిస్తుంది. భగవంతుని స్వరూపమేమిటో తెలియకుండా, ఆయనను ఆరాధించలేము. తెలియని భగవంతుణ్ణి పూజించమని నిర్దేశించలేము. భగవంతుని గురించి జ్ఞానాన్ని పెంపొందించాలి. దేశభక్తి కలగాలంటే దేశంయొక్క గొప్పతనం తెలియాలి. ఒక వ్యక్తిమీద ఆరాధన పెరగాలంటే ఆజ్ఞాపిస్తే రాదు; బలవంతం చేస్తే రాదు; ఆ వ్యక్తి గురించిన సరియైన జ్ఞానం ఉండాలి. కృష్ణపరమాత్మకు ఈ సూత్రం తెలుసు.

ఐదు అధ్యాయాలలో భగవంతుని గురించిన జ్ఞానం విస్తారంగా చెప్పాడు. భగవంతుని విభూతులు, ఆయన స్వరూపం అంత స్పష్టంగా తెలిశాక, ఆయనను ఆరాధించకుండా ఉండలేము. దీన్ని **భక్తి** అంటారు.

**ఈశ్వరజ్ఞానం వినా ఈశ్వరభక్తిః న సంభవతి**

**అజ్ఞాతవిషయే భావనా నైవ సంభవతి**

ఆ విధంగా ఈ అధ్యాయం తక్కిన ఐదు అధ్యాయాల సహజపరిణామం. పైగా ఇది ఈ షట్కంలో ఉన్న ఈశ్వరస్వరూపము అనే అంశానికి ముక్తాయింపు. అందువల్ల ఈ అధ్యాయం చాలా చిన్న అధ్యాయమే అయినా కూడా ఇది చాలా ముఖ్యమైన అధ్యాయం.

కృష్ణపరమాత్మ 20 చిన్న శ్లోకాల్లో మొత్తం వేదసారాన్ని రంగరించి పోశాడు. వేదాంతసారాన్ని మాత్రమే కాదు, మొత్తం వేదసారాన్నే అద్భుతంగా వివరించాడు. వేదపూర్వభాగాన్ని, వేద అంతభాగాన్ని - మొత్తం ఒక్క అధ్యాయంలో పొందుపరచాడు. ఇది చాలా చిన్న అధ్యాయం కాబట్టి, తేలిగ్గా కంఠతా పట్టగలము కాబట్టి, చాలామంది ఈ అధ్యాయాన్ని ఇష్టపడతారు. ఆ కారణం ఆచరణపరంగా సరిపోతుంది కాని అసలు గొప్పతనం దాని సారంలో ఉంది. పన్నెండవ అధ్యాయం వేదసారము. అది మనం చెప్పటం కాదు, కృష్ణపరమాత్మే

స్వయంగా ఈ అధ్యాయం చివర్లో ఒక మాట అన్నాడు

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే** – 12.20

ధర్మ్యామ్ అంటే ఈ అధ్యాయం వైదికధర్మంయొక్క సారం.

పన్నెండవ అధ్యాయాన్ని ప్రధానంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి

1. భక్తియోగము శ్లోకాలు 1–12
2. భక్తియోగఫలము శ్లోకాలు 13–20

**ఉపోద్ఘాతము – శ్లోకాలు 1, 2**

కాని ఈ ప్రధాన అంశాలలోకి అడుగుపెట్టే ముందు కృష్ణపరమాత్మ అర్జునుడు అడిగిన ఒక ప్రశ్నకు జవాబు చెప్పాడు. అంతకుముందు అధ్యాయంలో, అంటే పదకొండవ అధ్యాయంలో కృష్ణపరమాత్మ సగుణ ఈశ్వరుని గురించి వివరించాడు. ఈశ్వరుడే జగత్తు అంతటా ఉన్నాడు. జగత్తుగా ఉన్న ఈశ్వరుణ్ణి విశ్వరూప ఈశ్వరుడు అంటారు. విశ్వరూప ఈశ్వరుడు సగుణ ఈశ్వరుడు అవుతాడు. ఎందుకంటే జగత్తులో గుణాలు ఉన్నాయి కాబట్టి.

అర్జునుడు నిర్గుణ ఈశ్వరుని గురించి చాలా విన్నాడు. అందువల్ల అర్జునునికి సగుణ ఈశ్వరుడు గొప్పవాడా, నిర్గుణ ఈశ్వరుడు గొప్పవాడా అనే సందేహం కలిగింది. సహజంగానే ఈ సందేహం ఇంకొక సందేహానికి దారి తీస్తుంది. ఏమిటది? సగుణభక్తి గొప్పదా, నిర్గుణభక్తి గొప్పదా? సగుణ ఉపాసకుడు గొప్పవాడా, నిర్గుణబ్రహ్మజ్ఞాని గొప్పవాడా? సాధారణంగా అందరూ సగుణ ఈశ్వరుని వైపే ఆకర్షింపబడతారు. అందువల్ల ఈ సందేహంతో ఈ అధ్యాయం మొదలవుతుంది.

**అర్జున ఉవాచ**

**ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।**

**యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥** 12.1

సగుణధ్యానం గొప్పదా, నిర్గుణధ్యానం గొప్పదా? కృష్ణపరమాత్మ జవాబు ఏమిటి దానికి? కృష్ణపరమాత్మ అర్జునుని ప్రశ్నను విమర్శించకుండా, అతణ్ణి చిన్నచూపు చూడకుండా దానికి జవాబు నర్మగర్భంగా, తెలివిగా చెప్పాడు. సగుణభక్తులు గొప్పవారు; నిర్గుణభక్తులు నన్ను పొందుతారు అన్నాడు.

కృష్ణపరమాత్మ నర్మగర్భంగా చెప్పిన జవాబులోని అంతరార్థం గ్రహించాలి మనం. అర్జునుని ప్రశ్నే తప్పు. తప్పు ప్రశ్నకు సరియైన జవాబు లేదు. ఎవరైనా మీ ఇంటికి వస్తే ఏం తాగుతారు కాఫీనా, టీనా అంటారు. ఎవరైనా పెద్దవారు వస్తే గ్లాసులో తాగుతారా, కప్పులో తాగుతారా అంటారు. అంతేకాని గ్లాసు కావాలా, కాఫీ కావాలా అని అడుగుతారా? అదేవిధంగా సగుణ ఈశ్వరునికీ, నిర్గుణ ఈశ్వరునికీ మధ్య పోలికే లేదు.

అలాగే ఈ ప్రశ్నకు అర్థం లేదు. ఎందుకంటే ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎన్నుకునే అవకాశం లేదు. ప్రతి ఒక్కరూ కూడా సగుణ ఈశ్వరధ్యానం చేసి, ఎప్పుడో ఒకప్పుడు నిర్గుణ ఈశ్వరధ్యానానికి వచ్చి తీరాలి.

**సగుణభక్తి లేనిదే నిర్గుణభక్తి అసంభవం**

**నిర్గుణభక్తికి రానిదే సగుణభక్తి అసంపూర్ణం**

అందువల్ల ప్రతి ఒక్కరూ సగుణభక్తిలో ఉండి, దానిద్వారా నిర్గుణభక్తికి రావాలి. ప్రతి ఒక్కరి ప్రయాణం – సగుణభక్తిద్వారా నిర్గుణభక్తికి చేరుకోవటం. నిర్గుణభక్తికి రావటం వాయిదా వేయవచ్చు. అతను నిర్గుణభక్తికి సిద్ధంగా లేకపోతే సగుణభక్తితో మరికొన్నాళ్ళు ఉండి తర్వాత రావచ్చు. ఆ తర్వాత అనేది ఒక సంవత్సరం తర్వాత అవచ్చు; పదిసంవత్సరాల తర్వాత అవచ్చు; పదిజన్మల తర్వాత అవచ్చు. అది ఎప్పుడైనా అవనీ, నిర్గుణబ్రహ్మకు మాత్రం వచ్చి తీరాలి. ఎందుకంటే నిర్గుణబ్రహ్మే అంతిమలక్ష్యం.

**తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే** – కేన 1.9

ఆ బ్రహ్మవు నువ్వే అని తెలుసుకో. నువ్వు ఉపాసన చేసే భగవంతుడు బ్రహ్మ కాదు; భగవంతుణ్ణి ఉపాసన చేసే నువ్వు బ్రహ్మవు.

అందువల్ల అర్జునుని ప్రశ్నకు కృష్ణపరమాత్మ జవాబు – రెండూ చెయ్యాలి. సగుణ ఉపాసన చేసి, నిర్గుణ బ్రహ్మకు రావాలి.

ఈ విధంగా అర్జునుని ప్రశ్నకు జవాబు చెప్పాక, కృష్ణపరమాత్మ రెండు అంశాలను చర్చించాడు.

**1. భక్తియోగము – శ్లోకాలు 3-12**

భక్తియోగము అంటే ఒక ప్రత్యేకమైన సాధన కాదు. అనేక ఆధ్యాత్మిక సాధనలతో కూడినది అని చూశాము. ఈ ఆధ్యాత్మిక సాధనలను కొన్ని దశలుగా చెయ్యాలి.

ఆ దశల సంఖ్య సందర్భాన్ని బట్టి మారుతుంది. కొన్నిసార్లు రెండుదశలుగా చూస్తాము; మరికొన్నిసార్లు మూడుదశలుగా చూస్తాము.

**కర్మయోగం + ఉపాసనయోగం + జ్ఞానయోగం = భక్తియోగం**

ఇలా మూడు దశలను వేదాంతంలో చూస్తాము. ఇక్కడ కృష్ణపరమాత్మ ఈ మూడు దశలనే ఐదుదశలుగా పెంచాడు. అంటే చిన్న మెట్లుగా విభజించాడు. వీటిలో ఏ దశ ముఖ్యమైనది అనకూడదు. ఐదుమెట్లున్న నిచ్చెన ఉంటే, అది ఎక్కి పైకెక్కటానికి ఏ మెట్టు ముఖ్యమైనది అంటామా? ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పైకి చేరుకోవాలి. భక్తియోగంలో కూడా అంతే. ఒక్కొక్క మెట్టూ ఎక్కుతూ పైకి చేరుకోవాలి. కృష్ణపరమాత్మ చెప్పిన ఐదుదశలు ఇవి.

| | | |
|---|---|---|
| **కర్మయోగం స్థాయి** | **1 – సకామకర్మ ప్రధాన కర్మయోగం** | **– 1** |
| **కర్మయోగం స్థాయి** | **2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం** | **– 2** |
| **ఉపాసనయోగం స్థాయి** | **1 – ఏకరూప ఈశ్వరధ్యానం** | **– 3** |
| **ఉపాసనయోగం స్థాయి** | **2 – అనేకరూప ఈశ్వరధ్యానం** | **– 4** |
| **జ్ఞానయోగం** | **– అక్షర ఉపాసన** | **– 5** |

కృష్ణపరమాత్మ పైనుంచి కిందకు వచ్చాడు కాని ఇప్పుడు మనం కిందనుంచి పైకి వెళదాము.

**ఎ) కర్మయోగం స్థాయి 1 – సకామకర్మ ప్రధాన కర్మయోగం – 1**

ఇది మొట్టమొదటి స్థాయి. దీన్ని ఎవరైనా తేలికగా ఆచరించవచ్చు. తన వ్యక్తిగత కోరికలు తీర్చుకోవటానికి ఏ కర్మనైనా చెయ్యవచ్చు. మనిషికి కోరికలు అనంతం. పైగా ఆ కోరికలు ఈ జన్మలో పుట్టినవే కావు, జన్మజన్మలుగా తీసుకువచ్చినవై ఉంటాయి.

**కామాన్ కామయతే మన్యమానః సః కామభిర్ జాయతే తత్ర తత్ర** – ముండకోపనిషత్ 3.2.2

మనిషికి ఏ కోరిక తీవ్రంగా ఉంటే ఆ పరిసరాలలో పుడతాడు అంటారు. అందువల్ల కోరికలు ఉండి తీరతాయి. వాటికోసం కామ్యకర్మలు చేస్తాడు. ఫర్వాలేదు, ముందుగా వాటితో మొదలుపెట్టండి అంటుంది శాస్త్రం. ముందుగా యోగక్షేమాలతో మొదలుపెట్టండి. ఈ పదాన్ని తొమ్మిదవ అధ్యాయంలో చూశాము. యోగం అంటే సంపాదించటం; క్షేమం అంటే దాన్ని కాపాడుకోవటం. మనిషికి చాలా సంపాదించాలనే తపన ఉంటుంది. అది కూడా తనకు మాత్రమే కాకుండా, ముందు తరాలు తిన్నా తరగనంత ఆస్తి పోగేయాలనే తపన. ఆడపిల్లలు ఉంటే ఒక తపన, మగపిల్లలు ఉంటే ఇంకొకరకం తపన.

ఆస్తి సంపాదిస్తే చాలదు, దాన్ని నిలబెట్టుకోవటం ఇంకా పెద్ద ప్రయాస. దాని గురించి ఇంకా పెద్ద బెంగ. పెళ్ళి కాకుండా బ్రహ్మచారిగా ఉన్నంతవరకూ అతని యోగక్షేమాల గురించి చింత; పెళ్ళి అయితే భార్యయొక్క యోగక్షేమం. అలా కుటుంబం పెరుగుతూ ఉంటుంది, బాధ్యతలు పెరుగుతాయి. వాటితో పాటు కోరికలు కూడా పెరుగుతాయి. ఆలయానికి వెళ్ళినా, స్వామీజీ దగ్గరకి వెళ్ళినా వారి గురించి ఏ కోరికా ఉన్నా లేకపోయినా, పిల్లలకు పరీక్షల్లో మంచిమార్కులు రావాలనో; ఐ.ఐ.టీ.లో సీటు రావాలనో కోరుతారు.

ఈ యోగక్షేమ ప్రధానకర్మను కర్మయోగంగా ఎలా మలుచుకోవాలి? యోగక్షేమంకోసం పాటుపడండి, తప్పులేదు, కాని దానికి ఫలితంగా ఏది వచ్చినా కూడా దాన్ని **ఈశ్వరప్రసాదంగా స్వీకరించండి.**

**బి) కర్మయోగం స్థాయి 2 – నిష్కామకర్మ ప్రధాన కర్మయోగం – 2**

యోగక్షేమాలకోసం కొంతకాలం పాటుపడ్డాక, కొంత పరిపక్వత వస్తుంది. అప్పుడు దీనికి అంతూపొంతూ లేకుండా ఉందని గ్రహించిన వారు, తన యోగక్షేమాలను భగవంతునికి అప్పచెబుతాడు.

**అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**

**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥** – 9.22

మన యోగక్షేమాలను భగవంతునికి అర్పిస్తే, కొంత సమయం కూడా చిక్కుతుంది. అప్పుడు రెండవ స్థాయికి చెందిన కర్మలను చేసే తీరిక చిక్కుతుంది. అటువంటి కర్మ చిత్తశుద్ధిని కలుగజేస్తుంది.

రెండవస్థాయి కర్మయోగాన్ని నిష్కామకర్మ లేదా చిత్తశుద్ధి ప్రధాన కర్మయోగం అంటారు. ఈ కర్మలను పరోపకార కర్మలు అని కూడా అంటారు. సకామకర్మలో కర్మఫలాన్ని ఈశ్వరప్రసాదబుద్ధితో స్వీకరిస్తే, నిష్కామకర్మలో **ఈశ్వరార్పణభావనతో కర్మ చెయ్యాలి.**

దీనికి రావటమే కష్టం కొంతమందికి. కాని తప్పదు. ఈ రెండు దశలనూ కలిపి కర్మయోగం అంటారు.

**కర్మయోగం = ఈశ్వరార్పణభావన + ఈశ్వరప్రసాదబుద్ధి**

కర్మయోగం అన్నా కూడా భక్తియోగంలోకే వస్తుంది. భక్తియోగంలోని మొదటి రెండు స్థాయిలు ఇవి. చేసే కర్మలను ఈశ్వరునికి అర్పించాలన్నా, వచ్చిన ఫలాలను ఈశ్వరుని ప్రసాదంగా స్వీకరించాలన్నా, ఈశ్వరునిమీద భక్తి ఉంటేనే అది సాధ్యం.

### సి) ఉపాసనయోగం స్థాయి 1 – ఏకరూప ఈశ్వరధ్యానం – 3

**ఇష్టదేవతా ఉపాసన**ను ఏకరూప ఈశ్వరధ్యానం అంటారు. ఇది మూడవమెట్టు. యోగక్షేమాల గురించి తపన పడుతుంటే, ప్రశాంతంగా ధ్యానంలో కూర్చునే తీరిక ఉండదు. ఒకవేళ పద్మాసనం వేసుకుని కూర్చున్నా కూడా, మనస్సును ప్రశాంతంగా ఉంచకుండా, మీ బెంగలన్నీ మనస్సును తొలిచేస్తాయి.

అందువల్ల యోగక్షేమాలను రెండవ మెట్టులో భగవంతునికి అర్పించగలిగితే, అప్పుడు ఈశ్వరధ్యానం చెయ్యటానికి కొంత సమయం ఏర్పడుతుంది. కాసేపన్నా కుటుంబం గురించి, భవిష్యత్తు గురించి, ధనం గురించి, ఉద్యోగం గురించి ఆలోచించటం మాని భగవంతుని చరణకమలాలమీద అరనిముషమైనా దృష్టి పెట్టగలుగుతారు. దీన్ని ఇష్టదేవతా ఉపాసన అంటారు. దీన్ని అభ్యాసయోగేన అన్నాడు కృష్ణపరమాత్మ. అభ్యాసయోగేన అంటే ఇష్టదేవతా ఉపాసన.

ఇష్టదేవత ఉపాసన చేస్తే మంచిదే కాని, ఒక్క దేవునికే పరిమితమైతే కొంత పరిమితి భావన ఏర్పడుతుంది. ఒక దైవంమీద ఇష్టం, ఇంకొక దైవంమీద ద్వేషంగా మారకూడదు. మీరు శివభక్తులైతే విష్ణుభక్తులను కించపరచకూడదు; వైష్ణవభక్తులైతే శివభక్తులను కించపరచకూడదు. అలా చెయ్యకూడదంటే నాలుగవ స్థాయికి ఎదగాలి.

### డి) ఉపాసన యోగం స్థాయి 2 – అనేకరూప ఈశ్వరధ్యానం – 4

మీ ఇష్టదేవతను విశ్వం అంతటా నిండి ఉన్నట్టుగా ధ్యానించాలి. దీన్ని విశ్వరూపభక్తి లేదా **విశ్వరూపదర్శనం** అంటారు. భగవంతుడు జగత్తు అంతటా ఉన్నాడు అంటే, ఉన్నది ఒక్కటే భగవంతుడు అవుతుంది. విశ్వరూప విష్ణువు, విశ్వరూప ఈశ్వరుడు అని ఇద్దరు దేవుళ్ళు ఉండరు. విష్ణువు, శివుడు ఒక్కరే అవుతారు. ఉన్నదంతా ఒకే పరమాత్మ, పేర్లు వేరు అవచ్చు కాని అని తెలుసుకుంటారు. అప్పుడు శివుడు ఎక్కువా, విష్ణుమూర్తి ఎక్కువా అనే పోటీ ఉండదు. ఈ విశ్వరూపధ్యానం చిత్తవిశాలతను పెంచుతుంది. కర్మయోగం చిత్తశుద్ధిని కలుగజేస్తే, ఉపాసనయోగం చిత్తవిశాలతను కలుగజేస్తుంది. ఆ విధంగా కర్మయోగం, ఉపాసన యోగాలు కలిపి జ్ఞానయోగ్యతా ప్రాప్తిని కలుగజేస్తాయి. అంటే సాధనచతుష్టయసంపత్తిని కలుగజేస్తాయి.

తత్త్వబోధలో ఈ దశలు చూస్తాము. జ్ఞానం పొందాలంటే సాధనచతుష్టయసంపత్తి ఉండాలి; సాధన చతుష్టయ సంపత్తి ఉండాలంటే కర్మయోగం, ఉపాసనయోగం పాటించి ఉండాలి. కర్మయోగం, ఉపాసనయోగం పాటించి ఉండాలంటే ఇప్పటివరకూ చూసిన భక్తియోగంలోని నాలుగు దశలను పాటించి ఉండాలి. అన్నీ కలిపి ఒక్కముక్కలో చెప్పాలంటే, భక్తియోగం అంటే ఆత్మజ్ఞానం పొందటానికి కావాల్సిన మానసిక సంసిద్ధతను పొందటం.

**ఇ) జ్ఞానయోగం – అక్షర ఉపాసన – 5**

జ్ఞానం పొందటానికి సాధకుడు భక్తియోగంలోని ఈ ఐదవదశకు చేరుకోవాలి. దీన్ని జ్ఞానయోగం అంటారు.

**స్వస్వరూపానుసంధానం భక్తిరిత్యభిధీయతే** – వివేక చూడామణి

జ్ఞానయోగం అంటే **స్వస్వరూప జ్ఞానం.** స్వస్వరూపాన్ని గురించి తెలుసుకోవటాన్ని భక్తి అంటారు. ఈ జ్ఞానయోగంలో మూడు అంశాలు ఉన్నాయి. అవి శ్రవణ, మనన, నిదిధ్యాసనలు.

**శ్రవణం** – ఒక క్రమపద్ధతిలో, క్రమం తప్పకుండా, కొన్ని సంవత్సరాల పాటు, ఒక సమర్థవంతమైన గురువు వద్ద వేదాంతాన్ని అభ్యసించాలి. వేదాంతం అంటే నిర్గుణబ్రహ్మను బోధించే శాస్త్రం. మొదటి నాలుగుదశలూ సగుణబ్రహ్మకు చెందినవైతే, ఐదవదశ నిర్గుణబ్రహ్మజ్ఞానానికి చెందినది. ఈ నిర్గుణబ్రహ్మజ్ఞానాన్ని పొందాలి. కృష్ణపరమాత్మ అలా చెప్పలేదే, మీరెందుకు కొత్తగా చెబుతున్నారు అంటే, కృష్ణపరమాత్మ నాలుగవ అధ్యాయంలో చెప్పినదాన్ని ఇక్కడ గుర్తు చేస్తున్నాము అంతే.

**తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**

**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥** – 4.34

అర్జునా, ఒక గురువు దగ్గరకు వెళ్ళి ఆయన దగ్గర శ్రవణం చెయ్యి అన్నాడు కృష్ణపరమాత్మ.

గురువే లేకుండా స్వంతంగా జ్ఞానం పొందినవారి సంగతేమిటి? బుద్ధి ఊరుకోదు. సందేహాలు కలుగజేస్తూనే ఉంటుంది. మనం మాట్లాడేది సాధారణ నియమం గురించి; కాని అక్కడక్కడ కొందరు ప్రత్యేక వ్యక్తులు ఉండవచ్చు. రామానుజన్ మాథమాటిక్స్‌లో ఒక మేధావి. గురువు ఎవరూ నేర్పకుండానే అద్భుతాలు సాధించాడు. అంతమాత్రాన ఆయన గురువు లేకుండా నేర్చుకున్నాడు కాబట్టి మాథ్ టీచర్లు, స్కూళ్ళు అవసరం లేవు అనగలమా? అది అర్థంలేని మాట. అందువల్ల మనం సాధారణ నియమం గురించి మాట్లాడుతున్నప్పుడు అసాధారణ వ్యక్తుల గురించి చెప్పకూడదు. గురువు చెప్పినా వెంటనే అర్థం కాని మనం స్వంతంగా శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యగలమా?

**మననం** – మననంలో నిశ్చయజ్ఞానం కలుగుతుంది.

**తత్ బ్రహ్మ అహమ్ అస్మి; అహం బ్రహ్మ అస్మి**

మన బుద్ధి తేలిగ్గా ఈ మహావాక్యాన్ని స్వీకరించదు. అది స్వీకరించేదాకా మన బుద్ధి ఏ విధమైన ఆటంకం కలుగజేస్తుందో గ్రహించి, దానికి సంబంధించిన సందేహాన్ని పారద్రోలాలి. ఈ నిశ్చయజ్ఞానం కలుగటానికి చాలా సమయం పడుతుంది.

**నిదిధ్యాసనం** – శ్రవణ, మననాలలో పొందిన జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకోవటానికి తోడ్పడుతుంది నిదిధ్యాసనం. అంటే నేర్చుకున్న ఈ జ్ఞానాన్ని జీర్ణించుకోవాలి. మనం నేను పరిమితి ఉన్న జీవిని, నేను ఫలానా అని అనుకుంటాము. అదంతా నా అసలు స్వరూపం కాదు, నా ఆగంతుక స్వరూపం, నా అసలు స్వరూపం వేరు. నేను స్వరూపరీత్యా చైతన్యాన్ని అనే నిష్ఠలో నిలబడాలి. ఇది నిదిధ్యాసనం.

అలా శ్రవణ, మనన, నిదిధ్యాసనలద్వారా ఈ జ్ఞానాన్ని జ్ఞాననిష్ఠగా మలుచుకుంటే, మన భావోద్రేకాలు కూడా తగ్గుతాయి. మనకున్న సమస్యలు అన్నీ మనస్సు స్థాయిలో ఉన్నాయి. రాగద్వేషాలు, కామక్రోధాలు, భయాందోళనలు – అన్నీ మనస్సును కుదిపివేస్తుంటాయి. ఆ విధంగా సంసారం మనస్సు స్థాయిలో అనుభవిస్తాము, ఈ జ్ఞానం బుద్ధిలో కలుగుతుంది. బుద్ధినుంచి మనస్సులోకి దిగటానికి నిదిధ్యాసనం తోడ్పడుతుంది. అలా మనస్సులో స్థిరపడేదాకా నిదిధ్యాసనం చెయ్యాలి.

**జ్ఞానయోగం = శ్రవణం + మననం + నిదిధ్యాసనం.**

భక్తియోగంలోని ఆఖరిదశ ఈ జ్ఞానయోగం అని చూశాము. రెండవ అధ్యాయంలో వాడిన పరిభాష వాడాలంటే ఈ జ్ఞానం పొంది, ఆ నిష్ఠలో నిలబడిన జ్ఞానిని **స్థితప్రజ్ఞుడు** అంటారు.

ఈ విధంగా కృష్ణపరమాత్మ భక్తిని ఐదుదశలుగా వివరించాడు. మొదటి నాలుగుస్థాయిలు వేదపూర్వభాగానికి చెందినవైతే, చివరిదశ వేద అంతభాగానికి చెందుతుంది. ఇవన్నీ 3–12 శ్లోకాల్లో ఐదుదశల భక్తియోగము కింద చూశాము.

ఇక్కడ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఈ ఐదుదశలూ ఇక్కడ వర్ణించినంత స్పష్టంగా మన జీవితంలో తెలియవు. అంటే మొదటిదశ కొన్నిరోజులు పాటించి, తర్వాత రెండవదశకు వచ్చి, మొదటిదశను వదిలేశాము అని ప్రత్యేకించి చెప్పలేము. అందరూ అన్నిదశలూ తెలియకుండానే పాటిస్తారు కాని ఒక్కో సమయంలో ఒక్కో దశ కొట్టొచ్చినట్టు ఉంటుంది. ఒకదశ దాటి ఇంకొకదశకు వస్తారు అనలేము.

**2. భక్తియోగ ఫలము – శ్లోకాలు 13–20**

ఒక సాధకుడు భక్తియోగములోని ఈ ఐదుదశలూ దాటి జ్ఞానాన్ని పొందితే అతనికి కలిగే ఫలాన్ని ఈ శ్లోకాల్లో చూస్తాము. అహం బ్రహ్మ అస్మి జ్ఞానం పొందితే, అతను పొందే తక్షణఫలం **అహం పూర్ణః అస్మి** ఆనందం.

అసలు ఏ జ్ఞానం పొందినా కలిగే ఫలమేమిటి? అజ్ఞానం తొలిగిపోతుంది.

**జ్ఞానస్య ఫలమ్ – అజ్ఞాన నివృత్తిః**

ఫిజిక్స్ జ్ఞానం పొందితే ఫిజిక్స్ అజ్ఞానం తొలుగుతుంది, కెమిస్ట్రీ అజ్ఞానం తొలగించదు. ఇంగ్లీషు జ్ఞానం పొందితే ఇంగ్లీషు అజ్ఞానం తొలుగుతుంది. అదే విధంగా ఆత్మజ్ఞానం పొందితే ఆత్మ అజ్ఞానం తొలుగుతుంది.

ఈ సూత్రం ప్రకారం తక్షణఫలం ఆత్మజ్ఞానం కలిగితే, ఆత్మ అజ్ఞానం తొలుగుతుంది. అంటే బుద్ధిస్థాయిలో మార్పు వస్తుంది. ఇది ప్రత్యక్షఫలం. కాని ఆత్మజ్ఞానం పొందితే మనస్సు స్థాయిలో కూడా మార్పు వస్తుంది. ఇది పరోక్షఫలం.

ఇదెలా సాధ్యం? బుద్ధిలో జ్ఞానం కలిగితే, మనస్సులో ఉండే రాగద్వేషాలు ఎలా పోతాయి? జ్ఞానానికీ, భావోద్రేకాలకూ ఉన్న సంబంధమేమిటి? ఈ సంబంధం అంత ప్రత్యక్షంగా తెలియదు. బుద్ధిపరంగా ఒక విషయాన్ని నేర్చుకుంటే, మనస్సుపరంగా సంసారభావన పోతుంది అంటున్నారు. అదెలా కుదురుతుంది? ఇది వేదాంతశాస్త్రంలోని ప్రాథమిక అంశం. ఈ వివరణను ఈ పన్నెండవ అధ్యాయం చూస్తున్నప్పుడు గుర్తించలేదు. ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి చూద్దాము.

వేదాంతం ఆత్మజ్ఞానం కలుగజేసేటప్పుడు అహం పూర్ణః అని నేర్పిస్తుంది. అంటే పూర్ణత్వభావనను పెంపొందిస్తుంది. పూర్ణత్వం అంటే పరిపూర్ణత. నాకు ఏ లోటూ లేదు. కాని మనం పుట్టటమే అజ్ఞానంతో పుట్టాము. ఇంగ్లీషు తెలియదు, ఫిజిక్స్ తెలియదు, కెమిస్ట్రీ తెలియదు, ఆత్మ గురించీ తెలియదు. ఎదిగినకొద్దీ ఒక్కొక్క సబ్జెక్టు నేర్చుకుంటూ, వాటి సంబంధిత అజ్ఞానాలను పారద్రోలుకుంటూ వస్తున్నాము. అదే విధంగా ఆత్మజ్ఞానం పొందితే, ఆత్మ అజ్ఞానం కూడా పోతుంది. ఎవరైనా నువ్వు ఎవరు అని అడిగితే అహం సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ అని చెప్పవచ్చు. కాని అలా చెప్పలేకపోతున్నామంటే మనం జ్ఞానం పొందలేదు.

అహం పూర్ణః జ్ఞానం లేకపోవటంవల్ల అహం అపూర్ణః అనుకుంటున్నాము. ఒక అజ్ఞానం అనేక అపోహలకు దారితీస్తుంది. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే అజ్ఞానం అధ్యాసకు దారితీస్తుంది. అధ్యాస అంటే అపోహ. నేను పూర్ణుడను అనే జ్ఞానం లేకపోవటంవల్ల నేను అపూర్ణుడను అనే అపోహలో ఉన్నాము. ఈ అపోహ బుద్ధిస్థాయిలో ఉంది.

మొదటిదశ బుద్ధిస్థాయి. ఆత్మ అజ్ఞానంవల్ల నేను అపోహలో ఉన్నాను. రెండవదశ ఆ అపోహను ఆధారంగా చేసుకుని నేను పూర్ణత్వం పొందటానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తాను. బాల్యంలో బెలూన్లు, బొమ్మలు నాకు ఆనందాన్నిస్తాయని భావించి వాటిని పొందటానికి ప్రయత్నిస్తాను. ఒక వయస్సు వచ్చాక భార్య ఉంటే జీవితం పూర్ణం అవుతుంది అనిపిస్తుంది.

బృహదారణ్యకోపనిషత్తులో బ్రహ్మ కూడా తోడు కావాలనుకున్నాడు అని వస్తుంది.

**తస్మాత్ రమతే తద్ద్వితీయమ్ ఇచ్ఛతే**

అలా జీవితమంతా పూర్ణత్వం పొందటంకోసం ఏదో ఒకటి కోరుతూనే ఉంటాము. దీన్ని కామం అంటారు. ఇది మానసిక స్థాయికి చెందింది.

కామం మానసిక స్థాయిలో సమస్య. అపూర్ణత్వభావన కామానికి దారితీస్తుంది. అపూర్ణత్వభావన బుద్ధికి చెందింది. అది కామంగా మనస్సులో రూపుదిద్దుకుంటుంది. కామం అంటే ఒక వస్తువుమీద కోరిక. ఆ కోరిక తీరకపోతే అది క్రోధానికి దారితీస్తుంది. కోరిక తీరితే లోభానికి దారితీస్తుంది. ఎలాగైనా కామం సమస్యే. కామం క్రోధానికి కానీ, లోభానికీ కాని దారితీస్తుంది. వీటితో పాటు తక్కిన మోహమదమాత్సర్యాలను కూడా కలుపుకోవచ్చు. కామక్రోధలోభమోహమదమాత్సర్యాలను అరిష్వర్గాలు అంటారు. వీటన్నిటికీ మూలం **కామం**. కామానికి మూలం అపూర్ణత్వ అధ్యాస.

అంటే మన సమస్య మన భావోద్రేకాలు నిజమే, కాని వాటికి మూలకారణం మన అజ్ఞానం. అందువల్ల శాస్త్రాన్ని అధ్యయనం చేసి, మన అజ్ఞానాన్ని పారద్రోలితే, అదే కాలక్రమేణా మన భావోద్రేకాలను కూడా తగ్గిస్తుంది. ఎప్పుడైతే మనం నేను పూర్ణుడను అని అర్థం చేసుకుంటామో, అప్పుడు మనకు ఏదైనా కోరే అవసరం ఎందుకు ఉంటుంది?

**ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥** – 2.55

కోరికలు తొలగిపోయి, ఆత్మజ్ఞానం పొంది, ఆత్మలోనే రమించేవారిని స్థితప్రజ్ఞుడు అంటారు.

ఈ అధ్యాయంలో మళ్ళీ స్థితప్రజ్ఞుని లక్షణాలు చూశాము. వాటిని ఇక్కడ మనం వివరంగా చూడబోవటం లేదు. వాటి సారం చూద్దాము.

మనిషి వ్యవహారాలన్నీ మూడు స్థాయిల్లో ఉంటాయి.

ఎ) **కర్తా** – కర్తగా అనేక కార్యక్రమాలను చేస్తాడు.
బి) **భోక్తా** – భోక్తగా అనేక కర్మఫలాలను అనుభవిస్తాడు.
సి) **ప్రమాతా** – ప్రమాతగా అనేక విషయాలను నేర్చుకుంటాడు.

ఈ మూడు స్థాయిల్లోనూ పూర్తి మార్పు వస్తుందని చెప్పాడు కృష్ణపరమాత్మ. ఆ మార్పులేమిటో చూద్దాము.

ఎ) **కర్తా** – ఇన్నాళ్ళూ తను అపూర్ణుడు అనుకుని, పూర్ణత్వం పొందటానికి కర్మలు చేశాడు. అంటే కోరికలు తీరటానికి కర్మలు చేశాడు. ఇంతవరకూ పూర్ణత్వం **పొందటానికి** కర్మలు చేస్తే, జ్ఞానం పొందాక పూర్ణత్వం**తో** కర్మలు చేస్తాడు జ్ఞాని.

ఎప్పుడైతే జ్ఞానికి పూర్ణత్వభావన ఉంటుందో, అప్పుడే ఎవరిమీదా ద్వేషం ఉండదు. గుండె నిండా ప్రేమ, దయ ఉంటాయి. అందరినీ సమానంగా ప్రేమిస్తాడు.

ప్రేమతో పనులు చేస్తాడు కాబట్టి, ఎవరినుంచీ ఏమీ ఆశించకుండా పనులు చేస్తాడు. దానివల్ల పనులు దక్షతతో చెయ్యగలుగుతాడు.

అందువల్ల కర్తగా పూర్ణత్వంతో, ప్రేమతో, దక్షతతో కర్మలు చేస్తాడు జ్ఞాని.

బి) **భోక్తా** – పూర్ణత్వభావనతో కర్మలు చేస్తాడు కాబట్టి అతనికి షాక్ అబ్సార్బర్లు ఉంటాయి. అందరికీ వచ్చే కోపం, చిరాకులు రావు.

సి) **ప్రమాతా** – ప్రమాతగా సమత్వం కలిగివుంటాడు. మానావమానాలకు, సుఖదుఃఖాలకు, శీతోష్ణాలకు చలించడు. రెండింటినీ సమానంగా చూస్తాడు.

ఈ మూడు స్థాయిల్లో మార్పులు వస్తాయి. అంటే కర్తా, భోక్తా, ప్రమాతలుగా జ్ఞానిలో మార్పులు వస్తాయి. ఈ స్థాయికి చేరుకోవటానికి దగ్గర మార్గం ఏమీ లేదు. భక్తియోగం అనే గమ్యం చేరుకోవటానికి ఐదుదశలు ఉన్న నిచ్చెన ఎక్కి రావల్సిందే అన్నాడు కృష్ణపరమాత్మ.

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తేఽతీవ మే ప్రియాః ॥** – 12.20

ఎవరైతే ఈ భక్తియోగాన్ని ఈ ఐదు దశల్లో పాటించి, జ్ఞానం పొందుతారో, అతను **జీవన్ముక్తి** పొందుతాడు.

# స్వామీజీ ఆణిముత్యాలు

వ్యక్తిని ద్వేషించకూడదన్నారు బాగానే ఉంది, అతని చెడు పనులను ద్వేషించవచ్చా? అతను చేసే చెడు పనులను కూడా ద్వేషించకూడదు అంటుంది శాస్త్రం. ఎందుకు? ఆ వ్యక్తిని ద్వేషించటంవల్ల మీరు అతనిలో మార్పును తీసుకురాలేరు. ఒకవేళ ద్వేషించటంవల్ల మార్పు తీసుకురాగలిగితే, రేడియమ్ ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టుగా, దీనికి కూడా 5, 6 సార్లు నేను నిన్ను ద్వేషిస్తున్నానని అరగంటకొకసారి చెపుతూ రావచ్చు. కాని అది సాధ్యం కాదు. ద్వేషించినంత మాత్రాన ఎవరూ మారరు. అందువల్ల ఒకవ్యక్తినీ ద్వేషించ కూడదు; అతని చర్యలనూ ద్వేషించకూడదు. ఒక వ్యక్తిని ద్వేషించకూడదు, ఎందుకంటే అతను భగవత్ స్వరూపం; అతని చర్యలను ద్వేషించకూడదు, ఎందుకంటే అతను మారడు. అందువల్ల ద్వేషం ఏ విధంగానూ లాభంలేదు.

ఎవరినైనా ద్వేషించటం వల్ల అతనిలో మార్పు రాకపోగా, అది మీ మనస్సుమీద పెద్ద దెబ్బ తీస్తుంది. మీరు ద్వేషించే వ్యక్తి బాగానే ఉంటాడు కాని అతన్ని మీరు ద్వేషిస్తూపోతే, మీ మనస్సును బాగా కృంగదీస్తుంది. అసలే అతని దుర్మార్గం మిమ్మల్ని బాధపెట్టింది; అగ్నికి ఆజ్యం తోడయినట్టుగా దానికి మీరు ద్వేషాన్ని జత చేస్తే, మీ పరిస్థితి ఇంకా దారుణంగా ఉంటుంది. అందువల్ల ఎవరినీ ద్వేషించవద్దు అంటుంది శాస్త్రం.